www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 250
సోమవారం | 8-12-2025
శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: చవితి సా.4:03 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా.2:53 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ.11:45-1:16; దుర్ముహూర్తం: మ.12:29-1:13, మ.2:40-3:24; అమృతఘడియలు: రా.8:50-10:20; రాహుకాలం: ఉ.7:30-9:00; సూర్యోదయం: 6:37; సూర్యాస్తమయం: 5:36
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పోలీసులే దొంగల్లా..

అర్ధరాత్రి శవాన్ని తెచ్చి.. మరో ఠాణా పరిధిలో పడేశారు!

- గుర్తుతెలియని మృతదేహం కేసు దర్యాప్తును తప్పించుకొనేందుకు ప్లాన్ 2
- గుట్టుచప్పుడు కాకుండా ఓ షాపు ముందు పడేసి వెళ్లిన కానిస్టేబుల్, హోంగార్డు
- సీసీటీవీ కెమెరాకు చిక్కిన 'దొంగ' పోలీసులు.. యూపీలోని మీరట్‌లో ఘటన



గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేస్తున్న స్టాళ్లు



దావోస్ తరహాలో.. దద్దరిల్లేలా!

ప్రపంచ ఆర్థిక సదస్సుగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- అంతర్జాతీయ సదస్సుకు సిద్ధమైన ఫ్యూచర్ సిటీ
- పూర్తయిన ఏర్పాట్లు.. విజయవంతంగా 'డ్రై రన్'
- సమ్మిట్‌కు హాజరుకానున్న 44 దేశాల ప్రతినిధులు
- నేటి మధ్యాహ్నం ప్రారంభించనున్న గవర్నర్
- సర్వాంగసుందరంగా సమ్మిట్ ప్రాంగణం ముస్తాబు
- ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు
- ఆకట్టుకోనున్న డ్రోన్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు
- కట్టుదిట్టమైన భద్రత నడుమ సదస్సు


బ్లాక్‌క్యాట్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ బలగాలతో సమ్మిట్ వద్ద పహారా

హైదరాబాద్/ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసి.. పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. స్విట్జర్లాండ్‌లోని చిన్న పట్టణమైన దావోస్.. ఐదు దశాబ్దాలుగా ప్రపంచ ఆర్థిక సదస్సు నిర్వహిస్తూ ప్రపంచ ఖ్యాతి పొందినట్లుగానే తెలంగాణలోనూ ఆ స్థాయి సదస్సును నిర్వహించాలన్న ప్రభుత్వ సంకల్పం సోమవారం కార్యరూపం దాల్చనుంది. ఫ్యూచర్ సిటీలో రెండు రోజుల పాటు జరిగే తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో 44 దేశాల నుంచి పారిశ్రామిక దిగ్గజాలు పాల్గొంటున్నారు. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాట్లను ప్రభుత్వం అత్యంత అద్భుతంగా చేసింది. ఆదివారం మధ్యాహ్నం డ్రై రన్‌ను విజయవంతంగా

మిగతా 13వ పేజీలో...

- 'పవర్'ఫుల్ తెలంగాణ! 12
- 2047 నాటికి ఉద్గార రహితంగా మార్చడమే లక్ష్యం
- 9 రంగాలపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- విజన్ డాక్యుమెంట్‌లో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక
- తెలంగాణ 'నెట్‌జీరో' సంస్థ ఏర్పాటు
- 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా పెట్టుబడుల ప్రణాళిక
- 2047 కల్లా ప్రతి ఇంటికి కనీసం 1 జీబీ వేగంతో నెట్ 13
- గ్లోబల్ సమ్మిట్‌కు మూడంచెల భద్రతా వలయం
- ఆరు వేల మంది పోలీసులతో భద్రత 12

నిన్నటిదాకా ఒక లెక్క.. నేటి నుంచి మరో లెక్క

- భారత్ ఫ్యూచర్ సిటీ.. రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క 13
- నా ఊపిరి ఉన్నంతవరకూ తెలంగాణ రైజింగ్‌కు తిరుగుండదు
- అందరికీ ప్రజా పాలన రెండేళ్ల విజయోత్సవ శుభాకాంక్షలు: సీఎం

తెలంగాణ చిరుతిళ్లు

- అతిథులకు 6 రకాలతో డైట్ కిట్
- సమ్మిట్ ప్రాంగణంలో 5జీ, వైఫై 13

డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ!

- హైదరాబాద్‌లోని రోడ్డుకు పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన
- కేంద్రానికి లేఖ రాయనున్న సర్కార్
- గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు రతన్ టాటా పేరు ఖరారు 12


వనపర్తి జిల్లా పెద్దమందడి గ్రామంలో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నామినేషన్‌కు వెళుతున్న బీఆర్ఎస్ నాయకులు

గెలుపు కోసం కలిసిపోదాం!

- 'పంచాయతీ' పోరులో ఆసక్తికర పొత్తులు, వింత అవగాహనలు
- అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్, బీజేపీ నేతల జట్టు
- కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఒప్పందాలు
- మరికొన్ని చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నడుమ కూడా
- సిద్ధాంతాలను పక్కనపెట్టి, 'పంచాయతీ' గెలుపు కోసం దోస్తీ
- ప్రధానంగా అధికార పార్టీకి వ్యతిరేకంగా ఒక్కటవుతున్న విపక్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని గ్రామాల్లో చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీలకతీతంగా ప్రత్యేక గుర్తులతో ఎన్నికలు జరుగుతున్నప్పటికీ రాజకీయ పార్టీలు బలాబలాలను ప్రదర్శిస్తున్నాయి. ఎలా గెలిచామన్నది కాదు గెలవడమే ముఖ్యమన్న రీతిలో వ్యూహాలు అమలు చేస్తున్నాయి. తాము మద్దతిచ్చే అభ్యర్థులను గెలిపించుకోవడానికి.. శత్రువుకి శత్రువు మిత్రుడు అనే ఫార్ములాను గట్టిగా వాడేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో ఊహించని అవగాహనలు, ఆసక్తికర పొత్తులు

మిగతా 3వ పేజీలో...

ఒక్కో సీటుకు.. నలుగురి పోటీ

- రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 3,911 సర్పంచ్ స్థానాలకు 13,128
- 415 స్థానాలు ఏకగ్రీవం..
- ఐదు చోట్ల రాని నామినేషన్లు 3
- వార్డుల బరిలో 78,158 మంది..
- 107 సీట్లకు నామినేషన్లు సున్నా

గోవాలోని నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం 25 మంది మృతి



అగ్నిప్రమాదం జరిగిన బిర్చ్ నైట్‌క్లబ్; ప్రమాదంలో కాలిబూడిదైన సామగ్రి

- బిర్చ్ నైట్‌క్లబ్‌లో అర్ధరాత్రి అగ్నికీలలు
- బాణసంచా పేలుడుతో క్షణాల్లో వ్యాపించిన మంటలు
- ఇరుకుదారిలో బయటకు వెళ్లలేకపోయిన బాధితులు
- బేస్‌మెంట్‌లో చిక్కుకుని ఊపిరాడక పలువురి మృతి
- మృతుల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బంది
- 7 మృతదేహాల్ని గుర్తించాల్సి ఉందన్న గోవా పోలీసులు
- క్లబ్ యజమానులు, మేనేజర్‌పై క్రిమినల్ కేసు నమోదు
- మృతుల కుటుంబాలకు గోవా సర్కారు రూ. 5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా

పనాజీ, డిసెంబరు 7: గోవాలోని ఓ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 25 మంది మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. ఉత్తర గోవాలోని అర్పోరా-నగావ్ గ్రామంలో అర్పోరా నది ఒడ్డున ఉన్న బిర్చ్ బై రోమియో లేన్ అనే నైట్‌క్లబ్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించి క్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. దీంతో మంటల్లో చిక్కుకుని కొందరు, దట్టమైన పొగకు ఊపిరాడక మరికొందరు మరణించారు. మృతుల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది క్లబ్ సిబ్బందిని గుర్తించారు. మరో 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. క్లబ్‌లో బాణసంచా పేలడంతో ఈ ప్రమాదం జరిగిందని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

మిగతా 2వ పేజీలో...



ప్యాకేజ్డ్ ఫుడ్డుకే జై!

- ఆన్‌లైన్‌లో ప్రతి రెండు విక్రయాల్లో ఒకటి ఇన్‌స్టంట్ ఆహారమే
- ఆన్‌లైన్‌లో ఆహారం కొనే కుటుంబాల్లో 39% దీనివైపే..
- ఆయా కుటుంబాల్లోని జెన్ జీ యువతే ఇందుకు కారణం 14
- క్విక్ కామర్స్‌లో నిత్యం కొనుగోళ్లు
- అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు ఉన్న ఆహారంపై ఇష్టత
- దేశవ్యాప్తంగా 277 జిల్లాల్లో సర్వే

దక్షిణాది వంటకంబు.. ఒహోహ్హో మాకె విందు..



మన వంటకాలను ఇష్టంగా తింటున్న అమెరికన్లు

- యూఎస్‌లో దాదాపు పది వేల భారతీయ రెస్టారెంట్లు
- వాటిలో ఏకంగా 2000 రెస్టారెంట్లు.. కాలిఫోర్నియాలోనే!
- ఇండియన్ రెస్టారెంట్ల కేంద్రంగా డాలస్ మెట్రో ఏరియా
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కన్నా కొందరు షెఫ్‌ల జీతమే ఎక్కువ

ఒక పాత సినిమాలో.. విలక్షణ నటి సూర్యకాంతం 'డాలర్ బజ్జీ' అని అమ్మితే నవ్వుకున్నాం!

కానీ.. ఇప్పుడా సీన్ నిజమైంది. అమెరికాలో దక్షిణ భారత రుచులకు ఆదరణ పెరుగుతోంది!!

భారతీయ ఆహారం అంటే నాన్, రోటీ, చికెన్ టిక్కా, మసాలా వంటివే అనుకున్న అమెరికన్లు.. 'కోరి భుజింతును.. గోంగూర పచ్చడి..' అంటూ ఇప్పుడు మన వంటకాలను లొట్టలేసుకుంటూ తింటున్నారు.

(డాలస్ నుంచి కృష్ణమోహన్ దాసరి)

కాలిఫోర్నియాలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే ఒక తెలుగు టెకీ.. తన సహోద్యోగులకు పార్టీ ఇవ్వాలనుకున్నాడు. అందరినీ మధ్యాహ్న భోజనానికి.. దగ్గర్లోని భారతీయ రెస్టారెంట్‌కు తీసుకెళ్లాడు. తీరా అక్కడికెళ్లాక.. వారు ఆర్డర్ చేసిన మెనూ చూసి నివ్వెరపోవడం అతని వంతయింది. ఎందుకంటే.. వారందరూ ఆర్డర్ చేసింది బిర్యానీలు, మసాలా

మిగతా 14వ పేజీలో...

కిషన్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదు

- రాష్ట్రాభివృద్ధికి ఆయన చేసిందేం లేదు
- కేంద్ర ప్రాజెక్టులనూ అడ్డుకుంటున్నారు 12
- 8 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్


ఎన్నికల హామీలు కాంగ్రెస్ అమలు చేయలేదంటూ చెట్టుకు స్కూటీ, డమ్మీ నోట్లు వేలాడదీసి బీజేపీ మహాధర్నాలో నిరసన

కాంగ్రెస్ వంచక పాలనపై మహా ధర్మయుద్ధం

- కమీషన్ల కాంగ్రెస్‌ను గద్దె దించే వరకు విశ్రమించం
- అధికారంలోకి రాగానే అర్బన్ నక్సల్స్‌ను అంతం చేస్తాం
- హిందువులకు ముక్కోటి దేవుళ్లు.. కాంగ్రెస్‌కు ముగ్గురే
- జూబ్లీహిల్స్‌లో గెలిచింది కాంగ్రెస్ కాదు.. మజ్లిస్ పార్టీ
- అందుకే హిందూ దేవుళ్లను అవమానిస్తున్న 'రేవంతుద్దీన్'
- మహాధర్నాలో బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు రాంచందర్‌రావు 12
- మద్యం అమ్మకపోతే కాంట్రాక్టర్లకు బిల్లులివ్వలేని దుస్థితి
- హామీలపై ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాలి: కిషన్‌రెడ్డి

రద్దులోనే విమానాలు



ఇండిగో సంక్షోభంపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

- ఆదివారం 650 సర్వీసులు రద్దు చేసిన ఇండిగో
- విమానాశ్రయాల్లోనే వేలాది మంది పడిగాపులు
- సంక్షోభాన్ని సరిదిద్దేందుకు కమిటీ ఏర్పాటు చేశాం
- ఆదివారం ఉదయానికల్లా 610 కోట్లు రిఫండ్ చేశాం
- పదో తేదీకల్లా అన్ని సర్వీసులు నడుపుతాం: ఇండిగో
- కేంద్ర విధానాల ఫలితమే ఇండిగో సంక్షోభం: కాంగ్రెస్
- ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దు: రామ్మోహన్
- 5 వేల విమానాలు రద్దు.. 8 లక్షల మందికి ఇబ్బంది

న్యూఢిల్లీ/ముంబై, డిసెంబరు 7: దేశంలో విమానయాన సంక్షోభం కొనసాగుతోంది. పెద్ద సంఖ్యలో ఇండిగో విమానాల రద్దు, విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికుల పడిగాపులు కొనసాగుతున్నాయి. ఆదివారం దేశవ్యాప్తంగా 650 ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. అందులో శంషాబాద్ నుంచి 115 సర్వీసులు, బెంగళూరు నుంచి 150, ఢిల్లీ నుంచి 108 సర్వీసులు ఉండటం గమనార్హం. అయితే పరిస్థితిని సరిదిద్దుతున్నామని, బుధవారం నాటికి దాదాపు అన్ని సర్వీసులను పునరుద్ధరిస్తామని ఇండిగో ప్రకటించింది. మరోవైపు

మిగతా 2వ పేజీలో...



వందేమాతరంపై నేడు లోక్‌సభలో చర్చ

- వెలుగులోకి రాని కీలక విషయాలు వెల్లడించేందుకే!
- 150 ఏళ్ల వేడుకల్లో భాగంగానే.. రేపు రాజ్యసభలోనూ
- రేపటి నుంచి సర్ సహా ఎన్నికల సంస్కరణలపై చర్చ

న్యూఢిల్లీ, డిసెంబరు 7: వందేమాతర గీతంపై సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుపనున్నారు. వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకను ఏడాది పాటు నిర్వహించుకోవడంలో భాగంగా ఈ చర్చ చేపట్టనున్నారు. ఈ జాతీయ గేయం గురించి ఇప్పటివరకు వెలుగులోకి రాని పలు కీలక విషయాలను ఈ సందర్భంగా వెల్లడించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభలో వందేమాతరంపై చర్చను ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. అనంతరం రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

మిగతా 2వ పేజీలో...

సీజేఐ కుమారుడికి.. కార్మికుడి కొడుక్కి
ఒకే నిబంధనలా?

» రాజ్యాంగం గురించి కనీస అవగాహనలేని వారే నాపై విమర్శలు గుప్పించారు: జస్టిస్ గవాయ్



ముంబై, డిసెంబరు 7: షెడ్యూల్డ్ కులాల (ఎస్సీల)కూ క్రీమీలేయర్ వర్తింపజేయాలని తీర్పునిచ్చినందుకు తీవ్ర విమర్శల పాలయ్యానని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. రాజ్యాంగ నిబంధనల గురించి కనీస అవగాహన లేని వారే అజ్ఞానంతో తనపై ఆరోపణలు గుప్పించారని చెప్పారు. సీజేఐ కుమారుడికి.. కార్మికుడి కొడుక్కి ఒకే ప్రమాణాలు వర్తింపజేయవచ్చా అని ప్రశ్నించారు. ఎస్సీ కోటాలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న (క్రీమీలేయర్) వర్గాలను రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి దూరంగా ఉంచాలంటూ.. గతేడాది ఆగస్టులో విస్తృత ధర్మాసనంలో భాగమైన జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. అయితే ఆ తీర్పుతో తన సొంత సామాజిక వర్గం నుంచే తీవ్ర విమర్శలు ఎదురయ్యాయని చెప్పారు. ఆనాడు సిటింగ్ జడ్జిగా ఉన్నానని.. అందుకే ఏ వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఏదేమైనా న్యాయమూర్తులు తమ తీర్పుల గురించి చర్చించకూడదని.. అయితే తాను రిటైరయ్యాను కాబట్టి మాట్లాడుతున్నానని వివరించారు. 'నేను రిజర్వేషన్ ద్వారానే సీజేఐ దాకా ఎదిగి.. ఇప్పుడు క్రీమీలేయర్ వర్తింపజేయాలంటూ మాట్లాడానని ఆరోపణలు గుప్పించారు. రాజ్యాంగ నిబంధనలు తెలియని వారే ఇలా మాట్లాడతారు. హైకోర్టు న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవులకు అసలు రిజర్వేషన్లు వర్తించవనేది కూడా వారికి తెలియదు. ఈ పదవుల కోసం పోటీ పడాల్సి వస్తుంది. సాధారణంగా సీనియారిటీని బట్టి 65 ఏళ్ల లోపున్న వారికే అవకాశం దక్కుతుంది. క్రీమీలేయర్‌పై నాకంటే ముందు 1975లో జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్ కూడా మాట్లాడారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టాన్ని, న్యాయమూర్తుల మునుపటి తీర్పులను బట్టే మాట్లాడతాము. నేను చెప్పింది సరైందో.. కాదో దేశ ప్రజలే చెప్పాలని కోరుతున్నా.' అని వ్యాఖ్యానించారు.

శవ రాజకీయాలు చేస్తే ఐదేళ్లు జైలు

రాజస్థాన్‌లో కొత్త చట్టం

జైపూర్, డిసెంబరు 7: శవాలను గౌరవించే చట్టాన్ని రాజస్థాన్ ప్రభుత్వం ఆదివారం నుంచి అమలులోకి తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం.. శవంతో నిరసనలు తెలపడం, శవాలను రాజకీయంగా వినియోగించడం వంటి చర్యలను ప్రభుత్వం క్రిమినల్ నేరాలుగా పరిగణిస్తుంది. మరణించిన వ్యక్తి అంత్యక్రియలను 24 గంటల్లోపు పూర్తిచేయాలి. కుటుంబసభ్యులు రాష్ట్రం వెలుపల ఉండడం లేదా పోస్టుమార్టం రాష్ట్రం వెలుపల జరిగిన సందర్భాల్లో మాత్రమే మినహాయింపు ఉంటుంది. రాజకీయ, సామాజిక ఒత్తిడి కారణంగా కుటుంబసభ్యులు శవాన్ని స్వీకరించకపోతే.. వారిపైనా అధికారులు చర్యలు తీసుకుంటారు. శవంతో నిరసనలు తెలపడం, రోడ్లను దిగ్బంధించడం, ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై ఈ చట్టం ప్రకారం గరిష్ఠంగా 5 ఏళ్ల వరకు జైలుశిక్షతో పాటు జరిమానానూ విధించే అవకాశం ఉంది.

లోకం తీరు



పోలీసులే దొంగల్లా!

» దర్యాప్తు బాధ్యతల నుంచి తప్పించుకోవడం కోసం మృతదేహాన్ని మరో పోలీస్ ఠాణా పరిధిలో పడేసిన ఖాకీలు


ఆటోలోని మృతదేహాన్ని కిందికి దింపుతున్న పోలీసులు

మీరట్, డిసెంబరు 7: సాధారణంగా సీసీటీవీ కెమెరాలకు దొంగలు చిక్కుతుంటారు. యూపీలోని మీరట్‌లో పనిదొంగలైన పోలీసులు పట్టుబడ్డారు. దర్యాప్తు బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు అర్ధరాత్రి వేళ వారు వేసిన ప్లాన్ నిఘా కెమెరా దృశ్యాలతో బట్టబయలైంది. వివరాల్లోకి వెళితే.. లోహియా నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ స్టేషనరీ దుకాణం ముందు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని చూసిన షాపు యజమాని సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించడంతో అసలు విషయం బయటపడింది. ఆ శవాన్ని తెచ్చి అక్కడ పడేసింది పోలీసులేనని తేలింది. ఆ పోలీసులు ఎవరా అని ఆరా తీయగా.. వారిది లోహియా నగర్ స్టేషన్ కాదని, ఎల్-బ్లాక్ ఔట్‌పోస్టు ఠాణాకు చెందిన కానిస్టేబుల్, హోంగార్డుగా గుర్తించారు. గురువారం అర్ధరాత్రి దాటాక వారిద్దరూ బైక్ మీద వచ్చి ఆ దుకాణం ముందు ఆగడం.. వారి వెనకే ఓ ఆటో రావడం.. వారి సమక్షంలోనే ఆటోలోని ఇద్దరు వ్యక్తులు మృతదేహాన్ని దింపి షాపు ముందుపెట్టి వెళ్లిపోయిన దృశ్యాలు రికార్డయ్యాయి. వాస్తవానికి ఎల్-బ్లాక్ ఠాణా పోలీసులు తమ స్టేషన్ పరిధిలో ఆ మృతదేహాన్ని గుర్తించారు. 'మృతుడు ఎవరో కనుక్కోవాలి.. ఎలా చనిపోయాడో దర్యాప్తు చేయాలి.. శవజాగారం తప్పదు. ఈ తతంగమంతా ఎందుకొచ్చిన తలనొప్పి' అని ఆ మృతదేహాన్ని మరో ఠాణా పరిధిలోకి వచ్చే ప్రాంతంలో పడేసి చేతులు దులిపేసుకుందామని భావించారు. కానీ, సీసీటీవీ కెమెరాతో కథ అడ్డం తిరిగింది. ఉన్నతాధికారులు ఎల్-బ్లాక్ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి జితేంద్ర కుమార్, కానిస్టేబుల్ రాజేశ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. హోంగార్డును సర్వీసు నుంచి తొలగించారు.

సోనియా వద్దకు 'కర్ణాటక' పంచాయితీ

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'కర్ణాటక సీఎం సీటు' పంచాయితీ సోనియాగాంధీ వద్దకు చేరింది. శనివారం రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ నేతృత్వంలో కీలక సమావేశం జరిగింది. సోనియా నివాసం జన్‌పథ్ 10లో దాదాపు రెండు గంటలపాటు చర్చలు సాగాయి. సోనియాగాంధీ తొలిసారిగా కర్ణాటకలో నెలకొన్న పరిణామాలపై చర్చించారు. ఖర్గే ఇటీవల సిద్దరామయ్య, డీకేలతో జరిపిన చర్చల సారాంశాన్ని ఆమెకు వివరించినట్లు సమాచారం. ఈ నెల 14న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఓట్ల చోరీ అంశంపై కాంగ్రెస్ భారీ సభ నిర్వహించనుంది. అప్పటిదాకా కర్ణాటక అంశాన్ని ప్రస్తావించరాదని సోనియా సూచించినట్లు తెలుస్తోంది. ఓట్ల చోరీపై ఆందోళన ముగిశాక.. 15వ తేదీన ఢిల్లీలో అందుబాటులో ఉండాలని సిద్దరామయ్య, శివకుమార్‌లను సోనియా ఆదేశించే అవకాశం ఉంది.

రూ.500 కోట్లు ఇస్తే సీఎం పదవి

» నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య సంచలన వ్యాఖ్య

చండీగఢ్, డిసెంబరు 7: పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థిగా నవజ్యోత్ సింగ్ సిద్ధూను పార్టీ ప్రకటిస్తే ఆయన క్రియాశీలక రాజకీయాల్లోకి తిరిగి వస్తారని సిద్ధూ భార్య, పార్టీ నాయకురాలు నవజ్యోత్ కౌర్ సిద్ధూ అన్నారు. ఏ పార్టీకైనా ఇవ్వడానికి తమ వద్ద డబ్బు లేదని, కానీ తాము పంజాబ్‌ను 'బంగారు రాష్ట్రం'గా మార్చగలమన్నారు. ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చునేందుకు ఇవ్వడానికి తమ వద్ద రూ.500 కోట్లు లేవన్నారు. ఈ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఎవరైనా డబ్బులు అడిగారా అని ఆమెను మీడియా ప్రశ్నించగా.. ఎవరూ డబ్బులు అడగలేదు, కానీ రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చిన వ్యక్తి సీఎం అవుతారని ఆమె ఆరోపించారు. అయితే, తన భర్త కాంగ్రెస్‌తోపాటు పార్టీ నాయకురాలు ప్రియాంకా గాంధీతో 'బలమైన అనుబంధం' కలిగి ఉన్నారని చెప్పారు.

ఇండియా కూటమిలో సమన్వయ లోపం: రాజా

న్యూఢిల్లీ, డిసెంబరు 7: ఇండియా కూటమి పార్టీల్లో సమన్వయం లోపించిందని సీపీఐ జనరల్ సెక్రటరీ రాజా వాపోయారు. ఇండియా కూటమి చైర్మన్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఉన్నా కూటమి సమావేశాలే జరగడం లేదన్నారు. కూటమిలోని అన్ని పార్టీలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని తమ పార్టీ కోరుతోందన్నారు. బిహార్ ఎన్నికలు కూటమి పరాజయానికి చక్కని ఉదాహరణ అన్నారు. "ఆ రాష్ట్రంలో సీట్ల పంపకం సరిగ్గా జరగలేదు.. కలిసికట్టుగా ప్రచారమూ లేదు" అని డి.రాజా పేర్కొన్నారు. ఇండియా కూటమి లైఫ్ సపోర్ట్‌పై ఉందని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా శనివారం పేర్కొన్న సంగతి విదితమే.

గజనీ దండయాత్రలపై ఎన్‌సీఈఆర్‌టీ పాఠం

న్యూఢిల్లీ, డిసెంబరు 7: భారతదేశంపై మహమూద్ గజనీ చేసిన దండయాత్రల గురించి విద్యార్థులు మరింత వివరంగా అధ్యయనం చేయనున్నారు. ఈ మేరకు 'ఘజ్నవీడ్ దండయాత్రలు' పేరిట నవీకరించిన ఏడో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకాన్ని ఎన్‌సీఈఆర్‌టీ శుక్రవారం విడుదల చేసింది. ఇంతకుముందు పుస్తకంలో గజనీకి సంబంధించి చిన్న పేరా మాత్రమే ఉండేది. తాజా అధ్యాయంలో గజనీ చేసిన విధ్వంసం, దోపిడీలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ముస్లిమేతర ప్రాంతాల్లో ఇస్లాం మత వ్యాప్తికి చేసిన ప్రయత్నాల సమాచారాన్ని ఆరు పేజీల్లో చిత్రాలు, బాక్సుల రూపంలో పొందుపరిచారు. భారత్‌పై గజనీ 17సార్లు చేసిన దండయాత్రలు, మథురలోని ఆలయాన్ని దోచుకోవడం తదితర అంశాలను ఈ అధ్యాయం వివరిస్తుంది.

కోల్‌కతాలో మెగా గీతా పారాయణం

కోల్‌కతా, డిసెంబరు 7: కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్ శ్రీకృష్ణ నామస్మరణ, శంఖనాదాలతో హోరెత్తింది. ఆదివారం మధ్యాహ్నం ఇక్కడ నిర్వహించిన మెగా భగవద్గీత పారాయణంలో లక్షలాది మంది భక్తులు, సాధువులు పాల్గొన్నారు. '5లక్షల స్వరాలతో గీతా పారాయణం' పేరిట సనాతన్ సంస్కృతి సంసద్ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించింది. గీతలోని మొదటి, తొమ్మిది, 18వ అధ్యాయాల సామూహిక పఠనంలో లక్ష మంది పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. మరోవైపు, వచ్చే ఫిబ్రవరిలో లక్ష మందితో ఖురాన్ పారాయణం నిర్వహిస్తామని టీఎంసీ బహిష్కృత ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ ప్రకటించారు.

గుజరాత్ మాజీ కలెక్టర్‌కు అయిదేళ్ల జైలు శిక్ష

అహ్మదాబాద్, డిసెంబరు 7: ప్రభుత్వ భూమి కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు రుజువు కావడంతో గుజరాత్‌కు చెందిన ఓ మాజీ కలెక్టర్‌కు ప్రత్యేక కోర్టు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. రూ.50వేల జరిమానా కూడా వేసింది. భుజ్ (కచ్) జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ప్రదీప్ నిరంకార్ నాథ్ శర్మకు స్థానిక పీఎల్ఎంఏ ప్రత్యేక కోర్టు ఈ శిక్ష విధించింది. 2003-06 మధ్య ఆయన డిస్ట్రిక్ట్ ల్యాండ్ ప్రైసింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడు వెల్‌స్పన్ కంపెనీకి నిర్ణయించిన ధరకన్నా తక్కువకే ప్రభుత్వ భూమిని అప్పగించారని కేసు నమోదైంది.

రద్దులోనే విమానాలు


ఆదివారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో లగేజీని వెతుక్కుంటున్న ప్రయాణికులు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్య విధానాల ఫలితమే ఇండిగో సంక్షోభమని కాంగ్రెస్ ఆరోపించింది. విమాన చార్జీలపై నియంత్రణలు కొనసాగించాలని డిమాండ్ చేసింది. ఇండిగో సంక్షోభంతో లక్షలాది మంది ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడటం, ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. డీజీసీఏ ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) ఇసిడ్రో పోర్కెరస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. భారీగా విమానాల రద్దుపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా ఇండిగోపై చర్యలు చేపడతామని వెల్లడించింది. ఇక జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని రవాణా, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం.. విమానయాన సంక్షోభంపై దృష్టిపెట్టినట్టు తెలిసింది. ప్రైవేటు విమానయాన సంస్థలు, డీజీసీఏ ఉన్నతాధికారులను పిలిపించి వివరణ కోరనున్నట్టు సమాచారం.

10వ తేదీకల్లా అన్ని సర్వీసులు

ఇండిగో విమాన సర్వీసుల పరిస్థితి మెరుగుపడుతోంది. మొత్తం 2,300 సర్వీసులకుగాను ఆదివారం దేశవ్యాప్తంగా 1,650 సర్వీసులను నిర్వహించామని, 650 విమానాలు రద్దయ్యాయని ఇండిగో ప్రకటించింది. క్రమక్రమంగా అన్నింటినీ మెరుగుపరుస్తూ వస్తున్నామని, బుధవారానికల్లా పూర్తిస్థాయి సర్వీసులు నిర్వహిస్తామని తెలిపింది. మొత్తం 138 ప్రాంతాలకుగాను 135 ప్రాంతాలకు సర్వీసులను పునరుద్ధరించినట్టు వివరించింది. విమానాల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందిపడకుండా వీలైనంత ముందుగానే సమాచారం ఇస్తున్నామని పేర్కొంది. విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం 'సంక్షోభ నిర్వహణ కమిటీ'ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించింది. రద్దయిన విమానాలకు సంబంధించి ప్రయాణికుల సొమ్మును వేగంగా తిరిగిస్తున్నామని, ఆదివారం ఉదయానికల్లా రూ.610 కోట్ల రీఫండ్లు చెల్లించామని తెలిపింది. ప్రయాణికులకు సంబంధించిన 3 వేల బ్యాగులను వారికి అందజేశామని వెల్లడించింది. కాగా, ఇండిగో విమానాల రద్దు కారణంగా.. ఎయిరిండియా నుంచి కనెక్టింగ్ విమాన టికెట్లు, రిటర్న్ టికెట్లు ఉన్నవారు వాటిని రద్దు చేసుకుని తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో దేశీయ ప్రయాణికులకు టికెట్ల రద్దు, ప్రయాణ తేదీ మార్పు కోసం చార్జీలను ఒకసారి మినహాయిస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది.

కేంద్ర గుత్తాధిపత్య విధానాల ఫలితమే: రాహుల్

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ గుత్తాధిపత్య విధానాల కారణంగానే విమానయాన సంక్షోభం నెలకొందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. "ప్రభుత్వ గుత్తాధిపత్య విధానాల కారణంగా సాధారణ ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇండిగో సంక్షోభం ఆ గుత్తాధిపత్య మోడల్ ఫలితమే. భారత్‌లో ప్రతి రంగంలో ఆరోగ్యకరమైన, న్యాయమైన పోటీ ఉండాలి. అప్పుడు ప్రజలకు మేలు జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ కుమ్మక్కు గుత్తాధిపత్య విధానాలతో కాదు.." అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ సంక్షోభం కేవలం ఇండిగో సంస్థ తప్పిదం కాదని.. ఇది డీజీసీఏ, విమానయాన శాఖతో పాటు మొత్తం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని కాంగ్రెస్ నేత చిదంబరం విమర్శించారు.

సిబ్బందిని నిందించొద్దు: సోనుసూద్

ఇండిగో విమాన సర్వీసుల రద్దుతో తమ కుటుంబం కూడా ఇబ్బందిపడిందని బాలీవుడ్ నటుడు సోనుసూద్ చెప్పారు. అయితే, "కొందరు ప్రయాణికులు విమానాశ్రయాల్లో ఇండిగో సిబ్బందిపై అరవడం, తిట్టడం కనిపించింది. ఇది బాధాకరం. ఈ అంశంలో సిబ్బంది కూడా నిస్సహాయులే. అందువల్ల మనం బాధ్యతాయుతమైన పౌరులుగా వారితో మర్యాదగా వ్యవహరించాలి" అని ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

5 రోజులు.. 5 వేల విమానాల రద్దు

ఈ నెల 2వ తేదీ నుంచి ఇండిగో విమాన సంక్షోభం మొదలైంది. 7వ తేదీనాటికి ఐదు రోజుల్లో మొత్తం 5 వేలకుపైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. సుమారు 8 లక్షల మంది ప్రయాణికులు తీవ్రంగా ప్రభావం పడింది. పౌర విమానయాన అమల్లోకి తెచ్చిన 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిట్ (ఎఫ్‌డీటీఎల్)' నిబంధనల ప్రభావాన్ని సరిగా అంచనా వేయడంలో ఇండిగో విఫలమైందని పైలట్ల సంఘాలు తెలిపాయి. సంక్షోభం మొదలయ్యాక చూసుకుంటే ఏకంగా 300 మంది పైలట్లతోపాటు వారికి అనుబంధంగా ఉండాల్సిన సిబ్బంది కొరత ఏర్పడిందని, దానితో వందలాది విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నాయి.

రాజకీయం చేయొద్దు: రామ్మోహన్

కేంద్ర గుత్తాధిపత్య విధానాల కారణంగానే ఇండిగో సంక్షోభమన్న రాహుల్ వ్యాఖ్యలను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ తప్పుబట్టారు. ఇండిగో సంక్షోభ పరిస్థితిని రాజకీయం చేయవద్దన్నారు. "విమానయాన రంగంలో పోటీని పెంచడానికి ప్రభుత్వం అన్నిరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇండిగో సమస్య ప్రజలకు సంబంధించిన అంశం. రాజకీయ అంశం కాదు. ఏదైనా ప్రతిపక్ష నేత పూర్తిగా వివరాలు తెలుసుకుని మాట్లాడితే మంచిది" అని రామ్మోహన్‌నాయుడు సూచించారు.

హోటళ్లు, ఈవెంట్స్ ఆర్గనైజర్లు ఆధార్ కాపీలను తీసుకోవద్దు!

» త్వరలో యూఐడీఏఐ కొత్త నిబంధన

న్యూఢిల్లీ, డిసెంబరు 7: హోటళ్లు, ఈవెంట్ ఆర్గనైజర్స్ వంటి సంస్థలు కస్టమర్ల ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను తీసుకుని నిల్వ చేయకుండా నిరోధించే లక్ష్యంతో త్వరలోనే యూఐడీఏఐ కొత్త నిబంధనను తీసుకురానుంది. జిరాక్స్ కాపీలు తీసుకుని నిల్వ చేయడం ఆధార్ చట్టానికి విరుద్ధం. ఈ నేపథ్యంలో కొత్త నిబంధనను తీసుకురాబోతోంది. ఈమేరకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణను కోరే హోటళ్లు, ఈవెంట్ ఆర్గనైజర్ల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసే నిబంధనకు అథారిటీ ఆమోదం తెలిపిందని యూఐడీఏఐ సీఈవో భువనేష్ కుమార్ తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేయడం లేదా ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న ఆధార్ మొబైల్ అప్లికేషన్ ద్వారా వ్యక్తుల వెరిఫికేషన్‌కు ఆస్కారం ఉంటుందని చెప్పారు. నూతన ధ్రువీకరణ విధానం వినియోగదారుల గోప్యత రక్షణను పెంచుతుందని కుమార్ తెలిపారు.

రక్షణ ఉత్పత్తుల్లో ఘనమైన వృద్ధి

125 ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో రాజ్‌నాథ్

లేహ్, డిసెంబరు 7: దేశీయ రక్షణ ఉత్పత్తుల్లో భారత్ గణనీయమైన వృద్ధి సాధించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2014లో రూ.46 వేల కోట్లుగా ఉన్న భారత రక్షణ ఉత్పత్తి నేడు రికార్డు స్థాయిలో రూ.1.51లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు. ఒకప్పుడు దిగుమతులపై ఆధారపడిన భారత్ నేడు.. ఎగుమతిదారుగా అవతరించిందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా కొన్ని కీలక ప్రాంతాల్లో బీఆర్‌వో రూ.5వేల కోట్లతో నిర్మించిన 125 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రాజ్‌నాథ్ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. లద్దాక్, జమ్ము కశ్మీర్‌తోపాటు సరిహద్దు రాష్ట్రాల్లో బీఆర్‌వో వ్యూహాత్మకంగా 28 రోడ్లు, 93 వంతెనలు, 4 ఇతర ప్రాజెక్టులను నిర్మించింది. ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా లేహ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.."పదేళ్ల క్రితం రూ.వెయ్యి కోట్ల కంటే తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు రూ.24వేల కోట్లకు పెరిగాయి" అన్నారు.

వందేమాతరంపై నేడు లోక్‌సభలో చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగిస్తారు. ఎన్డీయే పక్షాలకు లోక్‌సభలో 3 గంటలు కేటాయించగా, కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ ఉపనేత గౌరవ్ గగోయ్, ప్రియాంకా గాంధీ వాద్రా సహా 8 మంది నేతలు మాట్లాడనున్నారు. అలాగే, మంగళవారం రాజ్యసభలో హోంమంత్రి అమిత్‌షా ఈ అంశంపై చర్చను ప్రారంభించే అవకాశం ఉంది. అనంతరం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు ప్రసంగిస్తారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన ఈ గీతాన్ని 1875 నవంబరు 7న తొలిసారిగా లిటరరీ జర్నల్ బంగదర్శన్‌లో ప్రచురించారు. అనంతరం 1882లో ప్రచురితమైన తన నవల ఆనందమఠ్‌లో బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని భాగం చేశారు. వందేమాతర గీతం 150 సంవత్సరాల ఉత్సవాన్ని ఏడాదిపాటు నిర్వహించుకునే కార్యక్రమాన్ని ప్రధానిమోదీ గతనెల 7న ఢిల్లీలో ప్రారంభించారు. ఏడాదిపాటు విద్యార్థులు, యువతలో జాతీయ గీతంపై అవగాహనను పెంపొందించనున్నారు. కాగా, 1937లో ఈ గీతం నుంచి కీలక చరణాలను కాంగ్రెస్ తొలగించిందని, తద్వారా దేశ విభజనకు బీజాలు నాటిందని మోదీ ఆరోపించారు. మరోవైపు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) సహా ఎన్నికల సంస్కరణలపై మంగళవారం నుంచి పార్లమెంటులో చర్చించనున్నారు. లోక్‌సభలో మంగళ, బుధవారాలు, రాజ్యసభలో బుధ, గురువారాలు ఎన్నికల సంస్కరణలపై చర్చిస్తారు. కాంగ్రెస్ నుంచి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు, రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడనున్నారు.

గోవాలోని నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం..
25 మంది మృతి




మంటల్లో బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. నిబంధనలు అతిక్రమించి, ఏమాత్రం భద్రతా చర్యలు తీసుకోకుండా క్లబ్‌ను నిర్వహించటమే ప్రమాదానికి కారణమని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో క్లబ్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లతోపాటు ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారన్న ఆరోపణలతో అర్పోరా-నగావ్ గ్రామ సర్పంచ్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, గోవా సీఎం ప్రమోద్ తదితరులు సంతాపం తెలిపారు.

ఆనందం క్షణాల్లో ఆవిరై..

గోవా రాజధాని పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అర్పోరా గ్రామంలోని బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్.. రాత్రి ఒంటిగంట సమయంలో క్లబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న డ్యాన్స్ హాల్‌లో ఉషారెక్కించే సంగీతం మారుమోగుతోంది.. దాదాపు వందమంది కేరింతలు కొడుతూ ఆనందంగా గడుపుతున్నారు. అప్పుడే వేదిక వెనుకవైపున పైకప్పు నుంచి చిన్నగా మంట మొదలై.. క్షణాల్లోనే హాలంతా మంటలు పాకాయి. క్లబ్‌లోనివారంతా ఒక్కసారిగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇరుకు దారిలో వెళ్లలేక కొందరు బేస్‌మెంట్‌లో ఉన్న వంటగదిలోకి వెళ్లారు. వారంతా ఊపిరాడక మరణించారని పోలీసులు తెలిపారు. రాత్రిపూట వేడుకలకు ఉత్తర గోవా ప్రాంతంలో బిర్చ్ క్లబ్ చాలా ప్రసిద్ధి. నిత్యం వందలాది మంది క్లబ్‌కు వస్తారు. అయితే, ఈ క్లబ్ నిర్మాణంలోగానీ, నిర్వహణలోగానీ ఏమాత్రం నిబంధనలు పాటించలేదని పోలీసుల విచారణలో తేలింది. లోపలికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు దారులు చాలా ఇరుకుగా ఉన్నాయి. క్లబ్ భవనం జీవితకాలం ముగిసిపోవటంతో కూల్చివేయాలని గ్రామపంచాయతీ కార్యాలయం నోటీసులు కూడా ఇచ్చింది. అయినా క్లబ్‌ను నిర్వహిస్తున్నారు. అందులో పనిచేసే ఉద్యోగుల్లో చాలామంది అర్పోరా గ్రామ వాసులు ఉండగా, కొందరు జార్ఖండ్, అస్సాం రాష్ట్రాల వారు ఉన్నారు. మృతుల్లో కూడా వీరే అధికంగా ఉన్నారు. ప్రమాదంపై గోవా సీఎం ప్రమోద్ సావంత్ మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50వేలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

సిలిండర్లు పేలలేదు: గోవా డీజీపీ

మంటలు అంటుకోవటానికి ముందు క్లబ్‌లో భారీ పేలుడు సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో వంటగదిలో గ్యాస్ సిలిండర్ పేలి ఉండొచ్చని పోలీసులు మొదట భావించారు. అయితే, వంటగదిని పరిశీలించగా సిలిండర్లన్నీ సురక్షితంగా ఉన్నాయని గోవా డీజీపీ అలోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. పేలుడుపై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో క్లబ్ మొత్తం కాలిపోయింది. మంటలు క్షణాల్లోనే క్లబ్ మొత్తం వ్యాపించాయని పోలీసులు తెలిపారు. అగ్నిప్రమాద సమాచారం అందుకొని అగ్నిమాపక శకటాలు అక్కడికి వెళ్లినా.. దారి ఇరుకుగా ఉండటంతో క్లబ్‌కు 400 మీటర్ల దూరంలోనే ఆగిపోవాల్సి వచ్చిందన్నారు.

దౌత్య 'బ్యాలెన్సింగ్'లో భారత్!

» జనవరిలో భారత పర్యటనకు జెలెన్‌స్కీ?.. ఇటీవలే పుతిన్ పర్యటన పూర్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 7: దాదాపు గత నాలుగు సంవత్సరాలుగా యుద్ధభూమిలో కొట్లాడుకుంటున్న రష్యా, ఉక్రెయిన్ విషయంలో భారత్ దౌత్యపరంగా సమతుల్య చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా రెండు రోజుల భారత్ పర్యటనకు వచ్చి వెళ్లారు. పుతిన్ శత్రు దేశమైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా త్వరలో మన దేశంలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జనవరి నాటికి జెలెన్‌స్కీ పర్యటన ఉండే అవకాశం ఉందని జాతీయ మీడియా నివేదికలు పేర్కొన్నాయి. దీనిపై భారత్, ఉక్రెయిన్ అధికారుల మధ్య గత కొన్ని వారాలుగా చర్చలు జరుగుతున్నాయని, పుతిన్ భారత్ పర్యటనకు రాకముందు నుంచే కేంద్ర ప్రభుత్వం జెలెన్‌స్కీ కార్యాలయంతో సంప్రదింపులు చేస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి. యుద్ధంలో ఉన్న రష్యా, ఉక్రెయిన్ పక్షాలతోనూ సన్నిహితంగా ఉండేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. గత ఏడాది జూలైలో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లగా, ఆ తర్వాతి నెలలోనే ఆయన ఉక్రెయిన్‌కు వెళ్లి వచ్చారు. 2022 ఫిబ్రవరిలో రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి భారత్ రెండు దేశాలతోనూ టచ్‌లో ఉంది. భారత్ తటస్థంగా లేదని, శాంతి వైపు ఉంటుందని చెబుతూ వస్తోంది. జెలెన్‌స్కీతో మోదీ ఇప్పటికే దాదాపు 8సార్లు ఫోన్‌లో మాట్లాడారు. 4సందర్భాల్లో ఇద్దరూ నేతలు వ్యక్తిగతంగానూ కలిశారు.

లద్దాఖ్‌లో గల్వాన్ యుద్ధ స్మారకం

» ఆవిష్కరించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, డిసెంబరు 7: గల్వాన్‌లో చైనాతో ఘర్షణ జరిగిన ఐదేళ్ల తర్వాత భారత్.. లద్దాఖ్‌లోని దౌలత్ బేగ్ ఓల్డీ మార్గంలో అత్యంత ఎత్తైన ప్రదేశంలో యుద్ధస్మారకాన్ని నిర్మించింది. 2020 జూన్ 15 రాత్రి సమయంలో చైనా బలగాలతో వీరోచిత పోరాటం చేసి అమరులైన సైనికుల జ్ఞాపకార్థం నిర్మించిన ఈ స్మారకాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆవిష్కరించారు. భారత్ రణభూమి దర్శన్ కార్యక్రమం కింద.. త్యాగం, వీరత్వానికి ప్రతీకగా ఎరుపు-నలుపు రంగు గ్రానైట్ రాళ్లతో త్రిశూలం-ఢమరుకం ఆకారంలో ఈ యుద్ధ స్మారకాన్ని నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌లో మ్యూజియం, డిజిటల్ గ్యాలరీ, గల్వాన్ ఘటన వివరాలు, లడక్ సైనిక చరిత్రను తెలుసుకునే ఏర్పాట్లు చేశారు. ఆడిటోరియం కూడా నిర్మించారు. మరోవైపు చైనాలోని షాంఘైలో భారత్ కొత్త కాన్సులేట్ భవనాన్ని ప్రారంభించింది. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలైన సందర్భాన్ని పురస్కరించుకుని చైనాలో భారత రాయబారి ప్రదీప్ రావత్ దీన్ని ప్రారంభించారు.

గెలుపు కోసం కలిసిపోదాం!

(మొదటి పేజీ తరువాయి)

పొడుస్తున్నాయి. సైద్ధాంతికంగా విభేదాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెడుతున్న పార్టీలు.. అందివచ్చిన పార్టీలు, అభ్యర్థులతో సయోధ్య కుదుర్చుకుంటున్నాయి. సర్పంచ్, ఉపసర్పంచ్ స్థానాలను పంచుకొని, రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై లెక్కలు వేసుకొని మరీ జట్లు కడుతున్నాయి. ముఖ్యంగా అధికార పార్టీకి వ్యతిరేకంగా విపక్షాలు ఒక్కటవుతున్నాయి. అధికార కాంగ్రె్‌సకు వ్యతిరేకంగా బీజేపీ, బీఆర్ఎస్ చాలా ప్రాంతాల్లో కలిసి తలపడుతున్నాయి, ఉమ్మడిగా అభ్యర్థులను నిలబెడుతున్నాయి. కొన్నిచోట్ల కాంగ్రెస్, బీజేపీలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. మరికొన్ని చోట్ల అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కటైపోతుండడం మరింత విడ్డూరం. రాజకీయ పార్టీల ఈ స్నేహం చాలావరకు బహిరంగంగానే జరుగుతుంది. తాము బలపరిచే అభ్యర్థికి మద్దతుగా వేర్వేరు పార్టీలకు చెందిన వ్యక్తులు కలిసి ప్రచారమూ చేస్తున్నారు. కొన్నిచోట్ల అంతర్గత ఒప్పందాలు చేసుకుంటున్న పార్టీలు ప్రత్యర్థికి పరోక్షంగా సహకరిస్తున్నాయి.

ఆసక్తి రేపుతున్న పొత్తులు

మహబూబాబాద్ జిల్లాలోని నాయకపల్లి, బ్రాహ్మణపల్లి, మచ్చర్ల పంచాయతీల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తున్నాయి. గార్ల పంచాయతీలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేస్తున్నాయి. ములుగు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం ఒక్కటయ్యాయి. జిల్లాలోని పస్రా, గోవిందరావుపేట పంచాయతీల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒకే అభ్యర్థిని గెలిపించేందుకు ప్రయత్నిస్తుండగా, ఏటూరునాగారం మండలంలో బీఆర్ఎ‌స్‌కు సీపీఎం, తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో బీఆర్ఎ‌స్‌కు బీజేపీ మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, టేకుమట్ల, రేగొండ మండలాల్లోని కొన్ని గ్రామాల్లోని బీజేపీ నేతలు బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నారు. వరంగల్ జిల్లాలోని కొన్ని గ్రామాలలో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలు పంచుకుని బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైనట్లు ప్రచారం ఉంది. వర్ధన్నపేట మండలం నల్లబెల్లిలో బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఎమ్మార్పీఎ‌స్‌కు చెందిన బిర్రు సునితను సర్పంచ్‌గా బలపరుస్తున్నాయి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి, కక్కిరాలపల్లి పంచాయతీల్లో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు లోపాయికారి సయోధ్యతో పోటీ చేస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో చాలా చోట్ల బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతిస్తున్న బీజేపీ శ్రేణులు కొన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నారు. నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం కోటకొండ, అభంగాపూర్, తిర్మలాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులకు బీజేపీ మద్దతు ఇస్తోంది. కోటకొండలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్‌తో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకున్నాయి. వనపర్తి జిల్లాలోని చిన్నంబావి, ఆత్మకూరు, మదనాపూర్, అమరచింత, పాన్‌గల్, కొత్తకోట మండలాల్లోని పలు పంచాయతీల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఒకే అభ్యర్థితో నామినేషన్లు వేయించాయి. నాగర్‌కర్నూలు జిల్లాలోని అనేక గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేస్తున్నాయి. వికారాబాద్ జిల్లా కడ్తాల, ఆమనగల్లు మండలంలోని మంగళపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ ఉమ్మడిగా అభ్యర్థులను బరిలోకి దించాయి. మేడిగడ్డ తండా, సాలార్‌పూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఉమ్మడిగా ఒకే అభ్యర్థిని బలపరుస్తున్నాయి. కడ్తాల మండలం చరికొండలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి బీజేపీ మద్దతు పలుకుతోంది. షాద్‌నగర్ నియోజకవర్గంలో నామమాత్రంగా పోటీచేస్తున్న బీజేపీ.. స్థానిక పరిస్థితుల ఆధారంగా కాంగ్రెస్ లేదా బీఆర్ఎ‌స్‌కు మద్దతు ఇస్తోంది. నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య సయోధ్య లేదు. కానీ తమ వారు పోటీలో లేని చోట కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వడం ఇష్టం లేక పరస్పరం సహకరించుకుంటున్నారు. నల్లగొండ నియోజకవర్గంలో నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులకు బీఆర్ఎస్ మద్దతివ్వగా, మిగిలిన చోట్ల బీఆర్ఎ‌స్‌తో బీజేపీ అవగాహన కుదుర్చుకుంది. ఉమ్మడి మెదక్‌లోని రాయపోల్, ఎల్కల్, మంతూరు గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ ఒకే అభ్యర్థికి మద్దతు ఇస్తున్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వగ్రామం నకిరేకల్ నియోజకవర్గం బ్రాహ్మణవెల్లంలలో సర్పంచ్ స్థానానికి ఆరుగురు బరిలో ఉండగా బీఆర్ఎస్ అభ్యర్థికి సీపీఎం మద్దతిచ్చింది. జగిత్యాల జిల్లాలో సీపీఎం, సీపీఐ కాంగ్రె‌స్‌తో కలిసి పనిచేస్తున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎవరికి వారే అన్నట్టుగా ప్రధాన పార్టీల తీరు ఉంది. సిరిసిల్ల జిల్లాలో పార్టీల కంటే వ్యక్తుల ఆధారంగా మద్దతు తెలుపుతున్నారు.



రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం మేడిగడ్డ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్‌లో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీ!

అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ రాష్ట్రంలోని పలు పంచాయతీల్లో సయోధ్యతో పని చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఆయా పార్టీల నాయకుల మధ్య కుదిరిన అవగాహన వల్ల.. మండలంలోని సుభాష్‌నగర్, ధనియాలపాడు పంచాయతీలు ఏకగ్రీవం వైపు సాగుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని కొన్ని పంచాయతీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పని చేస్తున్నాయి. పాలమూరు జిల్లా గండీడ్ మండలంలోని ఓ గ్రామంలో బీఆర్ఎ‌స్‌కు కాంగ్రెస్ మద్దతిస్తోంది. మహ్మదాబాద్ మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లిలో గతంలో కాంగ్రెస్, బీఆర్ఎ‌స్‌కు మద్దతివ్వగా, ఇప్పుడు బీఆర్ఎస్ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తోంది. నారాయణపేట జిల్లా జిల్లాల్‌పూర్‌లో బీఆర్ఎస్ సర్పంచ్, కాంగ్రెస్ ఉపసర్పంచ్, వార్డుమెంబర్ పదవులు బీజేపీకి అని ఒప్పందం చేసుకున్నారు. ఇదే జిల్లాలోని సర్వ, ఎలిగండ్లలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు కలిసి పని చేస్తున్నాయి. నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని 22 గ్రామాల్లో కాంగ్రెస్ నుంచే ఇద్దరేసి అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో ఎమ్మెల్యే వ్యతిరేకవర్గ అభ్యర్థులకు బీఆర్ఎస్ మద్దతుగా నిలిచింది.

వరి వేస్తే ఉరే అన్న వారే బోన‌స్‌పై మాట్లాడటం విడ్డూరం

- ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమైనా భ్రమల్లోనే బీఆర్ఎస్ నేతలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ఎద్దేవా



హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గతంలో వరి వేస్తే ఉరే అన్న వారు.. ఇప్పుడు బోనస్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రూ.లక్ష రుణ మాఫీకి ఆపసోపాలు పడి వాయిదాల్లో చెల్లించలేక బీఆర్ఎస్ చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. కానీ, తమ ప్రభుత్వం కొలువు దీరిన ఏడాదిలోనే ఒకే విడతలో రూ.2 లక్షల రుణ మాఫీ చేసిందని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో పట్టణ ప్రజల్లో వ్యతిరేకతను చవిచూసినా.. మళ్లీ ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో 'కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను ఓడించండి' అన్న ప్రకటనలు చూస్తుంటే భ్రమల నుంచి బీఆర్ఎస్ బయటకు రాలేదని అర్థమవుతోందని ఆయన అన్నారు. అరకొర రుణ మాఫీ, పంట కాలమంతా రైతు బంధు చెల్లించిన బీఆర్ఎస్.. తమ సర్కారును విమర్శించడం హాస్యాస్పదమని తెలిపారు. కేంద్రం కొనుగోలు చేయకుండా వదిలేసిన సోయా చిక్కుడు, పెసళ్లను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. కేంద్రం గత సీజన్‌లో సకాలంలో యూరియా పంపకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని, రబీ సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా తొలి 3 నెలల్లో 6 లక్షల టన్నులకు తగ్గకుండా యూరియా సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. అలాగే, రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి 100% కేటాయింపులు రాష్ట్రానికి జరిగేలా చూడాలని కేంద్ర రసాయనాల శాఖ మంత్రికి లేఖ రాశానన్నారు. పత్తి కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఎంత మాత్రం లేదని తెలిసీ బీఆర్ఎస్ నేతల విమర్శలు కళ్లు మూసుకుని గుడ్డి లెక్కలేసిన చందంగా ఉందని తుమ్మల ఎద్దేవా చేశారు.

గ్లోబల్ సమ్మిట్ సన్నాహాలపై సమీక్ష

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లలో వ్యవసాయశాఖ, ఇతర ముఖ్య విభాగాల మధ్య సమన్వయం అవశ్యమని తుమ్మల తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ సన్నాహాల పురోగతిని సమీక్షించడానికి ఆదివారం సమ్మిట్ వార్ రూమ్‌ను ఆయన సందర్శించారు. అధికారులంతా ఒక జట్టుగా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను మంత్రి తుమ్మల పరామర్శించారు. ఇటీవల సీఎం రమేశ్ మాతృమూర్తి రత్నమ్మ మృతి చెందారు. ఈ నేపథ్యంలో కడప జిల్లా ఎర్రగుంట మండలంలోని పొట్లదుర్తి గ్రామంలోని సీఎం రమేశ్ ఇంటికెళ్లి రత్నమ్మ చిత్ర పటానికి పుష్పాలు వేసి నివాళులర్పించారు.

ఒక్కో సీటుకు.. నలుగురి పోటీ

- రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 3,911 సర్పంచ్ స్థానాలకు 13,128మంది పోటీ
- 415 స్థానాలు ఏకగ్రీవం
- 38,342 వార్డు సభ్యుల స్థానాల్లో 8,304 ఏకగ్రీవం



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో జరుగుతున్న రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఒక్కో సర్పంచ్ స్థానానికి నలుగురు పోటీపడుతున్నారు. ఈ దశలో మొత్తం 4,332 సర్పంచ్ స్థానాలకుగాను 415 సీట్లు ఏకగ్రీవమయ్యాయి. రిజర్వేషన్లు, ఇతర కారణాలతో 5 చోట్ల ఒక్క నామినేషన్ కూడా రాలేదు. మిగతా 3,911 సర్పంచ్ స్థానాల కోసం 13,128 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక రెండో విడతలో 38,342 వార్డుసభ్యులు ఉండగా, 8,304 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 107 చోట్ల ఒక్క నామినేషన్ కూడా రాలేదు. దీనితో మిగిలిన 29,903 వార్డుల కోసం 78,158 మంది బరిలో మిగిలారు. అంటే సగటున ఒక్కో వార్డుకు 2.5 మంది పోటీపడుతున్నారు. ఈ నెల 14న రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

ప్రలోభాలకు పాల్పడిన వారిపై కేసులు

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న ఆరోపణలతో సిద్దిపేట జిల్లాలో సర్పంచ్ అభ్యర్థులపై కేసులు నమోదయ్యాయి. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలో ఓటర్లకు మాంసాహార విందు ఏర్పాటు చేసి ప్రలోభానికి గురిచేస్తున్న సర్పంచ్ అభ్యర్థి పన్యాల అర్చన, ఆమె భర్త శ్రీనివా‌స్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎంపీడీవో మార్టిన్ లూథర్ తెలిపారు. ఇక ఇదే జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లిలో సర్పంచ్ అభ్యర్థి నిమ్మ ప్రతిభారెడ్డి ఓటర్లను ప్రలోభపెట్టడానికి తమ ఇంటివద్ద భోజనాలు ఏర్పాటు చేశారని రాజగోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అదే గ్రామంలో మరో సర్పంచ్ అభ్యర్థి భర్త చారగొండ మానస ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు పంచడానికి మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టామని, మద్యం తరలిస్తున్న పిల్లి ప్రభాకర్, పిల్లి అజయ్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా, భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని ఓ గ్రామ సర్పంచ్ పదవిని రూ.12 లక్షలకు వేలం వేసినట్టు తెలిసింది. ఉప సర్పంచ్ పదవిని కూడా వేలం వేయాలని ప్రయత్నించగా.. ఇద్దరు, ముగ్గురు ఆశావహులు ఉండటంతో జరగలేదని సమాచారం.

హామీలు తీర్చకుంటే చెప్పుల దండ వేస్కుంటా

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల పంచాయతీ బీసీ మహిళకు రిజర్వు అయింది. ఇక్కడ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న రాజేశ్వరి తాను గెలిచాక గ్రామాభివృద్ధి కోసం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని.. లేకుంటే గ్రామంలోని కులానికో చెప్పును తన మెడలో వేసుకొని బహిరంగంగా రాజీనామా చేసి వెళ్లిపోతానని బాండ్ పేపర్‌పై రాసివ్వడం చర్చనీయాంశంగా మారింది.

ఐదేళ్లలో పెరిగే ఆస్తులు.. ప్రజలకే పంచుతా

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లిలో ఓ అభ్యర్థి గతంలో సర్పంచ్‌గా పోటీచేసి ఒక్క ఓటుతో ఓడిపోయారు. ఇప్పుడు దానిని గుర్తుచేస్తూ కరపత్రం వేశారు. ఈసారి తనను సర్పంచ్‌గా ఎన్నుకుంటే.. వచ్చే ఐదేళ్లలో తన ఆస్తులు ఎంత పెరిగినా అవన్నీ పంచాయతీకి జప్తు చేసి, ప్రజలకు పంచుతానని అందులో హామీ ఇచ్చారు. ఇంటింటికీ తిరిగి ఈ కరపత్రాన్ని పంచుతున్నారు.

న్యాయం కోసం వెళ్తే కోరిక తీర్చమని వేధింపులు

- మీర్‌చౌక్ ఏసీపీపై దళిత మహిళ ఆరోపణలు
- ఖండించిన ఏసీపీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసు అధికారి వద్దకు వెళితే లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఓ దళిత మహిళ ఆరోపించింది. కోరిక తీర్చనందుకు సిబ్బందితో రాత్రులు ఫోన్‌లు చేయించి ఒత్తిడి పెంచుతున్నాడని ఆమె మీడియా ముందు వాపోయింది. మీర్‌చౌక్ డివిజన్‌కు చెందిన ఓ మహిళ 13 ఏళ్ల కుమారుడితో ఒంటరిగా ఉంటోంది. ఆ మహిళకు ఎదురింటి యువకుడి మధ్య పార్కింగ్ విషయంలో వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో ఆ యువకుడు తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని సదరు మహిళ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసి 6 నెలలు గడవడం, మరోవైపు ఆ యువకుడి వేధింపులు పెరగడంతో మీర్‌చౌక్ ఏసీపీని కలిసింది. ఆ ఏసీపీ కూడా తనతో సన్నిహితంగా ఉంటేనే న్యాయం చేస్తానంటూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని సదరు మహిళ ఆరోపించింది. అంతేకాకుండా రాత్రి సమయంలో పోలీస్ సిబ్బందితో ఫోన్‌లు చేయించి తనపై ఒత్తిడి చేస్తున్నాడని వెల్లడించింది. కాగా, ఆ మహిళ తనపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఏపీసీ శ్యామ్ సుందర్ పేర్కొన్నారు.

అమెరికా అగ్ని ప్రమాద ఘటనలో మరో తెలుగు విద్యార్థి మృతి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని అల్బనీ ప్రాంతంలో ఇటీవల ఓ భవనంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మరో తెలుగు విద్యార్థి ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అన్వే‌ష్‌రెడ్డి సారపెల్లి అనే యువకుడు మృతి చెందినట్లు అమెరికాలోని కాన్సులేట్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడేనికి చెందిన అన్వే‌ష్‌రెడ్డి కుటుంబం కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. న్యూయార్క్‌లోని అల్బనీలో డిసెంబర్ 4న ఓ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు తెలుగు విద్యార్థులు చిక్కుకున్నారు. ప్రత్యేక బృందాలు వారిని ఆస్పత్రికి తరలించాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇద్దరు మృతి చెందారని, మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు. మొదట జనగామ జిల్లాకు చెందిన ఎంఎస్ చదువుతున్న విద్యార్థిని ఉడుముల సహజారెడ్డి మృతి చెందినట్లు ప్రకటించిన అధికారులు.. తాజాగా అన్వే‌ష్‌రెడ్డి కూడా ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. చనిపోయిన విద్యార్థుల భౌతిక ఖాయాలను స్వస్థలాలకు పంపించేందుకు అవసరమైన ఆర్థిక సాయం కోసం 'గో ఫండ్ మీ క్యాంపెయిన్'ను చేపట్టామని సహజారెడ్డి బంధువు రత్న గోపు తెలిపారు.

ఈశ్వరాచారి కుటుంబానికి పొన్నం పరామర్శ

హైదరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరాచారి కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జీ.నిరంజన్‌తో కలిసి జగద్గిరిగుట్టలో నివసిస్తున్న సాయి ఈశ్వరాచారి కుటుంబాన్ని మంత్రి పొన్నం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయి ఈశ్వరాచారి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయడంతోపాటు సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదించి ఎక్స్‌గ్రేషియా అందించడానికి ప్రయత్నిస్తామన్నారు. ఈశ్వరాచారి భార్యకు ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. ఈశ్వరాచారి పిల్లల విద్యాభ్యాసానికి సాయం అందిస్తామని మంత్రి భరోసానిచ్చారు.

కేసీఆర్ కుటుంబంలో ఆస్తి గొడవలు: మంత్రి వివేక్

సిద్దిపేట డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత ఆరోపిస్తున్నార మంత్రి గడ్డం వివేక్ పేర్కొన్నారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబంలో ఆస్తి గొడవలు జరుగుతున్నాయన్నారు. పదేళ్ల పాలనలో రూ.లక్షల కోట్లు అప్పు చేసిన కేసీఆర్.. ప్రజల నెత్తిన భారం మోపారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులన్నీ చెల్లిస్తున్నారని వివేక్ తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పతనం ప్రారంభమైందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందన్నారు.

పోలీసు పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన డీజీపీ

హైదరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ పేట్లబురుజు సమీపంలోని పోలీసు రవాణా సంస్థ(పీటీవో) ప్రాంగణంలో మరొక పెట్రోల్ బంక్‌ను ఆదివారం డీజీపీ శివధర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీపీఎల్ అంబర్‌పేట గ్రౌండ్స్‌లో నూతన పీటీవో భవన నిర్మాణానికి డీజీపీ శంఖుస్థాపన చేశారు. పీటీవో పెట్రోల్ బంక్ గణనీయమైన ఆదాయాన్ని ఆర్జించి సంక్షేమ ఆధారిత సంస్థాగత అభివృద్ధికి దోహదపడుతుందని డీజీపీ చెప్పారు. అంబర్‌పేటలో శంఖుస్థాపన చేసిన భవన నిర్మాణానికి రూ.59 కోట్లు మంజూరు అయ్యాయని, ఇక్కడ వర్క్‌షాపులు, అధునాతన డయాగ్నస్టిక్ సెంటర్లు, మెయింటెనెన్స్ బ్లాక్‌లు నిర్మించనున్నామని తెలిపారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

హైదరాబాద్, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా ఈగ వెంకటేశ్వర్లు, ముఖ్య కార్యదర్శిగా తిరందాసు యాదగిరితో పాటు రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం జరిగిన ఎన్నికల్లో సంఘం కోశాధికారిగా బాలకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎలగందుల రాహుల్ కుమార్, ఉపాధ్యక్షులుగా మామిడాల రవికుమార్, కడవేరు లక్ష్మీపతి, చింతకింది సుజాత, హరిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా ఏపీ మహేష్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు

గోషామహల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఇన్‌చార్జి కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలానెహ్రూ పాలిటెక్నిక్, సరోజినీనాయుడు వనిత మహా విద్యాలయంలలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని మొత్తం 78 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా 36.16 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. మొత్తం 37,142 మంది ఓటర్లలో మహిళలు 5,087 మంది, పురుషులు 8342 మంది మొత్తం 13,429 మంది ఓటు వేసినట్టు చెప్పారు.

తిరుపతి- షిర్డీ వీక్లీ రైలు రేపు ప్రారంభం

చర్లపల్లి నుంచి యలహంక, షాలిమార్‌లకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-సాయినగర్ షిర్డీ మధ్య నూతనంగా ప్రవేశపెడుతున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును డిసెంబరు 9న కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించనున్నారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డితో పాటు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పాల్గొంటారు. తిరుపతి-సాయినగర్‌షిర్డీ-తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్(17425/17426) గూడూరు, గుంటూరు, సికింద్రాబాద్, వికారాబాద్, ఛత్రపతి శంభాజీనగర్ మీదుగా నడుస్తుంది. కాగా, ప్రయాణికుల డిమాండ్ మేరకు చర్లపల్లి-యలహంక, చర్లపల్లి-షాలిమార్‌లకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. డిసెంబరు 8న చర్లపల్లి-యలహంక(07187), 9న యలహంక-చర్లపల్లి(07188), డిసెంబరు 8న చర్లపల్లి-షాలిమార్(07148), 10న షాలిమార్-చర్లపల్లి(07149) ప్రత్యేక రైళ్లు నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

ఏడాదిలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే

- రాయ్‌పూర్-విశాఖల మధ్య వడివడిగా పూర్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాలను కలుపుతూ.. రాయ్‌పూర్-విశాఖపట్నంల మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ఏడాదిలో అందుబాటులోకి రానుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఆదివారం వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ను కలుపుతూ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చిందని తెలిపింది. మొత్తం రూ.16,482 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ కారిడార్‌ను కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీనిని ప్రస్తుత 26వ నంబరు జాతీయ రహదారితో అనుసంధానం చేయడం ద్వారా మొత్తం ప్రయాణ దూరాన్ని 597 కి.మీ. నుంచి 465 కి.మీ.కు తగ్గించనుంది. ఈ కారిడార్ నిర్మాణం ద్వారా 132 కి.మీ. దూరం... దాదాపు ఏడు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుందని కేంద్రం వివరించింది. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ రహదారి అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

హిందూ మతంపై కుట్రలను సహించేది లేదు

మాతమార్పిడులపై విచారణ జరపాలి: విజయ సాయిరెడ్డి

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హిందూమతంపై కుట్రలను సహించేది లేదని, డబ్బు ఆశ చూపి మతం మార్చాలని ప్రయత్నిస్తే, అటువంటి వారికి తగిన గుణపాఠం చెబుదామని ప్రజలకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పిలుపుఇచ్చారు. ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్‌లో.. రెండు దశాబ్దాలుగా హిందూమత మార్పిడులపై ప్రభుత్వం కమిటీ వేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దేశం కోసం, ధర్మం కోసం హిందువులంతా ఒక్కటవ్వాలని సూచించారు. అదే దేశానికి ఆత్మరక్ష, శ్రీరామరక్షగా పేర్కొన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కుల జోరు

- ఆదివారం ఒక్కరోజే 30 వేల మంది దర్శనం
- జనవరి 28 నుంచి మహాజాతర షురూ

తాడ్వాయి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారంలో కొలువైన వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. 2026 జనవరిలో జరగనున్న సమ్మక్క-సారలమ్మల మహాజాతర నేపథ్యంలో భక్తులు ఇప్పటినుంచే ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం ఒక్కరోజే సుమారు 30 వేల మంది అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు. భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, మొక్కులు సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వనదేవతల మహాజాతర జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు జరగనుంది. జాతరకు ఇంకా 50 రోజులు మాత్రమే సమయం ఉండడంతో ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వేలాది మంది భక్తులు పలు వాహనాల్లో మేడారానికి చేరుకుంటున్నారు. దీంతో రహదారులపై వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ మహాజాతర కోసం భక్తుల సౌకర్యార్థం అధికారులు యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, రోడ్ల విస్తరణ, స్నానఘట్టాల మరమ్మతులు, దేవస్థానం పునరుద్ధరణ వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయి.



వనదేవతల గద్దెలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కిక్కిరిసిన యాదగిరి క్షేత్రం

యాదగిరిగుట్ట గర్భాలయంలో క్యూలైన్‌లలో నిల్చున్న భక్తులు

యాదగిరిగుట్ట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో సుమారు 50వేల మంది భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక దర్శనానికి అరగంట, ధర్మదర్శనానికి గంటన్నర సమయం పట్టింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.51,74,567 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

17న 'బ్లాక్2 బ్లూబర్డ్' ప్రయోగం

మరో వాణిజ్య ప్రయోగానికి ఇస్రో ఏర్పాట్లు

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మరో వాణిజ్య ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. ఈ నెల 17న అమెరికాకు చెందిన బ్లాక్2 బ్లూబర్డ్ ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తోంది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనుంది. అత్యంత బరువైన ఈ ఉపగ్రహాన్ని అమెరికాలోని టెక్సా‌స్‌కు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ అభివృద్ధి చేసింది. ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైతే అంతరిక్షం నుంచి నేరుగా స్మార్ట్ ఫోన్లకు కాల్స్, బ్రాండ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రపంచ వ్యాప్తంగా సెల్యులర్ సేవలు అందించాలనే లక్ష్యంతో బ్లాక్2 బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని రూపకల్పన చేశారు. ఇప్పటికే షార్‌లోని రెండో వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్ వద్ద ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమెరికా శాస్త్రవేత్తలు కూడా ఈ ప్రయోగ పనుల్లో పాలుపంచుకుంటున్నారు. షార్ చరిత్రలో ఇది మరో భారీ ప్రయోగం కానుంది.

గజ గజ వణికిస్తున్న చలి

వచ్చే 4 రోజుల్లో మరింత తీవ్రం

హనుమకొండ/ఆసిఫాబాద్/ముత్తారం, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. అన్ని జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చలి తీవ్రతకు ఏజెన్సీ ప్రాంతాలు వణికిపోతున్నాయి. ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలో అత్యల్పంగా 9.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సిర్పూర్ (యు)లో 9.4, కెరమెరిలో 9.7, పెంచికల్‌పేటలో 10.4, సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో 10.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దిత్వా తుపాను ప్రభావం వల్ల రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యే అవకాశం ఉందని తెలిపింది.

చలిమంటలు అంటుకుని వృద్ధురాలి మృతి

చలిమంటలు కాచుకుంటుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని ఓ వృద్ధురాలు మృతి చెందింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేశనపల్లికి చెందిన మందల కమలమ్మ(75) ఆదివారం చలిమంట కాచుకుంటుండగా ప్రమాదవశాత్తు చీర కొంగుకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. ఆమె అరుపులు, కేకలు వేయడంతో గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మంటలను ఆర్పివేశారు. అప్పటికే కమలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.

మధ్యప్రదేశ్‌లో 10 మంది నక్సలైట్ల లొంగుబాటు

బాలాఘాట్, డిసెంబరు 7: మధ్యప్రదేశ్‌లో పది మంది నక్సలైట్లు ఆదివారం ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ముందు లొంగిపోయారు. ఆయుధాలను కూడా అప్పగించారు. వీరిలో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. కన్హా-భోరాందేవ్ (కేబీ) డివిజన్ కమాండర్ సురేందర్ అలియాస్ కబీర్ కూడా లొంగిపోయారు. ఆయనపై రూ.77 లక్షల రివార్డు ఉంది.

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

కుందుర్తి పురస్కారం

ఫ్రీవర్స్ ఫ్రంట్ & హోరు ఆధ్వర్యంలో డిసెంబరు 13న ఉస్మానియా యూనివర్సిటీలో యంగ్ పోయెట్స్ వర్క్ షాప్ జరగనుంది. దియా విఘ్నేశ్‌కు కుందుర్తి పురస్కార ప్రదానం, 'అనవాళ్లు 2024' ఆవిష్కరణ ఉంటాయి. సీతారాం, శీలా సుభద్రాదేవి, కాశీం, శ్రీరాం, అనిల్ డ్యానీ, యాకూబ్, నందిని సిధారెడ్డి, పేర్ల రాము, హాతీరాం పాల్గొంటారు.

కుందుర్తి కవిత, సమత

మాడభూషి స్మారక కమిటీ ద్విదశాబ్ది సభ

మాడభూషి రంగాచార్య స్మారక కమిటీ ద్విదశాబ్ది సభ డిసెంబర్ 14 సా.5.30ని.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. డి.చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన నిఖిలేశ్వర్ 'స్మరణ' (కథా విమర్శ) గ్రంథావిష్కరణ చేస్తారు. సభలో ఏనుగు నరసింహారెడ్డి, సుధామ, నాళేశ్వరం శంకరం, బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు పాల్గొంటారు.

శీలా సుభద్రాదేవి(అధ్యక్షులు)

కథా రచనపై అవగాహన శిబిరం

కళాశాల విద్యార్థులలో తెలుగు కథా రచన పట్ల అభిరుచిని పెంచేందుకు 'వేదిక' (హైదరాబాద్), శిఖర స్కూల్ (విజయవాడ) కలిసి విజయవాడ, శిఖర స్కూల్ క్యాంపస్‌లో 'తెలుగు కథా రచన అవగాహన శిబిరం'ను డిసెంబరు 14న నిర్వహిస్తున్నాయి. శిబిరంలో చిన్నకథల పరిచయం, సరైన తెలుగు భాషా వినియోగం, కథా నిర్మాణం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఆసక్తి గల విద్యార్థులు వివరాలకు ఫోన్: 81426 42638 (అనిల్ అట్లూరి), 88976 23332 (బండ్ల మాధవరావు).

అనిల్ అట్లూరి

'సోమేపల్లి' పురస్కారాల ప్రదానం


చిన్న కథల పోటీలలో విజేతలకు సోమేపల్లి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం 'రమ్యభారతి' ఆధ్వర్యంలో డిసెంబర్ 14 ఉ.10.30గం.లకు అన్నమయ్య లైబ్రరీ మీటింగ్ హాల్, బృందావన్ గార్డెన్స్, గుంటూరులో జరుగుతుంది. ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలను శింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), జి. రంగబాబు (అనకాపల్లి), జి.యస్.కె. కరీముల్లా (నరసరావుపేట) స్వీకరిస్తారు. వేముల హజరత్తయ్య గుప్త, ఆర్.డి. విల్సన్, చిల్లర భవానీదేవి, శ్రీకంఠస్ఫూర్తి తదితరులు పాల్గొంటారు.

చలపాక ప్రకాష్

సాహితీ వేదిక పురస్కారం

రాజమండ్రి సాహితీ వేదిక ఈ సంవత్సరం నుండి తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన, చేస్తున్న వారికి ప్రతి ఏటా ఇవ్వతలపెట్టిన సాహిత్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికి గాను కవీ, కథకుడూ అద్దేపల్లి ప్రభు స్వీకరిస్తారు. డిసెంబరు 25న రాజమండ్రిలో జరిగే సాహితీ వేదిక వార్షిక సమావేశంలో అద్దేపల్లి ప్రభుకు రూ.20వేల నగదుతో పురస్కారం ప్రదానం జరుగుతుంది.

సాహితీ వేదిక



ప్రవాస టిబెటన్ల కవిత్వ ప్రతిఘటన

తల్లి గర్భం నుండి బయటకు రావడమే మొదటి వలస. ఇక ఆ తర్వాత జీవితంలో ఏదో ఒక రూపంలో వలస అనుభవంలోకి వస్తూనే ఉంటుంది. అయితే అన్ని వలసలూ ఒకటి కావు. కొన్ని కోరి తెచ్చుకున్నవి అయితే, మరికొన్ని నెట్టబడ్డ వలసలు. రెండింటిలోనూ ఇబ్బందులున్నా, కోరి తెచ్చుకున్నాక భరించడం తప్ప మొర పెట్టుకునేందుకు ఆస్కారం లేదు. కానీ నెట్టబడ్డ వలసల్లో మొర పెట్టుకునేందుకు కూడా చాలనన్ని ఇబ్బందులు అడుగడుగునా ఎదురవుతూనే ఉంటాయి. ఇలాంటి సంఘర్షణామయ జీవితాలు మాతృభూమితో ఆ ప్రవాసుల బంధాన్ని మరింత బలపడేట్టు చేస్తాయి. ఎప్పటికైనా తిరిగి వెళ్ళే అవకాశం కోసం ఎదురుచూస్తూనే వారు జీవితాలను ఖర్చు పెట్టేస్తారు.

భారతదేశానికీ చైనాకూ మధ్యనున్న టిబెట్ 1950 దాకా పూర్తి స్వతంత్ర దేశం. 1950 నుండి టిబెట్‌ను చైనా ఆక్రమించింది. చైనా అణచివేతను భరించలేక 1959లో దలైలామా టిబెట్‌ని వదిలి భారత దేశం వచ్చి హిమాలయాల దిగువన ఉన్న ధర్మశాలలో తలదాచుకున్నారు. దలైలామాతో బాటు, వేలమంది టిబెట్ వాసులు దేశం నుండి పారిపోయి ప్రపంచంలో అనేకచోట్ల ప్రవాసంలో బతుకుతున్నారు. అధిక సంఖ్యలో భారతదేశంలోనే శరణార్థులుగా గడుపుతున్నారు. ధర్మశాలలో టిబెటన్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా టిబెట్ ప్రభుత్వాన్ని స్థాపించి దలైలామా నడిపిస్తున్నారు. తనతోబాటు టిబెట్ నుండి బయటకు వచ్చిన వారి బాగోగులను, చదువు సంధ్యలను ఆయనే చూసుకుంటున్నారు. ఇప్పుడు దలైలామా తొమ్మిది పదుల వయసుకు చేరుకున్నారు. తన తరువాత ఎలా అన్నది ఆయనకే కాదు, ఆయన మీద ఆధారపడి ప్రవాసం గడుపుతున్న టిబెట్ వాసులకు, వారికి ఆశ్రయమిచ్చిన భారతదేశానికీ ప్రశ్నార్థకమే! మరోపక్క చైనా ఇదే పరిణామం కోసం ఎదురుచూస్తున్నది. అటు చైనా ఇటు భారతదేశం, ఈ రెండు బలీయమైన దేశాల మధ్య టిబెట్ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

టిబెట్ వాసులంటే టిబెట్‌లో ఉన్న వారే గాక, టిబెట్‌లోనే పుట్టి ప్రవాసంలో జీవితాలను గడుపుతున్నవారు, ప్రవాసంలో పుట్టి ప్రవాసంలోనే పెరుగుతున్నవారు కూడా. వారి హృదయాలు తెలియని మాతృభూమి కోసం తహతహలాడుతుండగానే, వారు తెలియని దేశాలలో జీవితాన్ని నిర్మించుకునే సవాలును ఎదుర్కొంటున్నారు. మతం ద్వారా పురాణాల ద్వారా మాత్రమే తెలిసిన భూమికి తిరిగి పోవాలని కోరుకుంటున్నారు. కానీ మాతృభూమిలోని పరిస్థితులు వారిని ఆపుతున్నాయి. అహింసను బోధించే బౌద్ధ సిద్ధాంతాలకు కట్టుబడి, ఆధ్యాత్మిక తండ్రిగా భావించే దలైలామా కోరికకు బద్ధులై, వారు క్రూరత్వాన్ని ఆశ్రయించటం లేదు. అందుకు బదులుగా కవిత్వాన్ని ఆశ్రయిస్తున్నారు.

టిబెటన్ల ప్రవాస అనుభవానికి స్పందనగా దలైలామా 'ఎప్పుడూ వదులుకోవద్దు' అంటూ ఇచ్చిన కవితా సందేశం ఇది: "ఏం జరిగినా/ హృదయాభివృద్ధిని ఎప్పుడూ వదులుకోవద్దు/ కరుణతో ఉండండి/ మీ స్నేహితులతో మాత్రమే కాదు/ అందరితో కరుణతో ఉండండి/ మీ హృదయంలో ప్రపంచంలో/ శాంతి కోసం పని చేయండి/ హృదయాభివృద్ధిని ఎప్పుడూ వదులుకోవద్దు/ మీ చుట్టూ ఏం జరుగుతున్నా సరే."

టిబెటన్ ప్రవాసులకు కవిత్వం ఒక రకమైన సృజనాత్మక ప్రతిఘటన. రాజకీయ అణచివేతను ఎదుర్కొంటూ, తమ గుర్తింపును కాపాడుకోవడానికి కవిత్వం వారికి ఒక సాధనం. ప్రవాస టిబెటన్ల నుంచి మూడు తరాలుగా మాతృదేశ విముక్తి కోసం అనేక విధాల కవిత్వం వస్తూనే ఉంది. వారిలో ప్రముఖంగా రాస్తున్న వారు వందమంది కంటే ఎక్కువగానే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ కవిత్వంతో ప్రభావితమవుతున్నారు, దానిలో వ్యక్తీకరించబడిన వేదనలో పాలుపంచుకుంటున్నారు.

టిబెట్ సమకాలీన కవిత్వంలో టెన్జిన్ సుండు, భుచుంగ్ డుమ్రా సోనమ్ లాంటి కవులు, తమ కవితలలో బౌద్ధ తాత్త్వికతను జోడించి, ప్రవాసం, ఆశ, నిరసన వంటి భావాలను వ్యక్తీకరిస్తున్నారు. ఈ కవిత్వం కేవలం మతపరమైన ఉపదేశాలను మాత్రమే ప్రతిబింబించడం లేదు, జీవన పోరాటాన్ని ఎదుర్కోవడంలో ఒక మానసిక సాధనంగా కవిత్వం ఉపయోగపడుతున్నది. తమ వ్యాసాలు, కథలు, కవితలు, వెలుగు చూడడానికి ఒక ప్రచురణ సంస్థని వెబ్‌సైట్లని, వారికి వారే నెలకొల్పుకున్నారు.

> **టిబెటన్ ప్రవాసులకు కవిత్వం ఒక రకమైన సృజనాత్మక ప్రతిఘటన. రాజకీయ అణచివేతను ఎదుర్కొంటూ, తమ గుర్తింపును కాపాడుకోవడానికి వారికి కవిత్వం ఒక సాధనం.**

"తెల్లని గులకరాళ్ళను ఏరుకో/ విచిత్ర వింత ఆకుల్నీ/ వంపుల్ని చుట్టూ కొండల్ని గుర్తుంచుకో/ నీకు అవసరం కావొచ్చు/ మళ్ళీ ఇంటికి రావడానికి," అని బహిష్కరించబడిన ప్రముఖ కవి రచయిత, టెన్జిన్ సుండూ ఆశపడుతూనే ఉంటాడు. "నేను టిబెటన్‌ని/ కానీ టిబెట్‌కు చెందినవాడిని కాదు/ ఎప్పుడూ అక్కడకు వెళ్లలేదు/ అయినా నేను కలలు కంటూనే ఉంటాను/ అక్కడే చనిపోదామని" అంటాడు.

"నా వెదురు వేణువు ధ్వని/ గాఢంగా ఉన్నపుడు/ ఆహ్వానం లేకుండా/ పక్షులు నా చుట్టూ తిరిగాయి/ ఇప్పుడు ఈ విరిగిన వేణువు నిస్సార ధ్వని/ సముద్రకాకుల దృష్టినైనా ఆకర్షించడం లేదు" అని వాపోతాడు దివంగత కవి న్గోడుప్ పాల్జోర్. టిబెట్, హిందీ, సంస్కృతం, పాలీ, థాయ్, ఇంగ్లీష్ బాషలలో నిష్ణాతుడైన న్గోడుప్ పాల్జోర్ హవాయి విశ్వవిద్యాలయంలో పనిచేసేవాడు.

"పాలుతాగే పసివాడిగా ఉన్నపుడు/ భూమ్యాకాశాల గురించి, నేనెప్పుడూ అనుకోలేదు/ కానీ నాకు ఒక అస్పష్ట అభిప్రాయం ఉండేది/ మాతృభూమి కౌగిలంత తీయదనం/ ప్రపంచంలో ఏదీ లేదని" - చైనా సైన్యంలో దుబాసిగా, అధ్యాపకుడిగా పనిచేసి, కవిత్వంతో అనేక ప్రయోగాలు చేసిన రబ్ గై భసంగ్ అంటాడు.

"జీవితాన్ని నేను నిర్వచించను/ మరణం నాకు తెలియదు/ రోజులు నేను చూడను/ రాత్రులు నేను తెలుసుకోను/ అస్పష్టత మాత్రమే రాజ్యమేలుతుంది/ ఒక వెర్రి బిందువు వరకూ గందరగోళం/ శాశ్వతంగా కరిగిపోతుంది/ శూన్యంలో మనసు మునిగిపోయింది/ చీకటి నన్ను గుల్ల చేస్తూ/ ఉదాత్తమైన కోలాహలపు లోతైన సొరంగం నుండి/ ఉన్మాద స్థితికి ఎదిగి/ సంపూర్ణ నిశ్శబ్దంలో శబ్దం చేస్తూ నేను బయటకొచ్చాను" అంటాడు ప్రముఖ టిబెట్ కవి, అనువాదకుడు, సంపాదకుడు భుచుంగ్ డుమ్రా సోనమ్.

టిబెట్, ఇంగ్లీష్, హిందీ భాషలలో రాసే కవయిత్రి సోనమ్ త్సోమో చాపట్సాంగ్. ఆమె అమెరికాలో ఉండగా తన తల్లి మరణించిన తర్వాత నలభై తొమ్మిది రోజుల 'బార్దో' గురించి కవిత్వం రాసుకున్నది ('బార్దో' అంటే మరణానికి పునర్జన్మానికి మధ్య ఉంటుందని బౌద్ధులు భావించే సమయం): "నేను ఈ అసౌకర్య/ తెలియని ప్రదేశంలో ఉన్నాను. అక్కడ నా తల్లి కుమార్తెగా నేను ఏమి చేయాలో నాకు తెలియదు. ఇక్కడ నేనూ, నా ఆలోచనలు మాత్రమే, నాకు తెలిసిన ఏకైక విషయం. నలభై తొమ్మిది రోజులు, రోజులు గడిచేకొద్దీ వాటిని కవితలుగా రాసుకున్నాను. నా జీవితంలో ఆ కష్ట సమయంలో నా భావాలు ఏమిటో కాగితం మీద చూసుకుందుకు" అని ఆమె చెప్పుకుంది.

"ఇసుకలో చెల్లాచెదురయిన విత్తనాలు/ వికసించాలన్న దాహంతో ఉంటాయి/ బృందగానంలో కోల్పోయిన పాటలు/ వినబడాలని ఆకాంక్షతో ఉంటాయి" - అని ఆశపడుతూనే ఉండేవాడు, దివంగత కె. ధోండప్ ప్రముఖ కవి, చరిత్రకారుడు, పాత్రికేయుడు.

టిబెటన్ల వర్తమానం గురించి, వారి మాతృభూమి పరిస్థితి గురించి, ప్రస్తుత దలైలామా తమ్ముడు టెన్జిన్ చోగ్యాల్ ఇలా చెప్పుకున్నాడు - "కాలిపోతున్న భవనంలోంచి బయటకు పరుగెత్తే పిల్లాడు, దానినుండి బయటపడడానికి శక్తిలేనివాడు, వాడు చేయగలిగినదల్లా, 'మంటలు, మంటలు' అని అరవగలగడమే. బలమైన వ్యక్తులు, పెద్దలెవరో వింటారని, ఎవరో ఒకరు పట్టించుకుంటారని, వాడిని రక్షించడానికి ఏదో ఒక చర్య తప్పకుండా తీసుకుంటారని ఆశపడతాడు. ఖచ్చితంగా అదే మనం టిబెట్ వాసులం చేస్తున్నాం. మన ఇల్లు శిథిలమైపోతోంది. మన బంధువులు అక్కడ ఉన్నారు. అది ఇప్పటి టిబెట్ పరిస్థితి. మనం ప్రపంచమంతటా నివసిస్తున్న నిర్వాసిత ప్రజలం అయిపోయాం. ప్రస్తుత చైనా ఆక్రమిత టిబెట్‌లో మన బంధువులను రక్షించుకుందుకు, మన ఇంటిని చేరుకుందుకు, మానవాళికి విన్నవించుకుందుకు మనం ఆ పిల్లడిలానే ఏడుస్తున్నాం." అని చెప్పుకున్నాడు. అది ఎంత వాస్తవమో కదా అనిపిస్తుంది టిబెట్ ప్రవాస కవిత్వాన్ని చదివినప్పుడు.

■ ముకుంద రామారావు
✆ 99083 47273




ప్రతీక్ష

గూడెం గుమ్మంలో మొలిచింది
అమ్మోరు దేవతలాంటి చెట్టు
దాని పచ్చని కాంతులు
దిక్కులకు రంగులు దిద్దాయి
ఆ నిప్పుల వేడిలోనే
రాత్రికి చకచకా పదును పెట్టారు
మెరుపు కళ్లకు గోరింటలు దిద్దారు
చివరాఖరకు, చీడ చెరబట్టింది
అడవిని కాలం ఎరుగని చీకటి కమ్మింది
చెట్టు శిశిరానికి తలవంచింది
పశ్చాతాపంతో పిట్టలన్నీ
రెక్కల్ని అవనతం చేశాయి
వేలాది చుంబానాల మధ్య
దగ్ధ జ్ఞాపకమైన మొద్దు
వసంతాన్ని ప్రాధేయపడుతోంది

■ దేశరాజు

ఈ పుస్తకం చదివాక క్వియర్ వ్యక్తులే తమ కథలు రాస్తారని ఆశ

స్త్రీ-పురుషుడు అనే జెండర్లు మాత్రమే ఉంటాయనీ, వారిరువురికీ మధ్య ఉన్న పరస్పర ఆకర్షణ మాత్రమే సహజమనీ సమాజం నమ్ముతుంది. ఇలాంటి అభిప్రాయాలకు లోబడని భావాలు, గుర్తింపులు లేదా అనుభవాలు ఉండే వారిని క్వియర్ వ్యక్తులు అంటారు. గే, లెస్బియన్, బై సెక్సువల్, ట్రాన్స్... లేదా ఫలానా అని ఏ లేబుల్ వేసుకోలేనివారిని కూడా క్వియర్ అంటారు. తెలుగులో ఈ థీమ్స్‌మీద ఇటీవలే ఎక్కువ సాహిత్యం రావటం మొదలైంది. ఇప్పుడు ఈ ఇతివృత్తంపై 1922 నుంచి 2025 దాకా తెలుగులో వచ్చిన కథలతో 'అదే ప్రేమ' కథా సంకలనం వెలువడింది. ఈ సందర్భంగా ఈ పుస్తకం ఎడిటర్ **అపర్ణతోట**తో వివిధ సంభాషణ:



'క్వియర్' (Queer) ఇతివృత్తాలు ఉన్న కథలతో ఈ సంకలనం తేవాలన్న ఆలోచన గురించి చెప్పండి? ఈ సంపుటి ద్వారా మీరు ఆశిస్తున్నది ఏమిటి?

అస్తిత్వ ఉద్యమాలకు ముందే ఆ అస్తిత్వానికి (ఐడెంటిటీకి) చెందని ఎందరో రచయితలు వివిధ అంశాలను స్వతహాగా పూనుకుని రాశారు. ఉదాహరణకు స్త్రీవాద ఉద్యమం రాక మునుపే చలం, కొ.కు, శ్రీపాద; అలానే దళిత ఉద్యమానికి ముందే జాషువా, రావి శాస్త్రి, ఉన్నవ, స్మైల్, కె.ఎన్.వై పతంజలి రాశారు. తరవాత ఉద్యమాలకు అనుసంధానంగా వచ్చిన సాహిత్యం కూడా మనకు తెలుసు. సాహిత్యం వలన సమాజం మారుతుందా మారదా అనే డిబేట్ లోకి నేను పోను. కానీ ఉద్యమ నేపథ్యం, ప్రాముఖ్యత పాఠకులకు లేదా సాధారణ ప్రజలకు చేరడానికి సాహిత్యం చాలా అవసరం. క్వియర్ ఉద్యమ సందర్భంలో తెలుగు సాహిత్యంలో ఇప్పటిదాకా క్వియర్ అంశాలకు ఎంత చోటు ఇచ్చారో చూడాలన్న ఆసక్తితో ఈ పనిని తలకెత్తుకున్నాను.

ఒక చదువరిగా క్వియర్ సాహిత్యానికి తక్కువ స్థలమే కేటాయించి ఉంటారన్నది తెలుసు కాని, ఒకసారి ఈ విషయాన్నీ అందరి దృష్టికి తీసుకురావడానికి ఇది మంచి మార్గంగా అనిపించింది. పైగా, సమాజపు చూపులోని మార్పును ఈ కాలానుగుణంగా వచ్చిన ఈ కథలు ప్రతిబింబిస్తాయి. అసలు కారణమైతే, ఈ పుస్తకం చదివాక క్వియర్ వ్యక్తులే కథలు రాస్తారనీ, వారి జీవితాలను అందరికి అర్థమయేలా చేస్తారని.

మనుషుల మధ్య ఎన్ని పోటీలు, కక్షలు, కార్పణ్యాలు ఉన్నా, ప్రేమ కూడా ఏకసూత్రంగా అందరిని కలుపుతుంది. అటువంటి సమయాల్లో వారి పట్ల ప్రేమను, వారి మధ్య ప్రేమను వివక్షతో చూస్తామెందుకు? ఆ ఉద్దేశంతోనే, ఇదే సంకలనంలో మానస ఎండ్లూరి రాసిన 'అదే ప్రేమ' కథ శీర్షికనే ఎంచుకున్నాము.

కథల ఎంపికకు వేటిని ప్రమాణాలుగా అనుకున్నారు?

క్వియర్ పాత్రలే ప్రధాన పాత్రలు కావాలి అని, వారి జీవితంలో జరిగే ఘర్షణను మాత్రమే ప్రెజెంట్ చేసే కథలు తీసుకున్నాను. అయితే ఎంపికకు పెద్దగా కష్టపడలేదు. మన కథలలో రెప్రెసెంటేషన్ మీద ఇంకా పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. కాబట్టి సపోర్టింగ్ కారెక్టర్లుగా ఏ కథలోనూ క్వియర్ వ్యక్తులు లేరు. అంటే రచయితలు రాయాలనుకుని రాసిన కథలే గాని, క్వియర్ వ్యక్తులను సమాజంలో bystandersగా తెలిపిన కథలు ఇంచుమించుగా లేవు.

తెలుగులో 'క్వియర్' అంశం చుట్టూ తిరగిన మొదటి కథగా దేన్ని చెప్పవచ్చు?

విశ్వనాథ సత్యనారాయణ గారు 1922లో సాహితి పత్రికలో 'ఇంకొకవిధము' అనే రెండు పేజీల చక్కని కథను రాశారు. నాటక రంగంలో ఉన్నవారు కొంచెం లిబరల్‌గా ఉన్న వాతావరణంలో ఉంటారనేమో, అటువంటి నేపథ్యాన్ని ఎంచుకున్నారు.



> **మన మెయిన్ స్ట్రీమ్ సాహిత్యంలో ఇప్పటికీ క్వియర్ వ్యక్తుల ప్రస్తావన లేదు. మన అసమానతలలో ఉన్న వైవిధ్యం వలన అనుభవాల ద్వారా లేదా కళ్ళకెదురుగా కనబడే అసమానతనే వెలుగులోకి తెచ్చాము. క్వియర్ జీవితాలు అంచున ఉండడమే కాక ప్రధాన స్రవంతిలో మనకు ఎదురయ్యే సందర్భాలు చాలా తక్కువ కాబట్టి సాహిత్యంలో ఈ వస్తువు నిర్లక్ష్యానికి గురైంది.**

ఒక పేరున్న నాటక కళాకారుడు, ఆయనను ఆరాధించే ఒక పిల్లవాడు- ఆ పిల్లవాడి ఆరాధన, ఆయన అనురక్తి గురించి చాలా సున్నితంగా చెప్పారు. ప్రేమకు ఇంకొక విధము కూడా ఉంటుందని చెప్పడం ఆయన ఉద్దేశం అనుకుంటాను. కానీ ఆ కథ వారి మధ్య ఉన్న ప్రేమను, కరుణను గురించి చెబుతుంది కానీ శారీరక అనుబంధం ఉన్నాదని ఎక్కడా చెప్పలేదు. ఇది ఒక Asexual bonding అన్నారట ఆయన తన మనవడితో. క్వియర్ ఉనికిలో Asexual - Romantic/ Aromantic సంబంధాలు ఉంటాయని చాలామందికి తెలీదు. ఎంతసేపు క్వియర్ సంబంధాలని సెక్సువల్ సంబంధాలుగానే చూస్తారు.

మీరు గమనించిన తెలుగు 'క్వియర్' కథలు బయటి దేశాల 'క్వియర్' కథలతో పోల్చినప్పుడు ఎలా భిన్నంగా ఉన్నాయి?

బయటి దేశాల క్వియర్ కథలు క్వియర్ వ్యక్తులే రాస్తారు. ఒకవేళ నాన్ క్వియర్ వ్యక్తులు రాస్తే చాలావరకు క్వియర్ పాత్రలను సహాయ పాత్రలుగా చూపించడమో లేక వారిని ప్రధాన పాత్రలుగా చూపిస్తే సరైన రీసర్చ్ చేసి చూపిస్తారు. వారి సాహిత్యంలో చాలా ముందే అంటే, ఇంచుమించుగా 60 ఏళ్ళ ముందే క్వియర్ క్యారెక్టర్ల ప్రస్తావన ఉంది. కానీ మన మెయిన్ స్ట్రీమ్ సాహిత్యంలో ఇప్పటికీ క్వియర్ వ్యక్తుల ప్రస్తావన లేదు. మన అసమానతలలో ఉన్న వైవిధ్యం వలన అనుభవాల ద్వారా లేదా కళ్ళకెదురుగా కనబడే అసమానతనే వెలుగులోకి తెచ్చాము. క్వియర్ జీవితాలు అంచున ఉండడమే కాక ప్రధాన స్రవంతిలో మనకు ఎదురయ్యే సందర్భాలు చాలా తక్కువ కాబట్టి సాహిత్యంలో ఈ వస్తువు నిర్లక్ష్యానికి గురైంది.

అంతేగాక, తెలుగు రచయితలు క్వియర్ కథలను రాసినా, అది బైనరీ (ఆడ-మగ) లెన్స్ తోనే రాసినది. దాని అర్థం: కొన్ని కథలలో పాత్రలను క్వియర్ పాత్రలుగా కాక ఇంకేదైనా వైవిధ్యంతో (కులం, శరీర వైకల్యం, వర్గం) మార్చినా కథలో విపరీతమైన మార్పులేమీ కనిపించవు. దీనికి కారణం రచయితలు వారి ప్రాంతాలకు వెళ్ళకపోవడం, వారితో స్నేహం చేయకపోవడం, వారి జీవితాల గురించి కళ్ళకు కనపడినంతే చూసి రాసేయడం, కొన్నిసార్లు అపోహలతో కథలు రాయడం (ఇది అన్నిటికన్నా ప్రమాదం). దీనికి కారణం క్వియర్-నాన్ క్వియర్ జీవితాలు రెండు పారలల్ గీతాలలా సంబంధం లేకుండా నడుస్తాయి. కానీ క్వియర్ జీవితాలలో హింసను ప్రేరేపించేది నాన్ క్వియర్ సిద్ధాంతాలే. కాబట్టి నాణ్యమైన క్వియర్ కథలు రాయాలి అంటే వారితో సంభాషణ, స్నేహం పెరగాలి.

thota.aparna@gmail.com

'భూపతి చంద్ర' కథానికల పోటీ

'భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్, ప్రజ్ఞాపురం, గజ్వేల్ నిర్వహిస్తున్న 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీకి ఆహ్వానం. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.10వేలు, 8వేలు, 6వేలు. ఐదు ప్రోత్సాహక బహుమతులు ఒక్కొక్కరికి రూ.2 వేలు. కథానికలను డిటిపిలో ఏ4 సైజు 4 పేజీలు మించకుండా జనవరి 1 లోపు ఈమెయిల్: bcmkantha@gmail.comకు, లేదా వాట్సాప్: 9959020513కు, లేదా చిరునామా: ఆనంద నిలయం, ఇం.నం.1-5-1020/4, బి.ఆర్. రావు నగర్, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ - 500 010కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 99636 16999.

ఎమ్.ఎల్. కాంతారావు

తెలుగు కథల పోటీ

తిరుపతి- విశ్వశ్రీ సాహితీ సమాఖ్య, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ 2026 మార్చి 19 పరాభవ నామ ఉగాది సందర్భంగా తెలుగు కథల పోటీని నిర్వహిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5116, రూ.3116, రూ.2116, ఐదు ప్రోత్సాహక బహుమతులు రూ.1116. ఉత్తమ 25 కథలతో ఒక సంచిక ముద్రిస్తారు. ఏ4 సైజ్‌లో 3 పుటల లోపు కథలను డిసెంబరు 31 లోగా ఈమెయిల్: viswasrikadha2025@gmail.com కు పంపాలి.

గార్లపాటి దామోదర నాయుడు

నవలా రచన పోటీ

జొన్నలగడ్డ రాంబొట్లు-సరోజమ్మ స్మారక నవలా పోటీకి 'మారుతున్న విలువలు, చదువులు, తల్లిదండ్రుల బాధ్యత, యువత నేపథ్యం' అంశంపై నవలలు పంపాలి. ఉత్తమ నవలకు రూ.40వేల నగదు బహుమతి. ఎంపికైన ఇతర నవలలకు ప్రత్యేక పురస్కారాలు. నవలలను మార్చి 1, 2026లోపు వర్డ్ లేదా, పి.డి.ఎఫ్ ఫార్మాట్‌లో పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 99488 96984, ఈమెయిల్: subbujvr@gmail.com.

సిరికోన సాహితీ అకాడెమీ



గారడీ తెరలో మా పేట

అంతకుమునుపు....
ఊరవతల విసిరేసిన
మసిపాతల మూట లాంటి మాపేటలో
గురయ్య తాత సన్నాయి
పేటకి వేకువ పాటైయ్యేది
తంబురాపై జమ్మయ్య తాత తత్వం
మానవ మహేతిహాసాన్ని గానం చేసేది
తెల్లారగట్ల చదువుతో తెలివబ్బుతుందని
బుడ్డీల వెలుగులో పేట వేకువ బడయ్యేది
నాటుమందుల కూరయ్య తాత దొడ్డి
పురిటికందుల కేరింతలతో ఘోషాసుపత్రయ్యేది

పొద్దుబోతే చాలు బురికెడు సారా సుక్కలేసి
పుచ్చాల పోతన్న పురాన్లతో పేట పూనకమయ్యేది
మమకారం ఆర మగ్గిన తుమ్మిక పండయ్యేది
ఎలక్కాయలా వగరు బారిన ఎటకారముండేది

తిల్లేల దాటితే....

మోషే నుండి యేసయ్య వరకూ
సారంగధర నుండి దువ్వన్నదొర వరకూ
పేట కతల పుట్టయ్యేది
మాలవారి మంగమ్మ, యలమల సత్యరావుల ప్రేమకావ్యం
రాయప్ప జముకుపై గానమవుతుంటే
కంటికి మింటికి కన్నీటి ధారయ్యేది పేట

జముకుగానో ఊర్నంగానో...
మా వారసత్వపు వాయిద్యమంతా
పేట సిలక్కొయ్యలపై కొలువు కూకుండేది
ఎన్ను పట్టికి ఏలబడ్డ ఎండు ఒరుగులు
వారం పూటకి ఇష్టమైన నీసుకోరయ్యేవి
కానికష్టమే ఇంటికొచ్చినా
కంటికిరెప్పై పేట కాపు కాసేది
మోతుబారితనం హద్దుమీరితే
పేట కన్నమనీడు కరవాలమయ్యేది

ఇప్పుడు! పేట పేటలా లేదు !

ఇరుకు వీధులు... ఎలుగేసి కట్టినట్టు ఎలివేషన్లు
గాలి వెలుతురు దూరని కాంక్రీట్ గదులు
కల్లాపికి వాకిలి లేదు
ముగ్గానించడానికి మూరెడు అరుగూ లేదు
ఏ బీరబడ్డో పాకడానికి పెణక లేదు
ఇంటి వెనకాల పెరడూ లేదు
సంబరమొస్తే చిందేసే డప్పు లేదు
చావొస్తే ఊర్నపు పురాగాన శోకమూ లేదు
పేటంతటినీ ఒక్కచోటికి చేర్చే కష్టసుఖాలబోతా లేదు

మేడిపండులా పైకి నవనవలాడుతున్నా
పేట బతుకు నిండా పురుగు దొలుస్తున్న పేదరికం
గారడీవోడి దీపాలాటలో నిగనిగా ఎలిగిపోతున్నా
మా పేట లోపట ఎడతెరిపిలేని చీకటి ముసురు...

■ కలమట దాసు బాబు
✆ 80967 03363



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA

సోమవారం 8 డిసెంబరు 2025

5

ఓటు కోసం 'కోతి' తిప్పలు


సర్పంచ్ ఎన్నికల్లో కోతుల బెడదే ప్రధాన ఎజెండా

- కోతులను తరిమితేనే ఓటేస్తామంటున్న జనం
- పల్లెల్లో పంటలు, ఇళ్లపై వానర మూకల దాడులు
- జనావాసాల్లో సంచారంతో ప్రజల బెంబేలు
- గాయాలతోపాటు మరణాలు సంభవిస్తున్న వైనం
- కు.ని. ఆపరేషన్లు లేక పెరిగిపోతున్న సంతతి
- అడవుల్లో అటకెక్కిన మంకీ ఫుడ్ కోర్టులు



భూపాలపల్లి జిల్లా రేగొండలో కోతులను పట్టించే వారికే ఓటు అని ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

జనగామ జిల్లా నర్మెట్టలో కోతులను పట్టించిన సర్పంచ్ అభ్యర్థి



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సర్పంచ్ ఎన్నికల్లో కోతుల పంచాయితీ తెరపైకి వస్తోంది. డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్య దేవుడెరుగు.. ఇల్లు పీకి పందిరివేస్తున్న కోతుల సంగతి చూడండంటూ ఓటర్లు సర్పంచ్ అభ్యర్థులకు షరతులు పెడుతున్నారు. దీంతో ఓట్ల కోసం అభ్యర్థులు కోతులను పట్టి.. ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నంలో ఉన్నారు. పల్లెల్లో కోతి చేష్టలతో ప్రజలకు చిరాకు తెప్పిస్తున్నాయి. మందలకు మందలుగా కోతులు పల్లెలను ఆక్రమించుకుంటున్నాయి. ఇంటి కప్పులే కాదు.. రైతన్నల పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి చేతికి ఏది దొరికితే అది పట్టుకెళుతున్నాయి. అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే దాడులు చేసి గాయపరుస్తున్నాయి. ప్రతీ ఊరిలో వానర బాధితులే ఉన్నారు. దీంతో సర్పంచ్ ఎన్నికల ఎజెండాలో కపిరాజుకే ప్రాధాన్యత పెరిగింది.

ఊళ్లు, పంటలపై వానర మూక

కోతుల బీభత్సంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లనే కాదు.. పంటలను కూడా ధ్వంసం చేస్తున్నాయి. రైతులు పంట పొలాల వద్దకు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తూ వ్యవసాయ పనులకు వెళ్లేవారిని, ఇతర పనులకు బయటకు వచ్చే వారిని బెదిరిస్తూ గాయపరుస్తున్నాయి. దీంతో రైతులు, కూలీలు రోజువారి పనులకు వెళ్లాలంటే భయం భయంగా వస్తున్నారు. ప్రధానంగా వరంగల్, ములుగు, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో కోతుల సమస్య

(మిగతా 7లో..)

మంకీ ఫుడ్‌కోర్టుల జాడేది..?

అడవులు అంతరించి పోతుండటంతో కోతులకు కావాల్సిన ఆహారం లభించటం లేదు. అడవుల్లో తినేందుకు కోతులకు ఆహారం కొరత ఏర్పడటంతో వానర సైన్యం ఊళ్లల్లో తిష్టవేస్తున్నాయి. గత ప్రభుత్వం 2020లో మంకీ ఫుడ్‌కోర్టులను ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేసింది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ ఫుడ్ కోర్టుల్లో అరటి, పనస, సంత్ర, జామ, దానిమ్మ తదితర పండ్ల మొక్కలను పెంచారు. అయితే వాటి నిర్వహణ మరిచారు. దీంతో కోతులు ఆహారం కోసం మళ్లీ ఊళ్లలోకి వస్తున్నాయి. కోతి చేష్టలతో ప్రజలను పరుగులు పెట్టిస్తున్నాయి.



ఎన్నికల నిబంధనలను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి

- అధికారులకు కలెక్టర్ స్నేహ శబరీష్ సూచన



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్


హనుమకొండ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రెండో విడత ఎన్నికలు జరిగే మండలాల్లో సిబ్బంది రాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 2వ విడతలోని ధర్మసాగర్, హసన్‌పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో పోలింగ్ కేంద్రాల వారిగా రాండమైజేషన్‌లో పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. పీవోలు 789, ఇతర పోలింగ్ అధికారులు 1154 ఆయా మండలాలకు కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 1,943 మంది పీవో, ఓపీవోలను కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే మొదటి, రెండో విడత మండలాల్లో బ్యాలెట్ బాక్స్‌లు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి పాల్గొన్నారు.

ఇంకో తరానికి దారేది..?
- నర్సంపేటలో ప్రత్యామ్నాయ లీడర్లు కరువు
- మండల స్థాయికే పరిమితమవుతున్న నాయకులు
- ద్వితీయ శ్రేణి నాయకులపై ప్రజాప్రతినిధుల శీతకన్ను

7

మల్లన్నకు సుధావళి వర్ణలేపనం

- 10 నుంచి 15 వరకు నిజరూప దర్శనం నిలిపివేత
- 16న మల్లన్న స్వామికి దృష్టికుంభం



ఐనవోలు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి 2026 జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 10న బుధవారం నుంచి 15 సోమవారం వరకు స్వామి అమ్మవార్లకు సుధావళి వర్ణలేపనం(రంగులతో అలంకరణ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 16న ధను సంక్రమణం ప్రారంభమౌతున్నందున ఈ నెల 10న మధ్యాహ్నం నుంచి 15 వరకు 6 రోజుల పాటు స్వామి వారి నిజరూప దర్శనం నిలిపివేయనున్నారు. అభిషేక పూజ కార్యక్రమాలు జరగవు. ఆలయానికి వచ్చే భక్తులు ముఖ మండపంలోని ఉత్సవ మూర్తులను దర్శనం చేసుకోవచ్చు. 16న మంగళవారం స్వామి వారికి నిర్వహించే 'దృష్ఠి కుంభం నెత్రోమ్మీలన' తరువాత స్వామి వారి పునర్ దర్శనం, గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని ఈవో కందుల సుధాకర్, దేవస్థానం చైర్మన్ కమ్మగొని ప్రభాకర్‌గౌడ్, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ తెలిపారు.

కేంద్రం బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి

- ఈశ్వరాచారి ఆశయ సాధనకు కృషి చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

వడ్డెపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును ప్రవేశపెట్టి వెంటనే అమలు చేయాలని, 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లను చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి వక్తలు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ సారంగపాణి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, తెలంగాణ బీసీ మహాసేన రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్, కో కన్వీనర్ డాక్టర్ గొల్లపల్లి వీరస్వామి హాజరయ్యారు. తొలుత బీసీ హక్కుల కోసం అమరుడైన సాయి ఈశ్వరాచారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లను చేర్చాలని అన్నారు. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలైన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ పదవులకు రాజీనామా చేసి బీసీ ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం అమరుడైన సాయి ఈశ్వరాచారి ఆశయ సాధనకు బీసీ సమాజం కృషి చేయాలని కోరారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో 500 మందితో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి సాయి ఈశ్వరాచారికి ఘనంగా నివాళులర్పించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. త్వరలో

(మిగతా 6లో..)

పెట్స్‌కూ అతిథి గృహాలు
- పెంపుడు శునకాలకు ప్రత్యేక వసతి కేంద్రాలు
- నగరంలో అందుబాటు

7



నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం సోమవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నామని గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

గజ గజ

వణికిస్తున్న చలి

- వచ్చే నాలుగు రోజులు మరింత తీవ్రం
- దిత్వా తుఫాన్ ప్రభావం



హనుమకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా చలి తగ్గినట్టే అనిపించినా.. రెండు రోజుల నుంచి చలి తీవ్రత మళ్లీ పెరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 13 -15 డిగ్రీల సెల్సియస్ మధ్య రికార్డు అయ్యాయి. ఆదివారం ఉష్ణోగ్రతలు మరింత తగ్గాయి. 12 నుంచి 13.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అతితక్కువగా ములుగు జిల్లాలో 12 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో 12.1 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12.1 డిగ్రీలు, జనగామ జిల్లాలో 12.4 డిగ్రీలు వరంగల్ జిల్లాలో 12.5 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లాలో 13.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దిత్వా తుఫాను ప్రభావం వల్ల రానున్న నాలుగు రోజుల్లో చలి తీవ్రతలు మరింత పెరగవచ్చునని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సింగిల్ డిజిట్‌గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నది. హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో చలి పెరగవచ్చునని తెలిపింది. ఈనెల 8 నుంచి 11వ తేదీ మధ్య 15 డిగ్రీల మధ్య నమోదు కావచ్చునని తెలిపింది. ఈ దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు పిల్లలు, వయోవృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలంటున్నారు.

అల్పాహారంలో పురుగులు

- కేయూ కామన్ మెస్‌లో ఘటన
- ఆందోళన చేసిన విద్యార్థులు



అల్పాహారంలో పురుగులు ఉన్న దృశ్యం

కేయూక్యాంపస్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కామన్‌మెస్‌లో ఆదివారం విద్యార్థులకు అందించిన అల్పాహారంలో పురుగులు వచ్చాయి. ఉదయం టిఫిన్ చేస్తున్న విద్యార్థులు అల్పాహారంలో పురుగులు రావడంపై షాక్‌కు గురయ్యారు. తోటి విద్యార్థులతో

(మిగతా 6లో..)



డీఈవో ఆఫీస్‌కు దిక్కెవరు..?
- ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జి డీఈవో, ఇద్దరు సిబ్బంది
- యాదాద్రి జిల్లాలో డీఈవోగా ఏడీ..
- సెలవుపై వెళ్లిన ఇద్దరు సూపరింటెండెంట్లు
- అక్రమాల నేపథ్యంలో గత డీఈవోను తొలగించిన ప్రభుత్వం
- కుదేలవుతున్న హనుమకొండ జిల్లా విద్యాశాఖ

6

మేడారంలో జన హోరు
- వనదేవతలకు ముందస్తు మొక్కులు
- నెలన్నర ముందే తరలివస్తున్న భక్తులు

7



వనదేవతల గద్దెలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఎత్తు బంగారం(బెల్లం) మోసుకువస్తున్న భక్తురాలు

డీఈవో ఆఫీస్‌కు దిక్కెవరు...?

● ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జి డీఈవో, ఇద్దరు సిబ్బంది ● కుదేలవుతున్న హనుమకొండ జిల్లా విద్యాశాఖ

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డీఈవో ఆఫీస్‌కు దిక్కెవరు..? అనేది తెలియరావడం లేదు. ఆఫీస్‌లో డీడీవోగా బాధ్యతలు నిర్వహించాల్సిన ఏడీ.. మరో జిల్లాలో డీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనేక అక్రమాలు, ఆరోపణల నేపథ్యంలో డీఈవోగా పనిచేసిన వాసంతిని ప్రభుత్వం ఆ పదవి నుంచి తొలగించింది. ఇద్దరు సూపరింటెండెంట్లు సెలవుపై వెళ్లారు. నవంబరు 1న హనుమకొండ డీఈవోగా అదనపు బాధ్యతలు చేపట్టిన అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి 36 రోజులకే ఏసీబీకి చిక్కారు. ఇక ఆయనతో పాటు ఆఫీస్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంటు, జూనియర్ అసిస్టెంట్లు ఇదే కేసులో కటకటాలు లెక్కపెడుతున్నారు. దీంతో కార్యాలయంలో పూర్తిగా ఖాళీ అయ్యింది. ప్రస్తుతం డీఈవో ఆఫీస్‌లో పనులు జరుగడం మృగ్యంగా మారాయి. రెండు నెలలుగా జిల్లా విద్యాశాఖ కుదేలైందని ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఏడీలు లేకుండానే నిర్వహణ

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ముఖ్యమైన అధికారి ఏడీ లేకపోవడంతో పనులన్నీ పెండింగ్‌లో పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. గతంలో రాంకుమార్ ఏడీగా ఉండగా ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డీఈవోగా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి అప్పుడప్పుడు వస్తూ ఉండేవారు. ఆ తర్వాత 2024లో హైదరాబాద్ నుంచి ఏడీగా బదిలీపై వచ్చిన సత్యనారాయణ నెల రోజులు కూడా పనిచేయకుండానే యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎఫ్ఏసీ డీఈవోగా వెళ్లారు. ఇక్కడ నుంచి ఏడీ చూడాల్సిన ఫైళ్లను అటెండర్ సహాయంతో యాదాద్రికి పంపిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అప్పుడు డీఈవోగా పనిచేసిన డాక్టర్ అబ్దుల్‌హై అనారోగ్య కారణాలతో ఆ పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత డీఈవోగా వచ్చిన వాసంతిని అనేక ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం అక్టోబరులో ఆ పదవి నుంచి తొలగించింది. ఈ తరుణంలో నవంబర్ 1న డీఈవోగా బాధ్యతలు చేపట్టిన అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి 36 రోజులకే డిసెంబర్ 6న ప్రైవేటు స్కూల్ రెన్యూవల్ రికగ్నేషన్‌కు రూ. 60 వేలు డిమాండ్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కి జైలుకి వెళ్లారు. ఇక ఆయనతో పాటు ఇదే కేసులో ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్ గౌస్ పాషా, జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్ జైలుపాలయ్యారు. ఇదిలా ఉండగా, ఇద్దరు సూపరింటెండెంట్లలో జీఎస్.ప్రసాద్ 6 నెలల పాటు దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా, శైలజ అనారోగ్య కారణాలతో నెల రోజులుగా సెలవులోనే ఉన్నారు.

పనులు జరిగేదెలా...?

హనుమకొండ డీఈవో ఆఫీస్‌లో డీఈవో, ఒక ఏడీ, ఇద్దరు సూపరింటెండెంట్లు లేకపోవడంతో పర్యవేక్షణ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దీంతో కింది స్థాయి సిబ్బంది ఫైల్ ప్రాసెస్ చేయడం చాలా ఇబ్బందిగా మారుతోంది. సెక్షన్ సిబ్బంది ఫైల్‌ను పంపిస్తే వాటిని పూర్తి స్థాయిలో పర్యవేక్షించే సూపరింటెండెంట్లు లేకపోవడం, ఇక ఆ ఫైళ్లను యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఏడీ వద్దకు తీసుకువెళ్లడం వ్యయప్రయాసలతో కూడుకుంది. మొత్తానికి డీఈవో కార్యాలయం అస్తవ్యస్తంగా తయారైంది. ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టి డీఈవోను నియమించి విద్యాశాఖ పాలనను గాడిన పెట్టాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



హనుమకొండ డీఈవో కార్యాలయం

విద్యాశాఖలో అవినీతి కంపు

నాడు ములుగు డీఈవో... నేడు హనుమకొండ ఇన్‌చార్జి డీఈవో..

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ అవినీతి కంపులో కూరుకుపోయినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ములుగు జిల్లాలో ఏసీబీ దాడులు మరవకముందే హనుమకొండలో అదనపు కలెక్టర్ ఏసీబీకి చిక్కడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వరంగల్, హనుమకొండ జిల్లాలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ కార్యాలయాల్లో అవినీతి పెచ్చుమీరుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కొంత మంది డీఈవోలతోపాటు సిబ్బంది ప్రతీ పనికి రేటు కట్టి వసూలు చేస్తున్నారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్, ప్రమోషన్లు, బదిలీలు, అనుమతులు, రెన్యూవల్ రికగ్నిజేషన్, టీసీ బుక్కులు, బిల్లుల చెల్లింపులు.. ఇలా ఒకటేమిటి ప్రతీ పనికి డబ్బులు ముట్టు జెప్పాల్సిందే. ములుగు జిల్లా డీఈవో కార్యాలయంలో గత జూన్ 16న రూ.20వేలు లంచం తీసుకుంటూ అప్పటి డీఈవో పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలిప్‌కుమార్ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన సంఘటన ఉమ్మడి జిల్లా విద్యాశాఖ మరువక ముందే హనుమకొండలో రూ.60వేలు లంచం తీసుకుంటూ ఇన్‌చార్జి డీఈవో, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డితో పాటు డీఈవో ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ గౌసుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్ పట్టుబడటం విస్మయాన్ని కలిగిస్తోందని ఉపాధ్యాయ వర్గాలు వెల్లడిస్తున్నాయి. గతంలోనూ ఓ సీనియర్ అసిస్టెంటు సస్పెండ్ అయిన సంఘటనలు ఉన్నప్పటికీ కార్యాలయ సిబ్బందిలో మాత్రం మార్పు రావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాగే అనేక అక్రమాలకు పాల్పడ్డ వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్‌ను అధికారులు బదిలీ చేయగా, అక్రమాల ఊబిలో చిక్కుకొని పదోన్నతి సైతం పొందకుండా డిప్యూటీ ఈవో స్థాయిలోనే కొనసాగుతున్న వాసంతిని ప్రభుత్వం డీఈవో పోస్టు నుంచి తప్పించిన ఘటన విద్యాశాఖలో జరుగుతున్న అక్రమాలకు అద్దం పడుతోందని ఉపాధ్యాయ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. ఇదిలావుండగా, డీఈవో కార్యాలయాల్లో ప్రతీ పనికి అనధికార రేట్లు ఫిక్స్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొత్తగా ప్రైవేటు స్కూల్ అనుమతి కోసం వస్తే అక్షరాల రూ.లక్ష వసూల్ చేస్తున్నారు. ఇక రెన్యూవల్ లాంటి పనులకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు, వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు రూ.5 నుంచి రూ.10వేల వరకు, టీసీ బుక్కుకు రూ.3వేల నుంచి 5వేల వరకు, ఉపాధ్యాయుల సర్వీస్ మ్యాటర్లు, ప్రమోషన్లు, బదిలీలు తదితర విషయాల్లో ఆయా ఉపాధ్యాయులు పొందే లబ్ధిని బట్టి రూ.2వేల నుంచి 10 వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

ఘనంగా న్యాయ దేవత
విగ్రహ భూమి పూజ


న్యాయ దేవత విగ్రహ భూమి పూజ చేస్తున్న అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్

మడికొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని న్యాయ విహార న్యాయ వాదుల కాలనీలో న్యాయ దేవత విగ్రహ ప్రతిష్ఠాపనకు కాలనీ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ రుత్విక్కుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాలనీ దేశంలోనే అతిపెద్ద న్యాయవాద కాలనీ అన్నారు. న్యాయ వాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ. 500కోట్లు కేటాయించాలని కోరారు. న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, ఉపాధ్యక్షులు షైదం జైపాల్, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, కార్యవర్గ సభ్యులు ఇజ్జగిరి సురేష్, న్యాయవాదులు జన్ను ప్రసంగి, సుధాకర్‌తో పాటు న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రసాభాసగా కాంగ్రెస్ ప్రచార పర్వం

● ఎమ్మెల్యే నాగరాజు ముందే వాగ్వాదానికి దిగిన అభ్యర్థులు
● అసహనంతో వాహనం దిగి వెళ్లిపోయిన ఎమ్మెల్యే


దౌలత్‌నగర్‌లో ఎమ్మెల్యే నాగరాజు ఎదుటే వాగ్వాదం చేసుకుంటున్న సర్పంచ్ అభ్యర్థులు

పర్వతగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదివారం నిర్వహించిన ప్రచార సభ రసాభాసగా సాగింది. మండలంలోని దౌలత్‌నగర్ గ్రామంలో సొంత పార్టీ అభ్యర్థుల మధ్య వాగ్వాదం జరిగింది. ఐలపాక స్వప్నను కాంగ్రెస్ నుంచి బలపరిచి టికెట్ ఇవ్వగా, రెబల్‌గా నామినేషన్ వేసి పోటీలో ఉన్న ఐలపాక మల్లికాంబ సైతం తానే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థినంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ గ్రామంలో ప్రచారం చేసేందుకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రావడంతో రెండు బృందాలుగా సర్పంచ్ అభ్యర్థులు తమ వర్గాలతో ప్రచార సభ వద్దకు చేరుకున్నారు. అభ్యర్థులను ప్రచార రథంపైకి ఆహ్వానించగా, రెబల్ అభ్యర్థి మల్లికాంబ సైతం పైకి ఎక్కారు. దీంతో గొడవ మొదలైంది. తనకంటే తనకే టికెట్ ఇచ్చారంటూ ఎమ్మెల్యే ఎదుటే ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అసహనంతో సభలో ప్రసంగించకుండానే వెళ్లిపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆదివాసీల ఆత్మబంధువు బ్రహ్మదేవ్ శర్మ


శర్మకు నివాళులర్పిస్తున్న పీఈఎస్ఏ, ఆదివాసీ నేతలు

నయీంనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పంచాయతీ ఎక్స్‌టెన్షన్ టూ షెడ్యూల్డ్ ఏరియాస్ జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఐఏఎస్ బీడీ.శర్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. భారతదేశంలో నివసిస్తున్న ఆదివాసీల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. గ్రామ సభల ద్వారా స్వయం నిర్ణయాధికారం అందించే విధంగా పీఈఎస్ఏ చట్టాన్ని రూపకల్పనచేశారన్నారు. దేశంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రూపాయి వేతనంతో పనిచేసిన ఏకైక వ్యక్తి బీడీ.శర్మ అన్నారు. ములుగు జిల్లా క్రీడల అధికారి యాలం ఆదినారాయణ, పీఈఎస్ఏ మొబిలైజర్ అల్లెం నవీన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సమాజంలో శాంతి నెలకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యం

బాలసముద్రం డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి నెలకొన్నప్పుడే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వ విశ్రాంత కలెక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కల గుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ప్రముఖ కవి, గాయకుడు మహ్మద్ సిరాజొద్దీన్ పుట్టిన రోజును పురస్కరించుకొని రూపొందించిన ఎగిరే శాంతి కపోతం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కేయూ విశ్రాంత ఆచార్యుడు గూడ నర్సింహమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో అశాంతి పెరుగుతున్న ఈ కాలంలో విదేశాల్లో యుద్ధాలు కొనసాగుతున్నాయని అన్నారు. సమాజంలో అసమానతలు తీవ్రం అవుతూ వైషమ్యాలు పెరిగి శాంతికి భంగం కలుగుతున్న క్లిష్టమైన సమయంలో సిరాజొద్దీన్ రచించిన శాంతి కపోతం పుస్తకం గొప్ప ప్రపంచ శాంతి సందేశంగా నిలిచిందని కొనియాడారు. ఇలాంటి శాంతి కార్యక్రమాలు తరచూ ప్రోత్సహించాలని కోరారు. శాంతి కపోతం పుస్తకాన్ని ఆవిష్కరించడం తనకు గొప్ప అనుభూతిని కలిగించిందని అన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ మహ్మద్ ఎక్బాల్ అలీ, కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్, గంటా రామిరెడ్డి, ఆత్మీయ అతిథులుగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిరాజొద్దీన్ సెరిమని కమిటీ సభ్యులు కొక్కొండ విజయబాబు, డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, డాక్టర్ ఆచార్య వెల్దండి రవికుమార్, పగడాల సరళ, బీటవరం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరాజొద్దీన్ దంపతులను కమిటీ బాధ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పూర్వ ఉద్యోగులు, బంధువులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు


ఇరిగేసి అర్జున్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి..

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): జెరూసలేం మాస్టర్స్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించిన హనుమకొండ వాసి, చెస్ దిగ్గజం, భారత గ్రాండ్ మాస్టర్ (జీఎం) ఇరిగేసి అర్జున్‌ను నేటి యువ క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల చెస్ టోర్నీ ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు ఈవీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హనుమకొండ నగరానికి చెందిన చెస్ దిగ్గజం అర్జున్ అతి చిన్న వయస్సులోనే జీఎం అర్హత సాధించడంతోపాటు అంతర్జాతీయ వేదికల్లో సత్తాచాటి ఓరుగల్లు కీర్తి, ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేయడం అభినందనీయమని కొనియాడారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఒక్క రోజు పాటు నిర్వహించిన చెస్ టోర్నీలో 60మంది బాలబాలికల పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల మూడో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల చెస్‌పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా అతిథులు, నిర్వహకులు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఆర్బిటర్లు డి.ప్రేమ్‌సాగర్, డి.వైశాలి, రజనీకాంత్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఈవీ శ్రీనివాసరావు, నిర్వాహకులు

'రేవా'కు కేంద్ర మంత్రి నివాళి

మిల్స్‌కాలనీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరానికి ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వచ్చారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త రేవా కోటేశ్వర్‌రావు ఇటీవల మృతి చెందడంతో డాక్టర్స్ కాలనీలోని ఆయన నివాసానికి చేరుకొని కోటేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, నాయకులు ఉన్నారు.


కోటేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బండి సంజయ్

కేంద్రం బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి..

(5వ పేజీ తరువాయి)

ఢిల్లీ మెడలు వంచైనా బీసీలకు రావాల్సిన రాజ్యాంగపరమైన హక్కులను సాధించుకుందామని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధీర్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి రమేష్, బీసీ సంఘాల ప్రతినిధులు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, బుట్టి శ్యాంయాదవ్, రుద్రోజు మణీంద్రనాథ్, వేణుమాధవ్, పులి దేవేందర్ ముదిరాజ్, వివేక్, సుధీర్, రామారావు, సంపత్ పటేల్, కేడెల ప్రసాద్, ఎండి నయీమొద్దీన్, మీర్జా అమ్జద్, ప్రొఫెసర్ రాములు, పానుగంటి శ్రీధర్, అనిశెట్టి సాయితేజ, జూకంటి రవీందర్, రవికుమార్, నారాయణగిరి రాజు, రాసూరి రాజేష్, సంజయ్ పాల్గొన్నారు.

అల్పాహారంలో పురుగులు

(5వ పేజీ తరువాయి)

కలిసి కామన్ మెస్ ఎదుట ఆందోళనలకు దిగారు. వర్సిటీ కామన్ మెస్‌లో అల్పాహారంలో, మెస్‌లో పురుగులు రావడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపించారు. వర్సిటీ హాస్టల్స్ కేర్ టేకర్లు, డైరెక్టర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని అన్నారు. కేర్ టేకర్‌తో పాటు ఇతర సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తమకు నాణ్యమైన ఆల్పాహారం, భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు విద్యార్థులకు సర్దిచెప్పడంతో విద్యార్థులు గొడవను విరమించుకున్నారు. ఇదిలావుండగా, కేయూ లేడీస్ హాస్టల్‌లోనూ ఆల్పాహారంలో పురుగులు వచ్చాయని విద్యార్థినులు ఆందోళన చేసినట్లు తెలిసింది. కాగా, కేయూ కామన్ మెస్ ఆల్పాహారంలో పురుగులు వచ్చిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

అత్యాశే కొంప ముంచింది!

● అనతికాలంలో ఎక్కువ సంపాదించొచ్చనే దురాశ ● కోట్లు పోగొట్టుకున్న వైద్యులదీ అదే ఆలోచన
● విస్తుగొలుపుతున్న పరకాల డాక్టర్ల ఘటన ● విద్యావంతులు మోసపోవడంపై చర్చ

వరంగల్ మెడికల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశకు అంతు లేదనేది లోకోక్తి.. అధికంగా ఆశ పడితే ఆశనిపాతం ఎదురవడం ఖాయమనే ఘటన ఇటీవల హనుమకొండ జిల్లా పరకాల మండల కేంద్రంలో జరిగింది. పట్టణంలో ప్రైవేట్ దవాఖానాలు ఏర్పాటు చేసిన ఇద్దరు డాక్టర్లు.. అనతికాలంలో మంచి పేరుతో పాటు డబ్బులూ సంపాదించారు. డబ్బును పొదుపు చేయడం, బ్యాంకులు, వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల్లో పెట్టడం సాధారణంగా అందరూ చేసేదే. కానీ వారు సంపాదించిన డబ్బుతో తక్కువ సమయంలో ఎక్కువ లాభం పొందాలనే వారి ఆలోచనే కొంప ముంచింది. సామాన్యులు, నిరక్షరాస్యులు మోసపోయారంటే అర్థముంది. కానీ ఇక్కడ ఉన్నత చదువులు చదివి సమాజం, ఆర్థిక విషయాలపై అవగాహన ఉన్నవాళ్లు మోసపోవడం గమనార్హం. ఒక రకంగా ఇది హనీ ట్రాపే. ఆన్‌లైన్‌లో పరిచయమైన మహిళను నమ్మి నకిలీ స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో లాభం పొందవచ్చంటే నమ్మేయడం అసాధారణంగా అనిపిస్తుంది. ఒక లక్ష, రెండు లక్షలు కాదు.. ఏకంగా రూ.2.51కోట్లు పోగొట్టుకోవడం విస్మయానికి గురి చేస్తోంది.

కొత్త రకాల మోసాలు..

ఆన్‌లైన్‌లో రోజుకోరకమైన కొత్త విధానంలో మోసపోతున్నారు. మీకు లాటరీ వచ్చిందని వాటిని విడుదల చేయడానికి కాస్త డబ్బులు పంపించాలని.. దఫదఫాలుగా నగదు బదిలీ చేయించుకుని చివరికి ఫోన్ స్విచాఫ్ చేస్తుంటారు. మరికొన్ని ఘటనల్లో తాము బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ ఆధార్ లేక బ్యాంకు పాస్‌బుక్, ఈ-కేవైసీ అప్‌డేట్ చేయాలని చెబుతారు. లేకుంటే శాశ్వతంగా క్లోస్ అవుతుందని నమ్మేలా మాట్లాడతారు. వారి వివరాలన్నీ తెలుసుకొని అకౌంట్లలో ఉన్న డబ్బును మొత్తం కాజేస్తారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన ఉండదు. మిమ్మల్ని, లేక మీ బంధువులను డిజిటల్ అరెస్ట్ చేశామని కోట్లు నొక్కేసిన ఘటనలూ ఉన్నాయి. ఇటీవల మరో కొత్త రకంగా మోసం చేస్తున్నారు. మనం ఆపదలో ఉన్నామని అర్జంటుగా డబ్బులు అవసరమున్నాయని వెంటనే ఫోన్‌పేలో పంపించాలని మనకు తెలియకుండానే మన ఫోన్ నుంచి మన ఆప్తులకు మెసేజ్, వాట్సాప్ సందేశాలు వెళ్తున్నాయి. ఒకవేళ నిర్ధారణ చేసుకోకుండా వారు సూచించిన నంబర్‌కు పంపిస్తే అంతే సంగతులు. ఆ నగదుపై ఆశలు వదిలేసుకోవాల్సిందే. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. బాధితులు అనామకులు కాదు.. సమాజంలో ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగులు చేసినవారే ఉండడం గమనార్హం. ఏమి తెలియనివారు మోసపోయారంటే అర్థం ఉంది.. కానీ అన్ని తెలిసినవారు మోసపోవడమే అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. పోలీసులు ఎంత అవగాహన కల్పించినా మోసపోయేవారు మోసపోతూనే ఉన్నారు.



కొత్త ఎత్తుగడలు

సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో జనం జేబులను ఖాళీ చేస్తున్నారు. తేరుకునేలోపే అకౌంట్లలోని డబ్బులను ఊడ్చేస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడినవారు ఎంత తొందరగా తేరుకొని తమను సంప్రదిస్తే సొమ్మును రికవరీ చేయవచ్చని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండడానికి అప్రమత్తతే శరణ్యం. ముఖ్యంగా ఆన్‌లైన్ చెల్లింపులు, పెట్టుబడుల విషయంలో మరింత జాగరూకతతో ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఇంకో తరానికి దారేది?



- నర్సంపేటలో ప్రత్యామ్నాయ లీడర్లు కరువు
- మండల స్థాయికే పరిమితమవుతున్న నాయకులు
- ద్వితీయ శ్రేణి నాయకులపై ప్రజాప్రతినిధుల శీతకన్ను

నర్సంపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట నియోజకవర్గానికి ఇంకో తరం నాయకులు లేరా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నర్సంపేటలో గెలిచినా, ఓడినా మళ్లీ వారే దిక్కవుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నర్సంపేటలో దొంతి మాధవరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి తప్ప ఇంకో నాయకులు కనపడడం లేదు. సీనియర్ నేత రేవూరి ప్రకాశ్ రెడ్డి పరకాలకు వెళ్లడంతో ప్రత్యామ్నాయ నాయకులు కరువయ్యారు.

నర్సంపేటలో ఎమ్మెల్యేలుగా చేసిన వారు..

వామపక్ష నేతల్లో ఒకరైన మద్దికాయల ఓంకార్ నర్సంపేట నియోజకవర్గం నుంచి ఐదు సార్లు గెలుపొందారు. ఆయన మూడు సార్లు సీపీఎం పక్షాన గెలిస్తే ఆ తర్వాత పార్టీకి దూరమై సొంతంగా ఎంసీపీఐని ఏర్పాటు చేసుకున్నారు. రెండుసార్లు ఇండిపెండెంట్ అభ్యర్థిగా విజయం సాధించారు. 1994లో టీడీపీ అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డిపై 87 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిపై 16,949 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్న సుదర్శన్ రెడ్డి పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. మాధవరెడ్డి 2014లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విజయం సాధించగా 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. నర్సంపేటలో కాంగ్రెస్ రెండుసార్లు అది కూడా 1957, 1967లలో మాత్రమే గెలిచింది. 1972 నుంచి ఒక్కసారి కూడా కాంగ్రెస్ గెలువలేకపోయింది. అయితే 2004లో కాంగ్రెస్ మద్దతిచ్చిన టీఆర్ఎస్ విజయం సాధించింది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన దొంతి మాధవరెడ్డి పోటీ చేసి పెద్ది సుదర్శన్‌రెడ్డిపై విజయం సాధించారు. రేవూరి ప్రకాష్‌రెడ్డి 1999లో గెలిచాక 610 జీవోపై శాసన సభలో ఏర్పాటు చేసిన సభా సంఘానికి నాయకత్వం వహించారు. రేవూరి మూడుసార్లు గెలిచారు. నర్సంపేటలో ఏడుసార్లు రెడ్లు, ఐదుగురు బీసీ వర్గం నేతలు, రెండుసార్లు ఇతరులు గెలిచారు. ఒక విడత కంభంపాటి లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా పనిచేశారు.

ద్వితీయ శ్రేణి నాయకుల ఎదుగుదల ఏది?

నర్సంపేటలో ద్వితీయ శ్రేణి నాయకులు కనిపించడంలేదు. ఉన్న వారు మండల స్థాయిలో పదవులు చేపట్టారు. జడ్పీ వైస్ చైర్మన్లుగా, మండల అధ్యక్షులుగా, మార్కెట్ చైర్మన్‌లుగా, కౌన్సిలర్లుగా పనిచేసిన వారు ఉన్నారు. అదే స్థాయిలోనే ఉన్నారు తప్ప.. మరో మెట్టు ఎక్కలేక పోయారు. ఈ విషయంలో ఈపార్టీ.. ఆ పార్టీ అని కాకుండా అన్ని పార్టీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఓ మండలానికి చెందిన నేత ఎదుగుదల చూసి ఓర్వలేక పై నాయకత్వం తొక్కి పెట్టడమే కాకుండా, పలు కేసుల పాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మేడారంలో జన హోరు

- వనదేవతలకు ముందస్తు మొక్కులు
- నెలన్నర ముందే తరలి వస్తున్న భక్తులు

తాడ్వాయి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం కోలాహలం నెలకొంది. వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జనవరిలో మహాజాతర జరగనున్న నేపథ్యంలో ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల వద్ద తలనీలాలు ఇచ్చి సమ్మక్క-సారలమ్మల నామస్మరణలతో ఎత్తు బంగారంతో గద్దెల వద్దకు చేరుకున్నారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారె, కొబ్బరి కాయలు, యాట మొక్కులు సమర్పించుకొని కోరికలు తీర్చాలని ప్రత్యేక పూజలు చేశారు. సల్లంగ సూడాలని తల్లులను వేడుకున్నారు. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేల మంది అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు. భక్తుల రాకతో మేడారం పరిసరాలన్నీ కిటకిటలాడాయి.



జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



భక్తులతో రద్దీగా మారిన గద్దెల ప్రాంగణం

బారులు తీరిన వాహనాలు

మహాజాతరకు ముందే మేడారంలో సందడి మొదలైంది. 2026 జనవరి 28 నుంచి 31 వరకు మహాజాతర జరగనుంది. ఇంకా 50 రోజుల్లో మహాజాతర ఉండటంతో వేలాదిమంది ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వస్తున్నారు. వీరిలో వందలాది మంది వివిధ వాహనాల్లో తరలివచ్చి తల్లులను దర్శించుకున్నారు. దీంతో మేడారం రహదారుల్లో వాహనాలు బారులుతీరాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

మేడారం 2026 జనవరి 28 నుంచి 31 వరకు సమ్మక్క -సారలమ్మల మహాజాతర జరగనున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం అధికారులు చేపట్టిన అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్యం, రోడ్ల విస్తరణ, నూతన క్యూలైన్లు, దేవస్థానం పునరుద్ధరణ, ఆర్టీసీ ప్రయాణ సౌకర్యాలు, వైద్యం, స్నానఘట్టాల మరమ్మతులు, విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాల పనులు జోరుగా జరుగుతున్నాయి.

ఓటు కోసం.. 'కోతి' తిప్పలు

(5వ పేజీ తరువాయి)

తీవ్రంగా ఉండగా, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో కోతి చేష్టలు ప్రజలకు చిరాకు కలిగిస్తున్నాయి. గత అక్టోబరు నెలలో కోతుల బెడద నుంచి తమను కాపాడాలని ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ములుగు మండలంలోని రాయినిగూడెం, సర్వాపురంతోపాటు పలు గ్రామాల్లో కోతుల బెడద నుంచి కాపాడాలని సీపీఎం ఆధ్వర్యంలో నవంబరు 3వ తేదీన ములుగు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇలా అనేక ప్రాంతాల్లో కోతుల బెడద వలన చాలావరకు కూరగాయలు, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేయటం లేదు. ఇక ఊళ్లల్లో ఇంటిని పీకి పందిరివేస్తున్నాయి. చిన్నపిల్లలతో కలిసి బయటకు వెళ్లాలంటే వణికిపోతున్నారు. కిరాణం షాపు నిర్వాహకులు ఇనుప గ్రిల్ ఏర్పాటు చేసుకుని సరుకులు విక్రయించుకోవల్సి వస్తోంది. కోతుల సమస్య ఏ ఒక్క ఊరుకో కాకుండా రాష్ట్రం మొత్తం వానర బీభత్సంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.



కమలాపూర్ మండలంలో తన అనుచరులకు చింపాంజీ, ఎలుగుబంటి డ్రెస్ వేసి ప్రచారం చేస్తున్న అభ్యర్థి (ఫైల్)

పెరుగుతున్న సంతతి

రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షలకు పైగా కోతులు ఉన్నట్లుగా అంచనా. ప్రతీ ఆడ కోతి తన జీవితకాలంలో కనీసం పది నుంచి 16 పిల్లలకు జన్మనిచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఒక్క కోతిని పట్టాలంటే మంకీ క్యాచర్లకు సుమారు రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. ఒక వంద కోతులను పట్టుకోవాలంటే రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే నిధులు లేక నీరసించిపోతున్న పంచాయతీలకు కోతుల నియంత్రణ కష్టంగా మారుతోంది. పైగా నిర్మల్ జిల్లా కేంద్రంలోనే మంకీ రెస్క్యూ సెంటర్ ఉండటంతో అక్కడి దూర ప్రాంతాల నుంచి కోతులను తీసుకెళ్లడం ఆర్థికంగా భారమవుతోంది. ప్రభుత్వం ప్రతీ ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున ఈ సెంటర్‌లను ఏర్పాటుతో పాటు కోతుల్లో సంతానోత్పత్తి తగ్గించేందుకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం మంకీలకు కుటుంబనియంత్రణ చేసేలా ఏర్పాట్లు చేయాలని, మంకీ ఫుడ్ కోర్టులను కూడా విరివిగా పెంచి, అడవుల్లోనే వాటికి ఆహారం, ఆశ్రయం లభించేలా ప్రభుత్వం అటవీశాఖతో కలిసి ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

గాయాలే కాదు.. ప్రాణాలు పోతున్నాయి..

కోతుల దాడుల్లో గాయాలే కాదు.. ప్రాణాలు సైతం పోతున్నాయి. వానర సైన్యం దాడికి గురైన వారు మూడు రోజులకోసారి టీకాలు తీసుకునేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. భుజాల నొప్పులు, వాపులతో బాధపడుతున్నారు. మూడు నెలల కాలంలో సుమారు 2,500 మందికిపైగా కోతి బాధితులు వరంగల్ ఎంజీఎం, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స కోసం వచ్చారంటే వానర సైన్యం దాడుల తీవ్రత ఎంత ఉందో స్పష్టమవుతోంది. దాడులే కాదు.. కోతి చేష్టలతో ప్రాణాలు సైతం పోతున్నాయి. గత ఫిబ్రవరి 18వ తేదీన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మడిపల్లి గ్రామానికి చెందిన బానోతు వెంకన్న తన వ్యవసాయ భూమిలో వేసిన మొక్కజొన్నను కోతుల బెడద నుంచి కాపాడేందుకు తన భార్య సునీతతో కలిసి చేను వద్దకు వెళ్లారు.

కోతుల గుంపును చేను నుంచి బయటకు తరుముతున్న క్రమంలో కాలు జారి బావిలో పడి మృతిచెందారు. ఫిబ్రవరి 12న పెద్దవంగర మండల కేంద్రంలో కోతుల బెడద నుంచి మొక్కజొన్నకు రక్షణ కల్పించేందుకు రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. ఇది గమనించకుండా వెళ్లిన గీతకార్మికుడు అనపురం వెంకన్న విద్యుత్ తీగకు తగిలి షాక్‌గురై మృతి చెందాడరు. 2024 ఫిబ్రవరిలో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన ఆంగోతు సిరి(65), కిరణ్(35)లు పంట పొలాలకు కోతులు రాకుండా రక్షణగా విద్యుత్ తీగలు పెట్టారు. రక్షణ తీగలకే తగిలి విద్యుత్‌షాక్‌తో తండ్రీకొడుకులు మృతి చెందారు. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా అనేకం ఉన్నాయి.


కోతులను తరిమితేనే ఓట్లు

పంచాయతీ ఎన్నికల్లో కోతుల సమస్యలే ప్రధాన ఎజెండా మారింది. కోతులను తరమి వేస్తేనే ఓట్లు వేస్తామని ఓటర్లు భీష్మిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో అభ్యర్థులు కోతులను పట్టించి.. ఓట్లను కొల్లగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో 5వేలకు పైగా ఓటర్లు ఉంటే.. 15వేలకు పైగా కోతులు ఉన్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దీంతో ఇక్కడ సర్పంచ్ ఎన్నికల్లో కోతుల సమస్యే ప్రధాన ఎజెండాగా మారింది.
- హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం నేరేళ్ల గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. దీంతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జెట్టి నాగలక్ష్మి చింపాజి, ఎలుగుబంటి వేషాధరణలతో కోతులను ఊరు బయటకు తరలిస్తూ ఓట్లు అడుగుతున్నారు.
- జనగామ జిల్లా నర్మెట్ల మండల కేంద్రంలో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న గోపగోని శ్రీధర్‌గౌడ్ గ్రామంలో కోతులను పట్టించి, ఓట్లు అడుగుతూ ప్రచారం చేస్తున్నారు.
- జఫర్‌గఢ్ మండల కేంద్రంలో కోతుల సమస్య తీవ్రంగా ఉండటంతో తనను గెలిపిస్తే కోతుల సమస్య తీరుస్తానని హామీ ఇస్తూ సర్పంచ్ అభ్యర్థి కృష్ణంరాజు ప్రచారం నిర్వహిస్తున్నారు.
- భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో ఇన్‌స్పైర్ యూత్ కోతుల బెడద నివారించే వారికే ఓటని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.
- మహబూబాబాద్ జిల్లా దాట్ల, దంతాలపల్లి గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు కోతుల నివారణే ప్రధాన ఎజెండా ఓట్లు అడుగుతున్నారు.

ఐదేళ్లలో ఆస్తులు పెరిగితే అవి ఊరికే..

దండేపల్లిలో ఓ అభ్యర్థి వినూత్న ప్రచారం



సర్పంచ్ అభ్యర్థి విడుదల చేసిన కరపత్రం

ఎల్కతుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా ఐదేళ్లలో ప్రస్తుతం ఉన్న ఆస్తికి మించి ఎలాంటి ఆస్తులు పెరిగినా.. వాటిపై పూర్తి హక్కులు గ్రామ పంచాయతీకి చెందుతాయని ఓ సర్పంచ్ అభ్యర్థి వినూత్నంగా కరపత్రాలు ప్రచురించి ప్రచారం సాగిస్తున్నాడు. ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన ఓ సర్పంచ్ అభ్యర్థి.. గతంలో సర్పంచ్‌గా పోటీ చేసి ఒక్క ఓటుతో ఓడిపోయాడు. ఈ సారి సర్పంచ్‌గా ఎన్నుకుంటే తనకు గాని, తన కుటుంబ సభ్యులకు గాని ఇప్పుడున్న ఆస్తులకు మించి (నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు, దాని అడుగు స్థలం మాత్రమే) అక్రమంగా ఎంత సంపాదించినా, ఆస్తులు పెరిగిన వాటిని గ్రామ పంచాయతీ జప్తు చేసుకుని ప్రజలకు పంచుతానని ప్రమాణం చేసి మాట ఇస్తున్నానంటూ కరపత్రంలో పేర్కొన్నారు. ఇంటింటా కరపత్రాన్ని అందించి అవకాశం కల్పించాలని కోరుతూ ప్రచారం చేయడం చర్చాంశనీయంగా మారింది.

వెంకటాపురం సర్పంచ్ బరిలో అన్నాచెల్లెలు



బొర్ర కృష్ణ



పి. సుగుణ

బయ్యారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా జరిగే పంచాయతీ పోరులో వినూత్న సంఘటన చోటు చేసుకుంది. వెంకటాపురం గ్రామపంచాయతీకి జరిగే ఎన్నికల్లో సర్పంచ్ బరిలో సోదర సోదరీమణి పోటీపడటం ఆసక్తి నెలకొన్నది. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థిగా బొర్ర కృష్ణ సర్పంచ్ బరిలో ఉండగా, పొడుగు సుగుణ అనే అభ్యర్థిని బీఆర్ఎస్ బలపర్చింది. దీంతో వెంకటాపురం పంచాయతీలో అన్నాచెల్లెల నడుమ ఆసక్తికర పోటీ నెలకొన్నది. కాగా, వెంకటాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇరువురు అభ్యర్థులే పోటీలో ఉండటం, అది కూడా అన్నాచెల్లెలు కావడం చర్చనీయాంశంగా మారింది.

తప్పుల తడకగా ఓటరు జాబితా

కల్వలలో 20కి పైగా డబుల్ ఓట్ల నమోదు




కల్వలలో ముగ్గురికి వరుసగా రెండుసార్లు నమోదైన ఆరు ఓట్లు

కేసముద్రం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కల్వల గ్రామ పంచాయతీ ఎన్నికల్లోని ఓటరు జాబితా తప్పుల తడకగా మారింది. ఎన్నికలకు ముందు ఓటరు జాబితాలను అధికారులు అభ్యర్థులకు, నాయకులకు ఇచ్చారు. అయితే ఈ జాబితాలో పలువురు ఓటర్లను రెండుసార్లు నమోదు చేశారు. వేర్వేరు సీరియల్ నెంబర్లు, ఓటరు సంఖ్యలతో ఒకేవ్యక్తిని రెండుసార్లు ఓటరుగా నమోదు చేశారు. ఇలా గ్రామంలోని వివిధ వార్డుల్లో 20కిపైగా ఓటర్ల పేర్లు డబుల్ (డూప్లికేట్)గా ఉన్నాయి. కొంత మంది ఓటర్లవి పక్కపక్కనే రెండు ఓట్లు ఉండగా మరికొంత మందివి ఒకేవార్డులో వరుస సంఖ్యల మధ్య దూరంతో వేర్వేరు చోట్ల ఉన్నాయి.

ఉదాహరణకు 12వ వార్డులో ముగ్గురు ఓటర్ల వివరాలు రిపీట్ అవుతూ వరుస సీరియల్ నెంబర్లతో ఆరుఓట్లు నమోదయ్యాయి. ఒక ఓటరు ఫొటో మరో ఓటరుకు కూడా వచ్చింది. కొంతమంది ఓటర్లు రెండువార్డుల్లో నమోదై ఉన్నారు. దీంతో తాము ఏ వార్డులో ఓటు వేయాలని అయోమయంలో ఓటర్లు ఉన్నారు. అభ్యర్థులు సైతం ఈ విషయాన్ని గుర్తించి తమ వార్డులోనే ఓటు వినియోగించుకుంటూ తనకే ఓటు వేయాలంటూ అడుగుతున్నారు. ఇలా గ్రామాల్లోని జాబితాలో డబుల్‌గా నమోదైన ఓట్లు ఎన్నికల కమిషన్ ఆన్‌లైన్ జాబితాలో కూడా అవే నెంబర్లు, వివరాలు చూపిస్తుండడం గమనార్హం. ఇలాంటి డబుల్ ఓట్ల ఏరివేతకు గతంలో ఓటుకు ఆధార్ నెంబరుతో లింక్ చేశారు. ఈ ప్రక్రియ గ్రామంలో సక్రమంగా చేయలేదని తెలుస్తోంది. ఈ విషయంపై మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో క్రాంతిని వివరణ కోరగా రెండు ఓట్లు ఉంటే, అందులో ఒక ఓటునే పరిగణలోకి తీసుకొని ఆ ఓటుకే పోలింగ్ స్లిప్‌లను జారీ చేస్తామని తెలిపారు. పోలింగ్ స్లిప్‌ల జారీలో ఏ ఓటు ఉందనేది ఓటర్లు పరిశీలించుకొని, ఆ ఓటునే వినియోగించుకోవాలని తెలిపారు.

ఓటరు జాబితాలో మృతుల పేర్లు



ఓటరు జాబితాలో ఉన్న మృతుల పేర్లు

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): తప్పులులేకుండా ఓటరు జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రతి సంవత్సరం సవరణ కార్యక్రమం చేపడుతోంది. 18ఏళ్ల నిండిన వారి పేర్లను నమోదు చేయడం, మరణించిన వారి పేర్లను, రెండుచోట్ల పేరు ఉన్నవారిని తొలగించడం చేస్తుంటారు. ఇంత చేస్తున్నా ఓటరు జాబితా సక్రమంగా ఉండటంలేదు. ములుగు వెంకటాపూర్ మండల కేంద్రంలోని ఎనిమిదో వార్డు జాబితాను పరిశీలిస్తే అనేక తప్పులు కనిపించాయి. చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితాలో అలాగే ఉన్నాయి. కొంతమంది పేర్లు రెండుచోట్ల కనిపించాయి.

చనిపోయిన వారి వివరాలు

వెంకటాపూర్‌లోని ఎనిమిదో వార్డులో 11 మంది చనిపోయిన వారి పేర్లు ఉన్నాయని గ్రామస్థులు అంటున్నారు. వీరిలో తడక వినయ్ (ఓటరు నంబర్ - 2847), జంగిలి కొమురమ్మ (ఓటరు నంబర్ -2924), మారబోయిన సాంబయ్య (ఓటరు నంబర్ - 2930), పుట్టపాక కొమురమ్మ (ఓటరు నంబర్ - 2950), జంగిలి బుచ్చమ్మ (ఓటరు నంబర్ - 2953), జంగిలి చంద్రయ్య (ఓటరు నంబర్ - 2970), జంగిలి మల్లక్క (ఓటరు నంబర్-2999), పోలోజు సమ్మక్క (ఓటరు నంబర్ - 3014), మూడం వెంకన్న (ఓటరు నంబర్ - 3074), తడక సాంబయ్య (ఓటరు నంబర్ - 3170), ఐలి రవీందర్ (ఓటరు నంబర్- 3161) పేర్లను ఇంకా జాబితా నుంచి తొలగించలేదు.



129 ఓట్లు వస్తే సర్పంచ్

చిన్నదైన చీన్యాతండా

ఇనుగుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో చిన్న గ్రామపంచాయతీల ఏర్పాటుతో ఓటర్ల సంఖ్య అంశాల్లో కొన్ని విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఇనుగుర్తి మండలంలోని చీన్యాతండా, ఐలయ్యబావితండాలను కలిపి నూతనంగా చీన్యాతండా గ్రామపంచాయతీగా 2018, ఆగస్టులో ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలో పురుషులు 399, మహిళలు 395 మంది 794 జనాభా ఉన్నారు. అయితే ఓటర్ల సంఖ్య 130 మంది పురుషులు, 126 మంది మహిళలు వెరసి 256 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామంలోని ఓటర్లను 8 వార్డులుగా విభజించారు. ఇందులో ఐలయ్యబావి తండాలో నాలుగు వార్డులు ఏకగ్రీవం కాగా, చీన్యాతండాలోని నాలుగు వార్డులకు, సర్పంచ్ స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీంతో 256 ఓట్లలో నోటాను మినహాయించి అన్ని ఓట్లు అభ్యర్థులకే పోలైతే, రెండు తండాల్లోంచి ఒకరి చొప్పున ఇద్దరు అభ్యర్థులే పోటీలో ఉండడంతో కేవలం 129 ఓట్లు ఎవరికి వస్తే వారే సర్పంచ్‌గా ఎన్నిక కానున్నారు. ఏదేమైనా ఇనుగుర్తి మండలంలో ఓటర్లపరంగా అతిచిన్న జీపీగా రికార్డుల్లో ఈ జీపీ నమోదు కావడం విశేషం.

పెట్స్‌కూ అతిథి గృహాలు

- పెంపుడు జంతువులకు ప్రత్యేక వసతి కేంద్రాలు
- నగరంలో అందుబాటు
- పెరుగుతున్న ఆదరణ

నయీంనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా పెంచుకునే శునకాలకూ వరంగల్ నగరంలో ప్రత్యేక వసతి కేంద్రాలు వెలిశాయి. విదేశాలు, తీర్థయాత్రలు, ఇతర వేడుకలు, ప్రత్యేక అవసరాలు ఏర్పడ్డ సందర్భాల్లో పెంపుడు కుక్కలను ఎక్కడ ఉంచాలనే సందేహం ఏర్పడుతుంది. ఇలాంటి అవసరాలను తీర్చడానికి నగరంలో పెంపుడు జంతువుల కోసం కేంద్రాలు వెలిశాయి.

అల్లారుముద్దుగా చూసుకుంటారు..

పెట్స్‌ను అల్లారుముద్దుగా పెంచుకుంటారు. అనుకోకుండా ఊరికి వెళ్లాల్సి వస్తే దిక్కుతోచదు. ప్రయాణంలో తమవెంట తీసుకెళ్లే వెసులుబాటు ఉండదు. ఇలాంటి వారికి సేవలందించడానికి నగరంలో ప్రత్యేక వసతి కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్వాహకులకు అప్పగిస్తే తిరిగి వచ్చేంత వరకు జాగ్రత్తగా చూసుకుంటారు. రోజూ భోజన వసతులు కల్పిస్తారు. ఆలనాపాలనా చూస్తారు. ప్రతిరోజూ వాట్సాప్ కాల్ చేసి వారి పెట్స్‌ను యజమానులకు చూపిస్తుంటారు.



డే కేర్ సెంటర్‌లో ఉన్న శునకాలు

వైద్య పరంగా సమస్యలు తలెత్తితే చికిత్స అందిస్తుంటారు. ఉదయాన్నే వ్యాయామం చేయిస్తారు. సమయానుకూలంగా స్నానం, క్షవరం లాంటివి ఇంట్లో మాదిరిగా జరిగిపోతుంటాయి. దినచర్యలో పెంపుడు శునకానికి అలవాటు ప్రకారం యజమానులు అందించిన భోజనం మాత్రమే పెడతారు. లేకుంటే మెనూ చెబితే దాని ప్రకారమే భోజనంఅందిస్తుంటారు. ఆడ, మగ లాంటివి వేర్వేరుగా ఉంచుతారు. ప్రయాణాలు ముగిసిన తర్వాత యజమానులు వచ్చి తమ పెట్స్‌ను ఇంటికి తీసుకెళ్తారు.

ప్రత్యేక సూపర్ మార్కెట్లు

శునకాలకు ఇష్టమైన రుచులు అందించడానికి ప్రత్యేక స్టోర్లు వెలిశాయి. రోజు వారిగా అందించే స్నాక్స్, శుభ్రమైన వస్తువులు, బిస్కెట్లు, ఆట వస్తువులు తదితర సామగ్రి ఒకే చోట లభిస్తున్నాయి. మానవాళి నిత్యవసరాల మాదిరి పెంపుడు జంతువుల కోసం ఏర్పాటు చేసిన స్టోర్లు జంతు ప్రేమికులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.



పలు జాతుల శునకాలు

జంతు ప్రేమికులు స్థానికతతో పాటు విదేశాలకు చెందిన శునకాలను అమితంగా ఇష్టపడుతున్నారు. షిట్జు, పొమెరియన్, గోల్డెన్ రిట్రైవర్, ల్యాబ్రాడర్, సిబేరియన్ హస్కీ, కేన్ కోర్సో, గ్రేట్ డేన్, కోకోర్ స్పానియల్, బాక్సర్, డాష్‌పంచ్, పగ్, బెల్జియం మెల్నోయిస్, బీగల్, లాసాపోస్ లాంటి పలు రకాల జాతులను ఇష్టంగా పెంచుకుంటున్నారు. వీటితో పాటు పిల్లులు, తాబేళ్లు, కుందేళ్లు పెంచుకునే వారూ ఉన్నారు. అలాంటి పెంపుడు జంతువులకు సైతం కేర్ సెంటర్లలో వసతి కల్పిస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విన్నర్ 'మోమో'

హనుమకొండకు చెందిన నక్క పూర్ణచందర్ యాదవ్ మలేషియా నుంచి ఇపోర్ట్ చేసుకున్న రోట్వీలర్ డాగ్‌ను రూ.7 లక్షలతో కొనుగోలు చేశారు. ఇది మలేషియా దేశంలో చాంపియన్‌గా నిలిచింది. అక్కడ నుంచి భారతీయడు సికిందర్ అనే వ్యక్తి తెప్పించుకున్నారు. ఆయన దగ్గర నుంచి నగరానికి చెందిన పూర్ణచందర్ కొనుగోలు చేసి 'మోమో' అని పేరు పెట్టుకున్నారు. ఈ పెట్ జాతీయ స్థాయి పోటీల్లో తలపడుతుంది. కెన్నల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటుంది. నడవడిక, శరీర దారుఢ్యం, ప్రవర్తన తదితర అంశాలపై పాయింట్ల ఆధారంగా విజేతగా ప్రకటిస్తారు. విదేశాలకు చెందిన నిపుణులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. 2023, 2024లో విన్నర్‌గా నిలిచిందని, 2025 పోటీల్లో ముందు వరుసలో ఉందని పెంపకందారుడు పూర్ణచందర్ తెలిపారు. మలేషియన్, ఇండియన్ చాంపియన్‌గా నిలుస్తోందన్నారు.

జాగ్రత్తగా చూసుకున్నారు..

- బి.మణిదీప్, హనుమకొండ



మేము కమ్మరివాడలో ఉంటాం. మూడు నెలల క్రితం గోల్డెన్ రిట్రీవర్ జాతికి చెందిన శునకాన్ని పెంచుకుంటున్నాం. తిరుపతి దర్శనం కోసం వారం రోజులు వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో పెట్ కేరింగ్ సెంటర్‌లో మా 'లియో'ను వదిలి వెళ్లాం. కేరింగ్ సెంటర్ నిర్వాహకులు చాలా జాగ్రత్తగా చూసుకున్నారు.

కళ్లముందే ఉన్నట్లుగా అనిపించింది..

-ఆర్.అన్విత, అడ్వకేట్స్ కాలనీ



మా పెంపుడు శునకాన్ని వదిలి మేము ఎప్పుడూ బయటకు వెళ్లలేదు. ఇటీవల సమీప బంధుల వివాహనికి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో నగరంలోని పెట్ కేర్ సెంటర్ వారికి అప్పగించి వెళ్లాం. నిర్వాహకులు ప్రతిరో జూ వీడియో కాల్ చేసి మా పెట్‌ను చూపించేవారు.

ఆత్మీయంగా చూసుకుంటాం..

- డాక్టర్ పాపని వంశీ, పెట్ కేర్ సెంటర్ నిర్వాహకుడు, హనుమకొండ



తప్పని పరిస్థితుల్లో పలువురు తమ పెంపుడు జంతువులను మావద్ద వదిలేసి వెళ్తారు. అవి మాకు చేరువ కావడానికి చాలా ఇబ్బంది పడతాయి. బుజ్జగిస్తూ మచ్చిక చేసుకుంటాం. యజమాని లేని లోటు లేకుండా ఆహారం అందిస్తూ ఆత్మీయంగా చూసుకుంటాం.. అవి డల్‌గా ఉంటే యజమానికి వీడియో కాల్ చేసి చూపిస్తాం. మిగతా శునకాలతో కలిసి ఆడుకుంటూ గడుపుతాయి. యజమాని తిరిగి వచ్చాక సంతోషంగా ఇంటికి తీసుకెళ్తారు.



మధ్యకోటలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

కోటలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

ఖిలావరంగల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు, సమాజంలో సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఏఎస్ఎం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుకుమారి సూచించారు. ఆదివారం ఎన్ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరంలో 2వ, రోజు కార్యక్రమంలో భాగంగా మధ్యకోటలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణంపై ప్రజలకు అవగాహన కలిగించారు. సైకాలజిస్టు డాక్టర్ రాధాశివపురం మాట్లాడుతూ.. సామాజికి సేవ ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వాణిశ్రీ, స్వాతి, అధ్యాపకులు సుమలత, శ్రీవేణి, సరిత, హారిక, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువుల్లో గుర్రపు డెక్క

» మృత్యువాత పడుతున్న చేపలు » నష్టపోతున్న మత్స్యకారులు » తొలగించాలని అధికారులకు వినతి

వడ్డెపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెరువుల్లో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క, తుంగ మొక్కలు మత్స్యకారులకు గుది బండగా మారుతున్నాయి. చేపలు ఎదగకపోవడంతో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. చెరువుల్లో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కతో పాటు తుంగ, ఇతర మొక్కలను తొలగించాలని ప్రభుత్వమే మత్స్యకారులు కోరుతున్నారు.

ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క, తుంగ

హనుమకొండ నగరాన్ని ఆనుకొని ఉన్న వడ్డెపల్లి చెరువు, బంధం చెరువు గోపాల్‌పూర్‌లోని అరకల సాయికుంటలో గుర్రపు డెక్కతో పాటు తుంగ మొక్కలు ఏపుగా పెరిగాయి. గుర్రపు డెక్కతో పాటు ఇతర నిరుపయోగమైన మొక్కలు పెరిగి చేపలు ఎదగడం లేదని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు. గుర్రపు డెక్క, తుంగ మొక్కలు చెరువుల్లో పెరగడంతో చేపల వేట కోసం తాము వేస్తున్న వలలు దెబ్బతింటున్నాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. వడ్డెపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘంలో సుమారు 300మంది సభ్యులు ఉన్నారు. చేపల వేటే వీరికి జీవనాధారం. మత్స్యకారులంతా హనుమకొండ నగర శివారులోని వడ్డెపల్లి చెరువు, గోపాల్‌పూర్ శివారులోని అరకల సాయి కుంట, బంధం చెరువులలో చేపలు పడుతూ జీవనం కొనసాగిస్తున్నారు. నాలుగేళ్ల నుంచి చెరువుల్లో నిరుపయోగమైన మొక్కలు ఏపుగా పెరగడంతో చేపలు వృద్ధి చెందకుండా పోతున్నాయి. దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు.

చెరువుల్లో వ్యర్థాలు

వడ్డెపల్లి చెరువుతో పాటు గోపాల్‌పూర్‌లోని అరకల సాయి కుంట, బంధం చెరువులలో కొంత మంది చికెన్ సెంటర్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారు. ఆస్పత్రుల నుంచి తొలగించిన వ్యర్థాలను సైతం వడ్డెపల్లి చెరువులో వేస్తున్నారు. దీంతో ఈ వ్యర్థాలన్నీ మురిగిపోయి చెరువులోని నీళ్లలో కలిసి పోతున్నాయి. దుర్వాసన ఫలితంగా చెరువులోని చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా వివిధ డివిజన్లలో పేరుకుపోయిన చెత్తను సైతం కొంతమంది వడ్డెపల్లి చెరువు శిఖంలో వేయడం వలన అవి మురిగిపోయి తిన్న చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. చెరువుల్లో వ్యర్థాలను వేయకుండా నిఘా పెంచాలని గుర్రపు డెక్కతో పాటు తుంగను సైతం తొలగించాలని మత్స్యకారులు జీడబ్ల్యూఎంసీ అధికారులను కోరుతున్నారు.



వడ్డెపల్లి చెరువు వద్ద పోగైన వ్యర్థాలు





వడ్డెపల్లి చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క, తుంగ

గుర్రపు డెక్కతో నష్టపోతున్నాం..

మట్టెపల్లి శంకర్ ముదిరాజ్,
వడ్డెపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యదర్శి



వడ్డెపల్లి చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క, తుంగ మొక్కలు, నాచును వెంటనే తొలగించాలి. కోళ్ల వ్యర్థాలను చెరువుల్లో వేయకుండా నిఘా పెంచాలి. వడ్డెపల్లి చెరువులో ఇతర వ్యర్థాలను వేయకుండా జీడబ్ల్యూఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలి. పూర్తి రాయితీపై మత్స్యకారులకు చేపల వేటకు సంబంధించిన వలలు, ఇతర పరికరాలను అందించి వృత్తిని ప్రోత్సహించాలి.



ఈశ్వరాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

సాయి ఈశ్వరాచారికి నివాళి

కేయూక్యాంపస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేయూ జర్నలిజం విభాగంలో సాయి ఈశ్వరాచారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి ఆదివారం బీసీ ఉద్యమనేతలు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పాస్ రాష్ట్ర అధ్యక్షుడు సంగాని మల్లేశ్వర్ మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. బీసీల అన్యాయాలను సహించలేక ఈశ్వరచారి ఆత్మబలిదానం చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. ఆత్మబలిదానాలు వద్దని శాంతియుతంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లాని శ్రీనివాస్, మెరుగు బాబుయాదవ్, గోడిశాల సత్యనారాయణ, సాంబమూర్తి, వీరాచారి, వేమన, కంజర్ల నరసింహరాములు, ప్రణాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వడ్డెపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరానగర్‌లో డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి మెంబర్ ఈవీ శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తేళ్ల సుగుణ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్లు సుకేష్‌రెడ్డి, ఖైద్యం గౌతం, కిరణ్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరానగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తేళ్ల కిశోర్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, కమిటీ ప్రతినిధులు రావుల నారాయణరెడ్డి, సత్యనారాయణ, నెల్లుట్ల శివప్రసాద్, వేణు, మహేందర్, పాపారావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం



దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న బిల్లా మహేందర్

వడ్డెపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ ప్రాంతానికి చెందిన దివ్యాంగ పేద విద్యార్థి వస్కుల హరీష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బిల్లా మహేందర్ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డెపల్లిలోని సంస్థ కార్యాలయంలో రూ.20వేల నగదును వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు కలకోట్ల నరేందర్, ఆకునూరి విద్యాదేవి, బిట్ల అంజనీదేవి, ఎం. విద్యారాణి, చింతల కమల, గజ్జెల స్వరూప, మండల వెంకట్రాజం, గజ్జెల విష్ణుమూర్తి, రాధిక నరేష్, హాసిని, కడుదుల సోమయ్య, కందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడికి ప్రత్యేక వాహనసేవ



వాహనసేవ నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మార్గశిర శుద్ధ తదియ ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వర్‌రావు తన శివపురాణంలో పేర్కొన్న విధంగా ఆరుద్ర నక్షత్రం వేళ పరమశివుడికి నిర్వహించే అభిషేకం మహాశివరాత్రి వేళ నిర్వహించే అభిషేకంతో సరిసమానమని పేర్కొన్న నేపథ్యంలో రుద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో 121మంది దంపతులచే ప్రత్యేక రుద్రాభిషేకాన్ని నిర్వహింపజేశారు. పరమశివుడికి అభిషేకం నిర్వహింపజేసుకున్న భక్తులకు అనేక శుభఫలితాలు ఉంటాయని చెప్పారు. అభిషేకాల అనంతరం ఉత్తర ద్వారం నుంచి దక్షణ ద్వారం వరకు మేళతాళాలతో డమరుక వాయిద్యాలతో రుద్రేశ్వరస్వామిని బృంగి వాహనసేవ నిర్వహించారు. మణికంఠశర్మ, ప్రణవ్, ఈవో అనిల్ కుమార్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వద్దిరాజు వెంకటేశ్వర్లు, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

'మిత్రులకు నమస్తే..'



నయీంనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బొమ్మలను తిలకిస్తూ చిన్నారులు నైతిక విలువలు నేర్చుకుంటున్నారు. నవ్వులు చిందించే బాలికలు, చదరంగం, ధ్యాన కేంద్రం, తదితర పరికరాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సెలవు రోజు ల్లో పిల్లలతో కలిసి వచ్చి నగరవాసులు గార్డెన్ ఆవరణలో సేదతీరుతున్నారు. బాలబాలికలు బొమ్మలను అనుసరిస్తూ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకుంటున్నారు. నమస్కరిస్తున్న బొమ్మల ముందు నిలబడి సంస్కారం నేర్చుకుంటున్నారు.

పన్వారు కుచ్చుల రచనలో సామాజిక స్పృహ

ఆచార్య బన్న అయిలయ్య



పన్వారు కుచ్చులు వ్యాస సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ మంథని శంకరయ్య రచించిన పన్వారు కుచ్చులు రచనలో సామాజిక స్పృహ ఉందని ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ రచయిత సంఘం ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన పన్వారు కుచ్చులు వ్యాస సంకలనం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ.. రచయిత శంకరయ్య ఇప్పటికి 9పుస్తకాలను వెలువరించారని, వయస్సుకు మించిన కార్యమని కొనియాడారు. తెలుగు విభాగంలో నవల రాసిన ఏకైక వ్యక్తి శంకరయ్య అన్నారు. పన్వారు కుచ్చులు ఒక సాంస్కృతిక బంధం నుంచి వచ్చిన పదమని, ఇప్పటివరకు ఈ పద బంధాన్ని ఏ విమర్శకుడు వాడినట్లు లేదని, నాగరికత మహాప్రవాహంలో కొట్టుకుపోతూ కనుమరుగు అవుతున్న ఎంతో పద సంపదను కాపాడాలనే తాపత్రయంతోనే శంకరయ్య ఈ సంపుటికి పన్వారు కుచ్చులు పేరునట్టినట్లు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పుస్తకాన్ని ప్రముఖ కవి, గాయకులు చిలుక భారతి భాస్కర్ దంపతులకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో సమీక్షకులు తాడిచెర్ల రవి, వకుళ వాసు, బిల్ల మహేందర్, విఆర్.విద్యార్థి, పెద్ది వెంకటయ్య, నక్క తిరుపతి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, కోడం కుమారస్వామి, నాగబెల్లి జితేంద్ర సమ్రాట్, బ్రహ్మచారి, కడుదుల సోమన్న పాల్గొన్నారు.

కోటను సందర్శించిన సివిల్ జడ్జి

ఖిలావరంగల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజ దంపతులు ఆదివారం ఖిలావరంగల్‌లో పర్యటించారు. కాకతీయుల కాలంనాటి శిల్పాలను తిలకించారు. మధ్యకోటలోని కాకతీయుల కాలంనాటి కీర్తితోరణాలు, శిల్ప సౌందర్యాలు, ఏకశిలగుట్ట, ఖుష్‌మహల్, శృంగారపు బావి, స్వయంభూదేవాలయం, రాతి, మట్టికోటను వారు కుటుంబసమేతంగా తిలకించారు. కాకతీయుల కాలంనాటి చరిత్ర విశేషాలు, కట్టడాల గురించి తెలుసుకున్నారు.



పూజ దంపతులకు శిల్పాల గురించి వివరిస్తున్న గైడ్

నగరంలో రాజ్యమేలుతున్న కల్తీ

- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- కనిపించని తనిఖీ.. అధికారుల ఉనికి

బాలసముద్రం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్తీ నూనెలు.. కల్తీ కారం.. కల్తీ పాలు.. సర్వత్రా ఆహార పదార్థాలన్నీ కల్తీమయమే. వరంగల్ మహానగరంలో కల్తీ రాజ్యమేలుతోంది. కల్తీని అరికట్టాల్సిన అధికారుల ఉనికి ఎక్కడా కనిపించడం లేదు. మానవ వినియోగానికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని నిర్ధారించడానికి ఆహార భద్రతా విభాగం అధికారులు పనిచేయాల్సి ఉంటుంది. తాజా, కల్తీ లేని ఆహార పదార్థాల తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకం సక్రమంగా జరిగేలా అధికారులు నియంత్రించాల్సి ఉంటుంది. ఆహారం భద్రతా నిబంధనలకు అనుగుణంగా ఉన్నదో, లేదో తనిఖీలు చేయాల్సి ఉంటుంది. వీధుల్లో జరిగే ఆహార పదార్థాల అమ్మకం వ్యాపారాలు మొదలుకొని కొన్ని లగ్జరీ హోటళ్ల వరకు సురక్షితమైన ఆహార పదార్థాలను వినియోగదారులు భుజించాల్సి వస్తోంది. ప్రతీ రోజు వివిధ అవసరాల కోసం సుదూర ప్రాంత గ్రామాల నుంచి ప్రజలు వేల సంఖ్యలో నగరానికి వస్తుంటారు. వారికి ఆకలి వేసినప్పుడు ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించే చోటును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. లాభార్జనకు సదరు ఆహార వ్యాపారులు కల్తీ పదార్థాలతో తయారు చేసిన తినుబండారాలను విక్రయిస్తారు.

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

సుమారు ఆర్నెళ్ల కిందట ఆహార భద్రతా విభాగం టాస్క్‌ఫోర్స్ అధికారులు వరంగల్ నగరంలో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో విస్మయం కలిగించే విషయాలు వెలుగు చూశాయి. నగరంలోని పేరొందిన హోటళ్లలో దుర్వాసన వచ్చే పచ్చి మాంసం, కుళ్లిన కూరగాయలు, కాలం చెల్లిన ఆహార దినుసులు, పానీయాలను కనుగొన్నారు. ఇక మామూలు హోటళ్లలో కల్తీ పదార్థాలతో తిను బండారాల తయారీ ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఎక్కడినుంచో అధికారులు వచ్చి తనిఖీలు చేస్తే అనేక అవకతవకలు బయటపడగా మరి స్థానికంగా విధులు నిర్వహించే అధికారులు ఏం చేస్తున్నట్లని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కనీసం తరచూ అధికారులు తనిఖీలు చేస్తున్నారని తెలిసినా కల్తీ వ్యాపారులకు దడపుట్టి ఆరోగ్యకరమైన తినుబండారాల తయారీకి పూనుకుంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



వృథాగా ఉన్న మొబైల్ లేబొరేటరీ వ్యాన్

ఇష్టారాజ్యంగా అధికారులు

నిత్యం ఆహార వ్యాపార సంస్థలను తనిఖీ చేయాల్సిన అధికారులు తమ విధులను విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న అసిస్టెంట్ ఫుడ్‌కంట్రోలర్ వారానికోసారి చుట్టపు చూపుగా వచ్చి పోతున్నారని తనిఖీలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నూతనంగా నియమితులైన ఫుడ్ సేఫ్టీ అధికారులకు గెజిటెడ్ ఫుడ్ సేఫ్టీ అధికారులు చార్జీ ఇవ్వడం లేదని వాపోతున్నారు. అధికారులు తమ సొంత కార్లలో వ్యక్తిగత డ్రైవర్లతో తిరుగుతూ ప్రభుత్వం నుంచి వాహనాల అద్దె అలవెన్స్‌ను పొందుతున్నట్లు తెలుస్తోంది.

మూలన పడిన మొబైల్ లెబొరేటరీ వ్యాన్

అధికారులు తనిఖీకి వెళ్లినప్పుడు వెంట తీసుకెళ్లాల్సిన తిను బండారాలను పరీక్షించే ఫుడ్ సేఫ్టీ మొబైల్ లెబొరేటరీ వ్యాన్ ఉపయోగించకుండా హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో మూలన పడి ఉంది. వ్యాన్ వెంట వెళ్లాల్సిన శాంపిల్ అసిస్టెంట్, హెల్పర్, వ్యాన్ డ్రైవర్ పనిలేకుండా ఉంటున్నారు.

మామూళ్ల మత్తులో..

తనిఖీ విధులు నిర్వహించిన అధికారులు తమ విధులను విస్మరించి మామూళ్ల వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. సుమారు 10 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ పొందిన డిపార్ట్‌మెంట్ అటెండర్ అధికారుల సూచన మేరకు హోల్‌సేల్ వ్యాపారుల వద్దకు వెళ్లి మామూళ్ల వసూళ్లు చేసే విధుల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. వివిధ వ్యాపార సంస్థల నుంచి అధికారులు రోజువారి మామూళ్లు, నెల వారి మామూళ్లు, మూడు నెలల కోసారి మామూళ్లు, సంవత్సర మామూళ్లు ఆయా వ్యాపార సంస్థల నుంచి వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై జిల్లా అధికారులు విచారణ జరిపి తనిఖీ అధికారులు నిత్యం ఆహార వ్యాపార సంస్థలను తనిఖీలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

తెలంగాణ ఉద్యమంలో పాత్రికేయులది ప్రత్యేక స్థానం

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఓరుగల్లు పాత్రికేయులది ప్రత్యేకస్థానమని, ఉద్యమకారులకు రక్షణ కవచంలా నిలిచారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా ఓరుగల్లు జర్నలిస్టులతో మాట ముచ్చట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం సబ్బండ వర్గాలు జరిపిన పోరాటాన్ని, ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష, జర్నలిస్టుల కలం కవాతును చర్చించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్టులు తడక రాజ్‌నారాయణ, చిలుముల్ల సుధాకర్, పిన్న శివకుమార్, మస్కపురి సుధాకర్, గడ్డం రాజిరెడ్డి, కంచె కుమారస్వామి, మాజీ కుడా చైర్మన్ ఎం. యాదవరెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మహేందర్, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

నేడు చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన

వరంగల్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల శిశువు నుంచి 16 సంవత్సరాల వయసుగల బాల బాలికలకు రోగ నిరోధక శక్తి పెంచడంతో పాటు మెదడును ఉత్తేజపర్చే ద్రవ్యాలతో ఆవు నెయ్యి, తేనెతో తయారు చేసిన స్వర్ణామృత ద్రవాన్ని సోమవారం వికాస తరంగిణి వరంగల్, హనుమకొండ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ టీచర్స్ కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో, హనుమకొండలోని నక్కలగుట్ట ప్రాంతంలో గల వికాస్ తరంగిణి కార్యాలయంలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణామృత ప్రాశన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9505595511/9959765355 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు సంకష్టహర చతుర్థి

వరంగల్ కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల చతుర్థి తిథి రోజున సాయంత్రం సంధ్యాసమయంలో సంకష్టహర చతుర్థి వేడుకలను దత్తక్షేత్రంలోని శ్రీసంకటహర గణపతికి వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సోమవారం గణపతి హోమం, సంకటహర గణపతికి విశేష అభిషేకం, అర్చన, వ్రత పూజ నిర్వహిస్తామని ఆశ్రమ ట్రస్టు సభ్యుడు వైవీ వామన్‌రావు తెలిపారు.



సింపుల్‌గా ఉన్నా ఎంతో స్పెషల్!

బాలీవుడ్‌లో కొత్తతరం తారల సందడి మొదలైంది. తమ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న సెలబ్రిటీలు ఇప్పుడు తల్లిదండ్రులుగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారు. ఈ క్రమంలో తమ పిల్లలకు వారు పెడుతున్న పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పాతకాలంలా కాకుండా చాలా సింపుల్‌గా ఉంటూనే ఎంతో లోతైన, అందమైన అర్థాలున్న పేర్లను ఎంచుకుంటున్నారు. ఇటీవల కియారా అద్వానీ-సిద్ధార్థ్ మల్హోత్రా దంపతులు తమ ముద్దుల కుమార్తె పేరును ప్రకటించడంతో ఈ ఒరవడి మరోసారి చర్చనీయాంశమైంది.

- **సారాయా :** కియారా-సిద్ధార్థ్ దంపతులు తమ కుమార్తెకు 'సారాయా' అని నామకరణం చేశారు. ఇది హిబ్రూ పదం 'సారాయ్' నుంచి వచ్చింది. దీనికి అర్థం 'యువరాణి' అని. ఈ పేరుకు తమదైన ప్రత్యేకతను జోడిస్తూ కియారా, సిద్ధార్థ్ స్పెల్లింగ్‌లో చిన్న మార్పు చేసి 'సారాయా'గా మార్చారు.
- **దువా :** దీపిక పదుకొణె-రణ్‌వీర్‌సింగ్ దంపతులు తమ కుమార్తెకు 'దువా పదుకొణె సింగ్' అని పేరు పెట్టారు. దువా అంటే 'ప్రార్థన' అని అర్థం. 'మా ప్రార్థనకు సమాధానంగా తను వచ్చింది' అంటూ వారు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో ఈ పేరును పంచుకున్నారు.
- **రహా :** అలియా భట్, రణ్‌బీర్ కపూర్ కూతురి పేరు 'రహా'. ఈ పేరుకు ఎన్నో అందమైన అర్థాలున్నాయి. స్వాహిలి భాషలో 'ఆనందం', సంస్కృతంలో 'వంశం', అరబిక్‌లో 'శాంతి, స్వేచ్ఛ, సుఖం' వంటి విభిన్న అర్థాలున్నాయి. ఈ పేరును వాళ్ల నాయనమ్మ ఎంచుకున్నారని అలియా చెప్పుకొచ్చారు.
- **లారా :** వరుణ్ ధావన్-నటాషా దలాల్ జంట తమ కుమార్తెకు 'లారా' అని పేరు పెట్టారు. పలు సంస్కృతులలో దీనికి వేర్వేరు అర్థాలున్నాయి. లాటిన్‌లో 'ఇంటిని, పొలాలను కాపాడే దేవత' అని, గ్రీకు పురాణాల్లో 'దేవతల దూత' అని అర్థం. స్పానిష్‌లో 'లారెల్ చెట్టు' అనే అర్థం కూడా ఉంది. మొత్తంమీద నేటితరం బాలీవుడ్ తారలు తమ పిల్లల పేర్ల విషయంలో సంప్రదాయాన్ని, ఆధునికతను మేళవిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అందమైన అర్థాలను అన్వేషిస్తూ కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు.

సంస్కృతి



చందూరు చేనేతకు సరికొత్త హంగులు

ఎర్రంచు తెల్లచీర... పద్మాంజలి పట్టు... మారుతున్న కాలానికి అనుగుణంగా... ఆధునికతను ఆవాహన చేసుకొని... సంప్రదాయ వస్త్రానికి సరికొత్త డిజైన్లు జోడిస్తున్నారు చండూరు చేనేత కళాకారులు. వినియోగదారుల అభిరుచికి తగిన పట్టు చీరలు నేస్తూ... సినీ, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులను ఆకర్షిస్తున్నారు. ఫ్యాషన్ ప్రపంచంలో తమ ప్రత్యేకత చాటుతూ... ప్రతిష్ఠాత్మక అవార్డులు సైతం పొందుతున్న నల్లగొండ జిల్లా చండూరు చేనేతపై 'నవ్య' కథనం.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది 'కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు'లకు తెలంగాణలోని మునుగోడు నియోజకవర్గానికి చెందిన ఎంతోమంది చేనేత కళాకారులు ఎంపికయ్యారు. ఇక్కత్ చీరల తయారీలో వీరు సిద్ధహస్తులు. వీరి చేతుల్లో రూపుదిద్దుకున్న వస్త్రశ్రేణులు భారత్‌లోనే కాకుండా... రష్యా, మలేషియా, ఇండోనేషియా తదితర దేశాల్లోనూ ప్రాచుర్యం పొందాయి. ఆర్డర్లపై ఎగుమతి అవుతుంటాయి. రసాయన రంగులతోపాటు చెట్లు, వాటి బెరడు, ఆకులను ఉపయోగించి రంగులు తయారు చేస్తున్నారు.

పద్మాంజలి పట్టు కేరాఫ్ చండూరు...

చేనేత పట్టు చీర ఆధునికత హంగులు అద్దుకొని తెలంగాణ పద్మాంజలిగా వెలుగొందుతోంది. కంచి పట్టు చీరలకు మించి మార్కెట్లో డిమాండ్ అందుకుంటున్న ఈ మోడల్ పుట్టినిల్లు మన చండూరు. గౌరంగ్‌షా డిజైన్లు, గజం అంజయ్య ఆలోచనల మేళవింపుతో రూపొందించిందే పద్మాంజలి పట్టు చీర. కంచి పట్టు చీరలకు దీటుగా చండూరు చేనేత కార్మికులు తయారు చేస్తున్న ఈ చీరలకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రముఖ మాస్టర్ వీవర్ గజం అంజయ్య వద్ద మెలకువలు నేర్చుకున్న కొంతమంది నేత కార్మికులు ప్రత్యేకమైన జకార్డు మిషన్ల ద్వారా ఇక్కత్ టెక్నాలజీని ఉపయోగించి వీటిని రూపొందిస్తున్నారు.

నాటి పెద్దంచు చీరే...

ఒకప్పుడు పెద్దంచు పట్టు చీరలంటే ప్రజల్లో మంచి ఆదరణ ఉండేది. అవి నేతన్నలకు మంచి ఉపాధి మార్గం అయ్యాయి. మగ్గాల స్థానంలో మిషన్లు రావడంతో నేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ దశలో చేనేత కార్మికులు తమ ఆలోచనలకు పదును పెట్టి పెద్దంచు పట్టు చీరకు ఆధునిక పరిజ్ఞానంతో విభిన్న డిజైన్లు జోడించారు. తమదైన శైలిలో పద్మాంజలి పట్టు చీరలుగా మార్కెట్లోకి తీసుకు వచ్చారు. దీనికి వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించడంతో, నేతన్నలకు ఇది ఒక వరమయింది. ఈ చీరల తయారీలో మాస్టర్ వీవర్లు ప్రత్యేక పట్టును... స్వచ్ఛమైన వెండి జరీని ఉపయోగించి నేస్తుండటంతో వినియోగదారుల నుంచి మంచి డిమాండ్ వస్తోంది.

ఎర్రంచు తెల్ల చీర...

బెంగాల్ మహిళల ఆహార్యంలో ప్రత్యేక భాగమైన ఎర్రంచు తెల్ల చీర... లాల్‌పాడ్ సఫేద్ చీర గురించి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. సాధారణంగా ఇక్కత్ కాటన్ చీరలు ధరించే మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి అప్పట్లో బడ్జెట్ ప్రవేశ పెట్టిన రోజు... లాల్‌పాడ్ సఫేద్ చీరలో ఆకట్టుకున్నారు. ఈ డిజైన్ చీరలు నల్లగొండ జిల్లా చండూరులో తయారవుతున్నాయి. చండూరుకు చెందిన చిలుకూరి శ్రీనివాసులు స్థానికంగా చేనేత కళాకారులతో నేయించి హైదరాబాద్‌కు చెందిన మార్కెటింగ్ మాస్టర్ వీవర్ గజం భగవాన్‌కు విక్రయిస్తున్నట్టు ఇక్కడి మాస్టర్ వీవర్స్ చెబుతున్నారు. టస్సర్ సిల్క్‌తో చీర తయారవుతుందని, అంచు బ్లైడ్ రెడ్, కొన అంచు గ్రీన్, మధ్యన హాఫ్ వైట్ కలర్‌లో ఉండటం ప్రత్యేకతని చెప్పారు. వీటి ధర రూ.25 వేలు ఉంటుంది. మాస్టర్ వీవర్ల ద్వారా కోల్‌కతా, ముంబయి నగరాలతో పాటు గుజరాత్, ఉత్తరాఖండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో కూడా వీటికి మంచి ఆదరణ ఉంది. అంతేకాదు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. పిల్ల, పెద్ద... అన్ని వయసులవారికీ నప్పేలా ఇక్కడ వస్త్రశ్రేణులు సిద్ధమవుతాయి. పాన్ పఠాన్, నార్‌కుండి, రాజస్థాన్, నవ రత్నం వంటి డిజైన్లతో పాటు జరీ బోర్డర్లతో వినియోగదారుడి అభిరుచికి అనుగుణంగా, అందుబాటు ధరల్లో అందిస్తున్నారు. వీటితో పాటు ఏనుగు పిట్ట, జరీ చెక్స్, ఫుల్ జరీ చీరలు కూడా ప్రత్యేకత సంతరించుకున్నాయి. నియోజకవర్గ పరిధిలో వందల కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి.

> **ప్రోత్సహిస్తే మరింతమంది**
>
> గతంలో మాదిరిగా నూలు రంగుల సబ్సిడీ పథకాలను కొనసాగిస్తే ఈ రంగంపై పెట్టుబడి పెట్టేందుకు చాలా మంది ఆసక్తితో ముందుకు వస్తారు. దీనివల్ల నేతన్నలకు ఉపాధి లభిస్తుంది. గ్రామం నుంచి చేనేత కార్మికుల వలసలు తగ్గుతాయి. యువత కూడా ఈ రంగంలోకి వచ్చే అవకాశం ఉంటుంది.
>
> - చిలుకూరి శ్రీనివాసులు

మద్రాస్ ఇక్కత్ చీర...


చండూరుకు చెందిన చేనేత కళాకారుల మరో వినూత్న డిజైన్... మద్రాస్ ఇక్కత్ చీర. వీటి తయారీతో ఇక్కడి కళాకారులు ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏడాదిపాటు కష్టపడి 234 కొయ్యలు, రిపీట్ లేకుండా ఆరు వరుసల్లో, వైట్ బేస్ చీరల్లో ప్రకృతి అందాలతో పరవశించి నాట్యం చేసే అంబారీ నెమలిని రూపొందించారు. మధ్య మధ్యన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ, పద్మాల డిజైన్లు వేశారు. డిజైన్లను రూపొందించడం, వాటిని గ్రాఫ్‌పై గీయడం, మగ్గంపై నేయడానికి మూడు నెలలు కష్టపడ్డారు. వీరి పనితనానికి ప్రభుత్వం గుర్తింపు కూడా దక్కడం విశేషం.

అన్నదమ్ములకు అవార్డులు...

చండూరుకు చెందిన చిలుకూరి శ్రీనివాసులు సహజసిద్ధమైన రంగులతో డబల్ ఇక్కత్ దుపట్టాను తయారు చేశారు. దీనికిగాను 'కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు'కు ఎంపికయ్యారు. శ్రీనివాసులు అన్న చిలుకూరి కృష్ణయ్య 2023లో, తమ్ముడు చిలుకూరి ధనుంజయ 2024లో ఈ అవార్డులు సొంతం చేసుకున్నారు. దాదాపు 35 సంవత్సరాలుగా ముగ్గురు అన్నదమ్ములు డబుల్ ఇక్కత్‌పైనే ప్రయోగాలు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం వరకు రసాయన రంగులతో డబుల్ ఇక్కత్ వస్త్రాలు నేసినా, ఆ తర్వాత నుంచి సహజ సిద్ధమైన రంగులకు మారి మంచి ఆదరణ పొందుతున్నారు. దుపట్టా తయారు చేసేందుకు రెండు నెలల సమయం పట్టిందంటారు శ్రీనివాసులు.

● బరిగెల శ్రీనివాస్, చండూరు

పిల్లల మేధస్సుకు...



పిల్లలు చురుకుగా తెలివితేటలతో పెరగాలంటే తల్లిదండ్రులు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నప్పటినుంచే పిల్లలకు మంచి దినచర్యను అలవాటు చేయాలి.

- పిల్లలు రాత్రిపూట త్వరగా పడుకొని ఉదయాన్నే నిద్రలేచేలా చూడాలి. దీనివల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి పిల్లలు మానసికంగా ప్రశాంతంగా ఉంటారు. మెదడు కూడా చురుకుగా పనిచేస్తుంది.
- పిల్లలకు తరచూ మంచినీళ్లు తాగడం అలవాటు చేయాలి. దీని వల్ల శరీరం తేమతో నిండుతుంది. నీరసం, నిస్సత్తువ ఆవహించకుండా తక్షణ శక్తి లభిస్తుంది. వీటితోపాటు శరీరమంతా రక్త ప్రసరణ సజావుగా జరగడం వల్ల మెదడు వేగంగా స్పందించగల్గుతుంది.
- పిల్లలకు రోజూ వ్యాయామం చేయాలని చెప్పాలి. రోజూ నిద్రలేవగానే పిల్లలు వ్యాయామం చేస్తూ ఉంటే శరీరంలో ఎండార్ఫిన్ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో పిల్లలు చురుకుగా ఆలోచించగల్గుతారు.
- రోజూ పిల్లలను ఉదయం పూట కాసేపు చదివించాలి. ఇలాచేయడం వల్ల పిల్లల్లో గుర్తుపెట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- పిల్లలు అల్పాహారం మానేయకుండా చూడాలి. తాజా పండ్లు, కూరగాయలు, గింజలు, కోడిగుడ్లు, పాలు, పెరుగును రోజూ ఆహారంలో చేర్చాలి. వీటివల్ల పోషణ అంది మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- సాయంత్రం పూట పిల్లలచేత మెమరీ గేమ్స్, చదరంగం, సుడోకు, పజిల్ గేమ్స్ లాంటివి ఆడించాలి. వీటివల్ల పిల్లల్లో ఆలోచనా సామర్థ్యం, తెలివితేటలు పెరుగుతాయి.
- పిల్లలకు యోగా, ధ్యానం లాంటివి అలవాటు చేయాలి. వీటివల్ల మెదడు ప్రశాంతంగా ఉల్లాసంగా మారుతుంది. జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది.

వీటితో పొట్ట క్లీన్

పొట్ట శుభ్రంగా ఉన్నప్పుడే జీవక్రియలు సజావుగా జరుగుతాయి. లేదంటే కడుపు ఉబ్బరించడం, ఎసిడిటీ, అజీర్తి, మలబద్ధకం లాంటి సమస్యలతోపాటు పలు అనారోగ్య పరిస్థితులు ఎదురవుతాయి. ఏ పదార్థాలను ఆహారంలో చేర్చుకుంటే పొట్ట సహజ రీతిలో శుభ్రపడుతుందో తెలుసుకుందాం...

- రాత్రి పడుకునేముందు కొద్దిగా ఉసిరి రసం తాగితే జీర్ణాశయ వ్యవస్థ వేగంగా పనిచేస్తుంది. ఉదయానికల్లా పొట్టలోని మలినాలన్నీ పూర్తిగా విసర్జితమవుతాయి.
- ఉదయాన్నే అల్లం టీ లేదా ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల అల్లం రసం కలుపుకుని తాగితే జీర్ణ సమస్యలన్నీ తొలగిపోతాయి. పేగులు పూర్తిగా శుభ్రపడతాయి. కడుపులో తేలికగా ఉన్న భావన కలుగుతుంది.
- ఒక గ్లాసు నీళ్లలో ఒక చెంచా వాము వేసి బాగా మరిగించి రాత్రి పడుకునేముందు తాగితే ఉదయానికల్లా కడుపులో పేరుకున్న వ్యర్థాలన్నీ విసర్జితమవుతాయి. వాములో ఉండే పీచు పదార్థాలు పొట్టని, పేగులను శుభ్రం చేస్తాయి.
- ఉదయం లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా తేనె, ఒక చెంచా నిమ్మరసం కలుపుకుని తాగినా పొట్ట శుభ్రమవుతుంది.



- తాజా కూరగాయలు, పండ్లు, శనగలు, ఓట్స్‌ను తరచూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.
- మజ్జిగలో ప్రో బయోటిక్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి జీర్ణాశయంలో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాలను వృద్ధి పరుస్తాయి. తరచూ పలుచని మజ్జిగ తాగడం వల్ల పొట్టలో పేరుకున్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- తరచూ జీలకర్ర నీటిని తాగుతూ ఉంటే కడుపు ఉబ్బరం తగ్గుతుంది. జీలకర్రలోని యాంటీ ఆక్సిడెంట్లు, పీచుపదార్థాలు మలబద్ధకాన్ని నివారిస్తాయి. దీనివల్ల ఎప్పటికప్పుడు పొట్ట శుభ్రపడుతుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలు లేదా నీళ్లలో అరచెంచా త్రిఫల చూర్ణాన్ని కలుపుకుని తాగితే పొట్టలోని మలినాలు, టాక్సిన్లు తేలికగా తొలగిపోతాయి.

స్ఫూర్తి





సెలబ్రిటీ లాయర్

చిన్నప్పటి నుంచీ ఎన్నో కలలు. డాక్టర్ కావాలని. రచయితగా రాణించాలని. తెరపై కనిపించాలని. కానీ చివరకు న్యాయవాదిగా స్థిరపడ్డారు ప్రియాంకా ఖిమాని. సొంతంగా ఒక లా ఫర్మ్ నెలకొల్పి... బాలీవుడ్ సెలబ్రిటీల కేసులతో బిజీ అయ్యారు. ఎంతోమంది యువ లాయర్లకు మార్గదర్శకత్వం చేస్తూ... మరెంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రియాంక కథ ఇది.

"జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో... ఏ మలుపు తిరుగుతుందో ఊహించలేం. పరిస్థితులకు అనుగుణంగా సాగిపోతుండాలి" అంటారు ప్రియాంకా ఖిమాని. బడికి వెళ్లే రోజుల్లోనే తనలోని సృజనకు రెక్కలు తొడిగారు. రచయితగా పలు టీవీ షోలకు పని చేశారు. రంగస్థల కళాకారిణిగా, మోడల్‌గా... విభిన్న రంగాల వైపు అడుగులు వేశారు. కానీ విధి మరోలా తలచింది. జీవితం అనుకోని మలుపు తీసుకుంది. "ముంబయిలో పుట్టాను. తరచూ వెళ్లిరావడంవల్ల ఢిల్లీతోనూ అనుబంధం ఏర్పడింది. పదిహేనేళ్ల వయసులో తొలిసారి 'తమన్నా హౌస్' అనే టెలివిజన్‌కు రచయితగా పని చేశాను. ముఖానికి రంగు వేసుకొని రంగస్థలంపై ప్రధాన పాత్ర పోషించాను. చదువు కొంటూనే ఇవన్నీ కొనసాగిస్తూ వచ్చాను. ముంబయి... ఢిల్లీ నగరాల మధ్య తీరిక లేకుండా రోజులు గడిచిపోయేవి. ఆ సమయంలో మా నాన్న మరణించారు. వెళుతూ వెళుతూ మాపై పెద్దఎత్తున అప్పుల భారం మోపారు. అప్పుడు నేను మెడిసిన్ కోసం సన్నద్ధమవుతున్నా. డాక్టర్ కావాలన్నది నా కల. కానీ మా ఇంటి పరిస్థితుల నేపథ్యంలో అటువైపు వెళ్లలేని పరిస్థితి. దాంతో నా కల కలగానే మిగిలిపోయింది" అంటూ ఓ సందర్భంలో తన చిన్ననాటి రోజులు గుర్తు చేసుకున్న ప్రియాంక... డిగ్రీలో కోరిమరీ బయోటెక్నాలజీ తీసుకున్నారు. "2009లో... ముంబయి జైహింద్ కాలేజీలో చేరాను. తరగతి గదిలో ఉన్నంతసేపూ పాఠ్యాంశాలు. దాని నుంచి బయటకు వస్తే నేనో రచయితను. అలా చాలా టీవీ షోలకు స్క్రిప్ట్స్ రాశాను. అర్చనా పూరన్ సింగ్ లాంటి ప్రముఖుల షోలకు కూడా పని చేశాను" అని చెప్పారామె.

స్నేహితులను చూసి...

అందరూ కాలేజీ జీవితాన్ని ఆస్వాదిస్తుంటే, ప్రియాంక మాత్రం జీవిత పోరాటంలో బిజీగా ఉండేవారు. అయితే ఎంతకాలం ఇలా? డిగ్రీతోనే ఆగిపోతే భవిష్యత్తుకు తగిన భరోసా దొరకదు. చదువు కొనసాగించాలంటే ఏంచేయాలి? కెరీర్‌ను అర్థవంతంగా తీర్చిదిద్దుకోవాలంటే ఎలా ముందుకు వెళ్లాలి? "ఈ ఆలోచనలు నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. నా స్నేహితులు కొందరు బయోటెక్నాలజీకి జతగా పేటెంట్ లా కూడా చదువుతున్నారు. దానివల్ల మంచి అవకాశాలు ఉంటాయని తెలుసుకున్నాను. నేను కూడా అదే దారిలో నడిచాను. ప్రభుత్వ లా కళాశాలలో చేరాను. తోటి విద్యార్థులందరికీ లా ఫర్మ్‌లో అప్రెంటీస్‌షిప్స్ లభించాయి. నేను నా రైటింగ్స్ కొనసాగించాను. ఎందుకంటే ఇందులో మంచి ఆదాయం వస్తుందని" అని తన కాలేజీ రోజులను ఆమె గుర్తు చేసుకున్నారు.

> **అలా ఉపయోగపడింది...**
>
> చేతి నిండా పని... దానికి తగ్గ ఆదాయం. సాఫీగానే సాగిపోతున్నా ఆమెలో ఏదో ఆందోళన. "టెలివిజన్ రంగం నాలాంటి యువతులకు సరైన వేదిక కాదనిపించింది. ఎందుకంటే నేను ఎంత నిజాయతీగా, ప్రభావవంతంగా పని చేసినా... వాళ్లు నన్ను ఏ రోజూ ఒక పూర్తిస్థాయి రచయితగా గుర్తించలేదు. అందుకే 2012లో ఎల్ఎల్‌బీ అయ్యాక ఇక న్యాయ వృత్తిలోనే నా కెరీర్ నిర్మించుకోవాలని నిశ్చయించుకున్నా. తోటి విద్యార్థుల్లా నాకు అనుభవం లేదు. ఎలా అని ఆలోచిస్తుంటే ప్రముఖ లా ఫర్మ్ 'ముల్లా అండ్ ముల్లా'లో అవకాశం వచ్చింది. అందుకు ప్రధాన కారణం... సృజనాత్మకంగా రూపొందించిన నా సీవీ వారిని బాగా ఆకర్షించింది. నాలోని రచయిత్రి అనుకోకుండా అలా ఉపయోగపడింది" అంటారు ప్రియాంక.

సొంతంగా లా ఫర్మ్...

ఉద్యోగ బాధ్యతల్లో కొద్ది కాలంలోనే మంచి అనుభవం గడించిన ప్రియాంక వృత్తిగత జీవితాన్ని ఒక ఫోన్ కాల్ మలుపు తిప్పింది. "గతంలో నేను అసిస్టెంట్‌గా పని చేసిన ఓ టీవీ షో రైటర్ నుంచి ఫోన్ వచ్చింది. దిగ్గజ గాయని లతా మంగేష్కర్ కేసు తీసుకోవాలని తను కోరారు. నాకు మాటలు రాలేదు"... అంటూ ఎంతో ఉద్వేగంగా నాటి ఘట్టాన్ని నెమరేసుకున్న ఆమెకు ఇక వెనక్కి తిరిగి చూసుకొనే అవసరం రాలేదు. సోనూ నిగమ్, అలీషా చినాయ్, అనురాగ్ కశ్యప్, రాజేష్ రోషన్ తదితర బాలీవుడ్ ప్రముఖుల కేసులు ఆమె వాదించారు. కీలక కేసులు గెలిచారు. ఇది ఆమెలో ఆత్మవిశ్వాసం పెంచింది. దీంతో ప్రియాంక 2014లో 'ఖిమాని అండ్ అసోసియేట్స్'ను ప్రారంభించారు.

ఢిల్లీలో మరొకటి...

ప్రియాంక పేరు పరిశ్రమలో బాగా పరిచయమైంది. కేసులు పెరుగుతూ వచ్చాయి. ఈ క్రమంలో రెండేళ్ల కిందట ఢిల్లీలో కూడా తమ సంస్థ సేవలు ప్రారంభించారు. 'ఉమెన్ ఆఫ్ మ్యూజిక్' పేరిట ఒక స్వచ్ఛంద సంస్థ కూడా నెలకొల్పారు. వివిధ రంగాల్లో మహిళలను ప్రోత్సహించి, వారు సాధించిన విజయాలను గుర్తించి, సాధికారత వైపు నడిపించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. కెరీర్ పరంగానూ ఎన్నో మైలురాళ్లను అందుకున్న ప్రియాంక... విదేశాల్లో సైతం న్యాయ సహాయం అందిస్తున్నారు. "మా లా ఫర్మ్ నెలకొల్పి దశాబ్దం దాటింది. రాబోయే పదేళ్లలో అంతర్జాతీయంగానూ మా సేవలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నాం" అంటున్న ప్రియాంక ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజిక్ లైసెన్సింగ్ ప్లాట్‌ఫామ్ అయిన 'సాంగ్‌ట్రేడర్'తో పాటు 'బీట్‌డాప్'కు బోర్డ్ మెంబర్‌గా ఉన్నారు.

వయసు పెరిగినా ఫిట్‌గా...

సాధారణంగా వయసు పెరిగేకొద్దీ శరీరంలో మార్పులు సంభవిస్తూ ఉంటాయి. జీవక్రియలు మందగించడం, కండరాల పటుత్వం తగ్గడం, ఎముకలు బలహీనమవడం లాంటివి ఎదురవుతూ ఉంటాయి. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో శరీరాన్ని ఫిట్‌గా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం...

- రోజూ ఉదయం నిద్రలేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగాలి. దీంతో కడుపు, పేగులు శుభ్రపడతాయి. కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి సమస్యలు తొలగిపోయి శరీరం తేలికగా అనిపిస్తుంది. హెర్బల్ టీ లేదా గ్రీన్ టీ తాగినా కూడా శరీరంలోని టాక్సిన్లు విసర్జితమవుతాయి. రోజంతా కూడా తరచూ మంచినీళ్లు తాగుతూ ఉండాలి.
- అధికంగా కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోకూడదు. తీపి పదార్థాలు, నూనె పదార్థాలతోపాటు ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించడం మంచిది. కాలానుగుణంగా లభించే పండ్లు, ఉడికించిన కూరగాయలు, మొలకలను రోజూ ఆహారంలో చేర్చుకోవాలి.
- ఉదయం లేదా సాయంత్రం వేళల్లో కనీసం పావుగంటసేపు శరీరానికి ఎండ తగిలేలా చూసుకోవాలి. దీనివల్ల శరీరానికి తగినంత డి విటమిన్ లభించి ఎముకలు, కండరాలు బలోపేతమవుతాయి.
- రోజూ తేలికపాటి వ్యాయామం చేయడం, పార్కులో నడవడం, ఇంట్లో తోటపని చేయడం, సైకిల్ తొక్కడం లాంటివి అలవాటు చేసుకోవాలి. వీటివల్ల శరీరం బరువు పెరగకుండా నియంత్రణలో ఉంటుంది.
- రోజూ కనీసం ఆరుగంటలు హాయిగా నిద్రపోవాలి. అప్పుడే ఒత్తిడి, ఆందోళన తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. శరీరంలో కణాలు వృద్ధి పొందుతాయి. హార్మోన్లు సమతౌల్యంలో ఉంటాయి.
- సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా గడపడం, స్మోకింగ్, ఆల్కహాల్ లాంటి అలవాట్లను మానుకోవాలి.
- కనీసం ఆర్నెల్లకోసారి వైద్యుని సంప్రదించి అవసరమైన చికిత్స తీసుకోవాలి.



పారా మిలటరీ పిలుస్తోంది

ఎస్ఎస్‌సీ భారీ నోటిఫికేషన్



స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) - పారా మిలటరీలో 25,487 ఉద్యోగాలతో భారీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పోస్టుల వివరాలు: కానిస్టేబుల్(జీడీ), రైఫిల్‌మన్(జీడీ), సెక్రటేరియట్

ఖాళీల వివరాలు: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) - 616, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) - 14,595, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్): 5,490, సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) - 1,764. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) - 1,293, అస్సాం రైఫిల్స్(ఏఆర్) - 1,706, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్) - 23

అర్హత: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

వయస్సు: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి వయస్సు 18-23 సంవత్సరాల మధ్య ఉండాలి(2003 జనవరి 2కి ముందు 2008 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు). రిజర్వుడు వర్గాలకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిసియెన్సీ టెస్ట్, వైద్య పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఉంటుంది.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష: జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మేథమెటిక్స్, ఇంగ్లీష్/ హిందీ నుంచి మల్టిపుల్ ఛాయిస్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో టాపిక్ నుంచి 20 చొప్పున మొత్తం 80 ప్రశ్నలు అడుగుతారు. కరెక్ట్‌గా గుర్తించిన ప్రతి సమాధానానికి రెండు మార్కులు కేటాయిస్తారు. తప్పుగా గుర్తిస్తే ఒక్కోదానికి పావు శాతం అంటే అర మార్కు కట్ చేస్తారు. తెలుగు సహా పలు ప్రాంతీయ భాషల్లో కూడా ఈ ప్రశ్నపత్రం ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 31

వెబ్‌సైట్: https://ssc.gov.in

దిక్సూచి

కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్‌లో డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్స్

భారత ప్రభుత్వానికి చెందిన 250 గ్రూప్-బి(నాన్ గెజిటెడ్) డెప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్(టెక్నికల్) పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2003/2004/2005లో సాధించిన గేట్ స్కోర్ ఆధారంగా ఈ భర్తీ జరుగనుంది.

పోస్టులు: 250(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-124, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్-10, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్-95, సివిల్ ఇంజనీరింగ్-2, మెకానికల్ ఇంజనీరింగ్-2, ఫిజిక్స్-6, కెమిస్ట్రీ-4, మేథ్స్-2, స్టాటిస్టిక్స్-2, జియాలజీ-3)

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ/ సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: గేట్ స్కోర్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 14(పోస్టులో)

చిరునామా: పోస్ట్ బ్యాగ్ నెం.001, లోధీ రోడ్ హెడ్ పోస్టాఫీస్, న్యూఢిల్లీ - 110 003.

ఓరియెంటల్ ఇన్సూరెన్స్‌లో ఏఓ

ద ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 300 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: జనరలిస్ట్ ఆఫీసర్ 285. హిందీ ఆఫీసర్(రాజభాష) 15

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణత

వయస్సు: ఈ ఏడాది నవంబర్ 30 నాటికి 30 సంవత్సరాలకు మించకూడదు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 15

వెబ్‌సైట్: orientalinsurance.org.in

జాబ్ కార్నర్



ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) - 996 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్ పోస్టులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పోస్టులు: వీపీ వెల్త్ - 506, ఏవీపీ వెల్త్ - 206, కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ 284

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతకు తోడు పని అనుభవం ఉండాలి

వయస్సు: ఈ ఏడాది మే 1 నాటికి 20-42 మధ్య వయస్కులై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 23.

వెబ్‌సైట్: https://sbi.bank.in/

హెచ్‌సీఎల్‌లో 64 జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ - టెక్నికల్ నుంచి అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్, లా వరకు వివిధ విభాగాల్లో ఉన్న 64 జూనియర్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎంబీఏ ఉత్తీర్ణతకు తోడు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్షకు తోడు డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా. హైదరాబాద్ సహా దేశంలోని వివిధ నగరాల్లో రాత పరీక్ష జరుగుతుంది. మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్ కూడా ఉంటుంది.

ఆఖరు తేదీ: డిసెంబర్ 17

వెబ్‌సైట్: www.hindustancopper.com

రైట్స్‌లో 400 అసిస్టెంట్ మేనేజర్లు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్)కు చెందిన నాలుగు జోన్లలో 400 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జీ, కెమికల్, ఐటీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మా

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీకి తోడు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా(రాత పరీక్ష వచ్చే ఏడాది జనవరి 11న జరుగుతుంది.)

పరీక్ష కేంద్రం: హైదరాబాద్ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో పరీక్షను నిర్వహించనున్నారు.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 25

వెబ్‌సైట్: www.rites.com

ప్రామాణిక మెటీరియల్‌తో ప్రాక్టీస్ ప్రధానం

జేఈఈ మెయిన్ గణితం



జేఈఈ మెయిన్‌లో ఉండే మూడు సబ్జెక్టుల్లో గణితానికి సమప్రాధాన్యం ఉన్నప్పటికీ 2022 నుంచి ఈ సబ్జెక్టు అంటే విద్యార్థులకు వెన్నులో నుంచి చలి పుడుతోంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 23 వరకు ప్రశ్నలు సాల్వ్ చేయగలిగిన విద్యార్థులకు గణితంలో నాలుగైదు చేయడం గగనమవుతోంది. ఈ నేపథ్యంలో అలాంటి విద్యార్థులకు కొన్ని సూచనలు.

- ముందుగా ఇంటర్మీడియెట్ సిలబస్ పూర్తి చేయండి
- మెయిన్, అడ్వాన్స్‌డ్ కోసం మంచి మెటీరియల్‌ను ఉపయోగించడం చాలా అవసరం. సమీర్ బన్సల్ కాలక్యులస్, వికాస్ గుప్తా కోఆర్డినేట్ జామెట్రీ, ఎ.దాస్ గుప్తా - ప్రాబ్లమ్ ప్లస్, ఐఐటీ మ్యాథ్స్... ఇవి కాకుండా మీ టీచర్ క్లాస్ నోట్స్‌ను కచ్చితంగా ఫాలో అవ్వాలి.
- ప్రాబ్లెమ్ సాల్వింగ్ కోసం చాట్‌జీపీటీ, ఇతర ఏఐ టూల్స్‌ను ఉపయోగించవద్దు.
- ప్రతి రోజూ కనీసం 20 నుంచి 30 లెక్కలు సాల్వ్ చేయాలి.
- చివరి నిమిషంలో ఆన్‌లైన్ క్లాసులకు హాజరుకావద్దు.
- గడచిన సంవత్సరాల్లో ఇచ్చిన ప్రశ్నలను సాల్వ్ చేసే క్రమంలో, ముందుగా మీరు పూర్తి చేసిన చాప్టర్స్‌లోని ప్రశ్నలు అటెంప్ట్ చేయాలి.
- 2022 నుంచి పేపర్స్ చేస్తే సరిపోతుంది.
- సిలబస్‌లోని ప్రతి చాప్టర్‌ను చేయడం మంచిది.
- స్టాటిస్టిక్స్, సెట్స్ అండ్ రిలేషన్స్, కోఆర్డినేట్ జామెట్రీ, కాంప్లెక్స్ నంబర్స్, వెక్టర్ 3డి, మెట్రిసిస్ అండ్ డిటర్మినెంట్స్ చాప్టర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

పేపర్ అటెంప్ట్ వ్యూహం

- పరీక్షను లెక్కలతో మొదలుపెట్టకండి. పేపర్‌పై కొంత సమయం కేటాయించి, ఆన్సర్ చేయదగ్గ ప్రశ్నలను గుర్తించండి.
- గతంలో మాదిరిగా గణితంలో అడిగిన ప్రశ్నలు కఠినంగా ఉంటే 12 నుంచి 15 సులువుగా అనిపించినవి మాత్రమే ఆన్సర్ చేయండి
- నిడివి ఎక్కువ(లెంగ్తీ) ఉన్న ప్రశ్నలను చేయకపోవడమే మంచిది. కోర్ కాన్సెప్ట్ ప్రశ్నలు చేయగలిగితే, సమయం ఆదా అవుతుంది.
- ప్రశ్నపత్రంలో లెక్కలు కఠినంగా ఉన్నప్పటికీ ఆందోళన చెందవద్దు.
- చివరిగా, ప్రతిసారిలా కాకుండా ఈ సారి ఫిజిక్స్, కెమిస్ట్రీ కఠినంగా వచ్చినప్పటికీ అందుకు కూడా సన్నద్ధంగా ఉండండి.

- చంద్రశేఖర్ జోస్యుల
సీనియర్ ఐఐటీ మ్యాథ్స్ ఫ్యాకల్టీ

అప్రెంటిస్‌షిప్

ఐఓసీఎల్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) రిఫైనరీల్లో 2757 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. గువాహటి, బరౌనీ, గుజరాత్, హల్దియా, మథుర, పానిపట్, దిగ్బోయ్, బంగాయిగావ్, పారదీప్ రిఫైనరీల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

అర్హత: పదోతరగతికి తోడు సంబంధిత విభాగంలో ఐటీఐ/ డిప్లొమా/ డిగ్రీ ఉత్తీర్ణత

వయస్సు: 18-24 సంవత్సరాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 18

వెబ్‌సైట్: http://iocl.com/apprenticeships

పాటియాల లోకోమోటివ్ వర్క్స్



ఇండియన్ రైల్వేస్ - పంజాబ్‌లోని పాటియాలా లోకోమోటివ్ వర్క్స్‌లో 225 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: ఎలక్ట్రీషియన్ 120, మెకానికల్(డీజిల్) 25, మెషినిస్ట్ 12, ఫిట్టర్ 50, వెల్డర్(జీ అండ్ ఈ) 18

అర్హత: పది/ఇంటర్ ఉత్తీర్ణతకుతోడు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికెట్ ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 22

వెబ్‌సైట్: www.plw.indianrailways.gov.in

డీఆర్‌డీఓ

డీఆర్‌డీఓ(చండీగఢ్) - ఇంజనీరింగ్/సైన్స్ - యూజీ, పీజీ విద్యార్థులకు పెయిడ్ ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తోంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో 2, సివిల్ ఇంజనీరింగ్‌లో 1, రిమోట్ సెన్సింగ్/ జియోఇన్ఫర్మాటిక్స్‌లో 2 ఉన్నాయి. ఆరు నెలల గడువు కాగా నెలకు రూ.5000 చెల్లిస్తారు. సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ లేదంటే సైన్స్‌లో యూజీ/పీజీ ఫుల్‌టైమ్ కోర్సును యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్‌లో చేస్తున్న విద్యార్థులు డిసెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: director.dgree@gov.in,https://www.drdo.gov.in/drdo/sites/default/files/vacancy/advtDGRE25112025.pdf

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



డ్రాగన్ దిగుతున్నాడు

ఎన్టీఆర్ సరికొత్త లుక్‌లోకి మారారు. ఆయన ఒక సోఫాలో స్టైలిష్‌గా కూర్చొని, దట్టమైన గడ్డంతో, నల్లకళ్లద్దాలు పెట్టుకొని కనిపిస్తున్న ఫొటో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎన్టీఆర్ సన్నబడి ఫిట్‌గా కనిపించడంతో ఆయన కొత్త లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రశాంత్‌నీల్‌తో చేస్తున్న సినిమా కోసమే ఎన్టీఆర్ కొత్త లుక్‌లో కనిపించారని తెలుస్తోంది. ఈ వారంలో హైదరాబాద్‌లో మొదలవనున్న కొత్త షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్నారు.



శశిరేఖ వచ్చేసింది

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'మీసాల పిల్ల' సూపర్ హిట్ అయి సినిమాపై అంచనాలను పెంచింది. తాజాగా 'శశిరేఖా...ఓ మాటే చెప్పాలి..' అంటూ సాగే మరో ప్రేమ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను స్వీయ సంగీత దర్శకత్వంలో భీమ్స్ మధు ప్రియతో కలసి ఆలపించారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ అదిరిపోయింది. చిరంజీవి, నయనతార ఇద్దరూ తమ అభినయంతో స్క్రీన్‌ని షైమరపించారు.



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం నుంచి ఆదివారం క్రేజీ అప్‌డేట్ వచ్చింది. మంగళవారం ఈ చిత్రం నుంచి మొదటి పాటను విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్టైలిష్ లుక్‌లో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు.



రొమాంటిక్ డ్రామా

మాత్యూ అరుళనందు ఆధ్వర్యంలో విజన్ సినిమా హౌస్ సంస్థ నిర్మిస్తున్న రొమాంటిక్ డ్రామా 'హైకు'. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో ఏగన్ హీరోగా నటిస్తున్నారు. శ్రీదేవి అపల్ల, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'యువతీయువకుల్లోని అమాయకత్వంతో కూడిన ప్రేమ, విద్యార్థి జీవితంలో ఆశలు, వారు కనే కలల నేపథ్యంలో సాగే ఫీల్‌గుడ్ రొమాంటిక్ స్టోరీ ఇది. ప్రేమలోని పవిత్రత, అందమైన స్నేహం గురించి చెబుతూ హృదయానికి హత్తుకొనే సన్నివేశాలతో సినిమా ఉంటుంది' అని దర్శకుడు యువరాజ్ చిన్నసామి చెప్పారు. 'బేబి', 'కోర్టు' చిత్రాలకు సంగీతాన్ని అందించిన విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు.

మలయాళ దర్శకుడితో



తమిళ హీరో సూర్య కథానాయకుడిగా నటిస్తున్న 47వ చిత్రం (సూర్య 47-వర్కింగ్ టైటిల్) ఆదివారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సూర్య, జ్యోతిక, కార్తీ, శివకుమార్ హాజరయ్యారు. 'రోమాంచమ్', ఆవేశం' లాంటి సూపర్‌హిట్స్ అందించిన మలయాళ దర్శకుడు జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నాడు. నజ్రియా నజీమ్ సూర్యకుజోడీగా నటిస్తున్నారు. జఘరమ్ స్టూడియోస్‌తో కలసి జ్యోతిక నిర్మిస్తున్నారు.

సందేశంతో అలరించే చిత్రం



నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల సమస్య ఇతివృత్తంగా తెరకెక్కిన చిత్రం 'కామ అండ్ ది డిజిటల్ సూత్రాస్'. ఎన్‌హెచ్ ప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. వినయ్ వర్మ, చంద్రకళ జంటగా నటించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్‌హెచ్ ప్రసాద్ మాట్లాడుతూ 'టైటిల్ బోల్డ్‌గా ఉన్నా సినిమాలో అసభ్యత ఉండదు. సున్నితమైన విషయాన్ని చర్చిస్తూ, కుటుంబంతో కలసి చూసేలా మా సినిమాను తెరకెక్కించాం. సందేశంతో పాటు వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

గురువా నా మాటే వినరా..



కార్తి, కృతి శెట్టి జంటగా నలన్ కుమార స్వామి తెరకెక్కించిన చిత్రం 'అన్నగారు వస్తారు'. స్టూడియో గ్రీన్ బేనర్‌పై కె.ఇ.జ్ఞాన్‌వేల్ రాజా నిర్మించారు. సినిమా ఈనెల 12న విడుదలవుతోంది. తాజాగా 'అలాపిక్కే ఉమ్మక్' అనే పాటను చిత్రబృందం విడుదల చేసింది. సంతోష్ నారాయణ్ సంగీతం అందించారు. రాకేందు మౌళి పాటను రాసి ఆలపించారు. 'వలయ అహ్ కలయ, గోలయ్య, జై బాలయ్య, కలలే వలరా, గురువా నా మాటే వినరా..' అంటూ సాగే పాటకు కార్తి అదిరిపోయే స్టెప్‌లు వేశారు.

కొత్త కోణంలో కర్మ సిద్ధాంతం

వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రధారులుగా సంజీవ్ మేగోటి రూపొందిస్తోన్న చిత్రం 'పోలీస్ కంప్లెయింట్'. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిల్మ్స్ బేనర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరలక్ష్మి శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. 'సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా సాగుతున్నాయి' అని నిర్మాతలు తెలిపారు. చిత్ర దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ "చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మనం చేసే ప్రతి చర్య తిరిగి మనకు ఫలితంగా వస్తుందన్న భావనను హారర్ థ్రిల్లర్‌గా కొత్త కోణంలో చూపించబోతున్నాం' అని తెలిపారు.



పెళ్లి పీటలెక్కడం నాకు బాగుండదేమో



'నాకు ఇప్పుడు 60 ఏళ్లు. రెండు పెళ్లిళ్లు విఫలమయ్యాక, ఈ వయసులో నేను మళ్లీ ప్రేమలో పడతాననీ, నాకో తోడు దొరుకుతుందనీ నేను ఊహించలేదు. ఒంటరిగానే ఉండిపోతాననుకున్నాను. కానీ గౌరీ నా జీవితంలోకి వచ్చింది. ప్రస్తుతం మేమిద్దరం చాలా సంతోషంగా ఉన్నాం. ఆమె నాకు ఎంతో ప్రశాంతతను ఇస్తోంది' అని ఆమిర్‌ఖాన్ చెప్పారు. గౌరీ స్ప్రాట్‌తో తన ప్రేమాయణం గురించి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీరు మూడో పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అని అడగ్గా, 'అధికారికంగా పెళ్లి చేసుకోవడం అనేది కేవలం ఒక తంతు మాత్రమే. మా మనసులో మేము ఎప్పుడో పెళ్లి చేసుకున్నాం. అయినా 60 ఏళ్ల వయసులో పెళ్లి పీటలెక్కడం నాకు బాగుండదేమో' అని సరదాగా స్పందించారు. రీనా దత్తా, కిరణ్‌రావులతో విడిపోయిన తర్వాత ఆమిర్, గౌరీతో రిలేషన్‌లో ఉన్నారు.

'ఇట్స్ ఓకే గురూ' అనాల్సిందే



సాయిచరణ్, ఉషశ్రీ జంటగా నటించిన చిత్రం 'ఇట్స్ ఓకే గురూ'. మణికంఠ దర్శకత్వంలో క్రాంతి ప్రసాద్ నిర్మించారు. ఈనెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'జీవితం బాగుండాలంటే 'ఇట్స్ ఓకే గురూ' అనాల్సిందే. ఎన్ని సమస్యలు వచ్చినా 'ఇట్స్ ఓకే గురు' అనుకుంటూ ముందుకెళ్లిపోతే జీవితం చాలా బావుంటుంది అనే తాత్వికతతో ఈ చిత్రాన్ని రూపొందించాం' అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'దైనందిన జీవితంలో ప్రతికూల భావోద్వేగాలను ఎలా అధిగమించాలనేది ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం. మా హీరో హీరోయిన్లు, దర్శకుడు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు.' అని తెలిపారు. మంచి ప్రేమకథతో పాటు ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న చిత్రమిదని సాయిచరణ్ తెలిపారు.

బిజినెస్

వరంగల్ ● సోమవారం 8 డిసెంబరు 2025

ఈ వారం మరో 13 ఐపీఓలు

- ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.85,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఆఫరింగ్(ఐపీఓ)ల జోరు కొనసాగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఐపీఓల ద్వారా కంపెనీలు సమీకరించిన నిధులు దాదాపు రూ.85,000 కోట్లకు చేరాయి. ఈ వారం మరో 13 కంపెనీలు (మెయిన్‌బోర్డ్, ఎస్ఎంఈ కలిపి) రూ.13,807 కోట్ల సమీకరణ కోసం ఐపీఓకు వస్తున్నాయి. ఇందులో వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ రూ.1,289 కోట్ల ఐపీఓ సోమవారం ప్రారంభమవుతోంది. ఇందుకోసం ఒక్కో షేరును రూ.185-195 ప్రైస్ బ్యాండ్‌లో జారీ చేస్తోంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ సైతం ఈవారంలోనే ఆఫర్‌ను ప్రారంభించనుంది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.10,603 కోట్లు సమీకరించనుంది. షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.2,061-2,165గా నిర్ణయించింది. ఈ ఐపీఓ 12న ప్రారంభమై16న ముగుస్తుంది.

ఈ ఏడాది 14% రుణ వృద్ధి

రూ.25 లక్షల కోట్లకు పైగా ఆర్ఏఎం రుణాలు ● రూ.9 లక్షల కోట్లకు గృహ రుణాల పోర్ట్‌ఫోలియో



ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

న్యూఢిల్లీ: ఆర్థిక వృద్ధి గాడిలో పడడంతో పరపతి వృద్ధి రేటూ ఊపందుకుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరాని(2025-26)కి తమ రుణాల వృద్ధి రేటు అంచనాను 12 శాతం నుంచి 14 శాతానికి పెంచినట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ(ఆర్ఏఎం) రుణాలు ఇందుకు ప్రధానంగా దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఈల రుణ గిరాకీ 17 నుంచి 18 శాతం చొప్పున పెరుగుతుంటే, వ్యవసాయ, రిటైల్ రుణాల వృద్ధి రేటు 14 శాతం చొప్పున పెరుగుతున్నట్టు తెలిపారు. తమ మొత్తం రుణాల్లో 67 శాతం వాటా ఉన్న ఆర్ఏఎం రుణాలు ఈ సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికే రూ.25 లక్షల కోట్లు మించి పోయినట్టు చెప్పారు. ఇందులో గృహ రుణాలే రూ.9 లక్షల కోట్ల వరకు ఉన్నట్టు పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పసిడి రుణాలకూ గిరాకీ: ప్రస్తుతం పసిడి రుణాల వృద్ధి రేటు కూడా రెండు అంకెల్లో ఉందని ఎస్‌బీఐ చైర్మన్ వెల్లడించారు. ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికం వరకు అంతంత మాత్రంగానే ఉన్న ఎస్‌బీఐ కార్పొరేట్ రుణాల వృద్ధి రేటు కూడా సెప్టెంబరు త్రైమాసికంలో కొద్దిగా కోలుకుని 7.1 శాతానికి చేరింది. ఆర్‌బీఐ రెపో రేటును మరో పావు శాతం తగ్గించడంతో రుణాలకు గిరాకీ మరింత పెరగనుందని ఎస్‌బీఐ చీఫ్ చెప్పారు. దీని వల్ల ఈ ఆర్థిక సంవత్సరం మూడు శాతం నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) సాధించాలన్న తమ లక్ష్యానికీ ఎలాంటి ఇబ్బంది ఉండక పోవచ్చన్నారు. మరో ఐదారు సంవత్సరాల వరకు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా నిధులు సమీకరించాల్సిన అవసరం ఎస్‌బీఐకి లేదని శెట్టి తెలిపారు.

26500 ఎగువన బుల్లిష్

(8-12 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమరనాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 26,328- 25,933 పాయింట్ల మధ్యన కదలాడి స్వల్ప లాభంతో 26,186 వద్ద క్లోజైంది. ఈ వారాంతంలో 26,500 కన్నా పైన ముగిస్తే స్వల్ప కాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 26,500 బ్రేక్‌డౌన్ స్థాయి : 25,800

నిరోధ స్థాయిలు: 26,500, 26,700, 26,800 (26,286 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 26,000, 25,900, 25,800 (26,086 దిగువన బేరిష్)

ఎఫ్‌పీఐలు పీఛేముడ్!

ఈ ఏడాదిలో రూ.1.55 లక్షల కోట్లకు చేరిన అమ్మకాలు

గతవారంలో రూ.11,820 కోట్లు వెనక్కి.

న్యూఢిల్లీ: మన స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు(ఎఫ్‌పీఐ) పెద్ద ఎత్తున తరలిపోతున్నాయి. ఈ నెల తొలి వారంలో నికరంగా రూ.11,820 కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి. గతనెలలోనూ రూ.3,765 కోట్లు తరలిపోయాయి. దీంతో ఈ సంవత్సరంలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐల నికర అమ్మకాలు రూ.1.55 లక్షల కోట్లకు చేరాయి. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం ఎఫ్‌పీఐల అమ్మకాలకు ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మన మార్కెట్‌లో అమ్మగా వచ్చిన నిధులను ఎఫ్‌పీఐలు చైనా, దక్షిణ కొరియా, తైవాన్ మార్కెట్‌లకు మళ్లిస్తున్నట్టు తెలుస్తోంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	విజయవాడ	130
వరంగల్	129	గుంటూరు	135
కరీంనగర్	129	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	125
కర్నూలు	129	నెల్లూరు	130
విశాఖపట్నం	126	అనంతపురం	130
గోదావరి	130		

వడ్డీ రేట్లను తగ్గించిన పీఎన్‌బీ, బీఓఎమ్



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎమ్) కూడా తమ రుణరేట్లను పావు శాతం తగ్గించాయి. సవరించిన వడ్డీ రేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయని బ్యాంకులు వెల్లడించాయి. పీఎన్‌బీ రెపో అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) 8.35 శాతం నుంచి 8.10 శాతానికి తగ్గింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎమ్‌సీఎల్ఆర్), బేస్ రేటులో మాత్రం ఎటువంటి మార్పు చేయలేదని పీఎన్‌బీ స్పష్టం చేసింది. తాజా సవరణతో తమ బ్యాంకులో గృహ రుణంపై వడ్డీ 7.10 శాతం, కార్ లోన్ రేటు 7.45 శాతం నుంచి ప్రారంభమవుతాయని బీఓఎమ్ తెలిపింది.

యూబీఎస్‌లో 10,000 ఉద్యోగాల కోత!

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ 2027 నాటికి ప్రపంచవ్యాప్తంగా మరో 10,000 మంది ఉద్యోగులను తొలగించే ఆలోచనలో ఉందని సమాచారం. బ్యాంక్ మొత్తం సిబ్బందిలో దాదాపు 9 శాతానికి సమానమిది. గత ఏడాది చివరినాటికి ఈ బ్యాంక్‌లో 1.10 లక్షల మంది పనిచేస్తున్నారు. 2023లో క్రెడిట్ స్విస్‌ను కొనుగోలు చేసి తనలో విలీనం చేసుకున్న యూబీఎస్.. వ్యాపార పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా ఉద్యోగులను క్రమంగా తగ్గించుకుంటూ వస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ. 90	

26,300 వద్ద మరోసారి గట్టి పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలైన 26,300 నుంచి దిగువకు చేరినప్పటికీ ఆ తర్వాత 26,000 వద్ద రికవరీ సాధించి సానుకూల ట్రెండ్‌ను సూచించింది. చివరకు 150 పాయింట్లు రికవరీ సాధించి 16 పాయింట్ల స్వల్ప నష్టంతో 26,185 పాయింట్ల వద్ద క్లోజైంది. మార్కెట్ గత మూడు వారాలుగా 26,000 స్థాయిల వద్ద సైడ్‌వేస్, ఆటుపోట్ల ట్రెండ్‌లో సాగుతూ వస్తోంది. ప్రస్తుతం నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలైన 26,300 దిగువనే ఉంది. టెక్నికల్‌గా నిఫ్టీ ఈ స్థాయిల వద్ద స్వల్పకాల నిరోధాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ మార్కెట్లో ఇంకా పాజిటివ్ ట్రెండ్ కనిపిస్తోంది. నిఫ్టీ ఈ నిరోధ స్థాయిలను బ్రేకౌట్ చేస్తే తదుపరి అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తుంది. మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా వారం ప్రాతిపదికన 450 పాయింట్ల కరెక్షన్‌ను కనబరిచింది. గత నాలుగు వారాలుగా ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలైన 61,000 వద్ద కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా గత వారం 320 పాయింట్ల మేర కరెక్షన్‌ను కనబరిచింది.

బుల్లిష్ స్థాయిలు: సానుకూల ట్రెండ్ కోసం ప్రధాన నిరోధ స్థాయిలైన 26,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. వచ్చే కొద్ది రోజులు ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకుంటే అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. అప్పుడు మార్కెట్ కొత్త శిఖరాల వైపు అడుగులు వేస్తుంది. తదుపరి మానసిక అవధి 26,600.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదేనీ బలహీనతను సూచిస్తే 26,000 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. ఇది గత వారం బాటమ్‌లో ఏర్పడిన స్థాయి. సానుకూల ట్రెండ్, రక్షణ కోసం ఈ స్థాయిలకు ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 60,000 రియాక్షన్‌ను కనబరిచి చివరకు బలంగా రికవరీ సాధించింది. వారాంతంలో నిలకడగా 59,970 వద్ద ముగిసి నిలకడను ప్రదర్శించింది. ఈ వారంలో సూచీ ప్రస్తుత నిరోధ స్థాయిలైన, గరిష్ఠ స్థాయిలైన 60,100 వద్ద కొద్ది రోజుల పాటు నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఏదేనీ బలహీనతను సూచిస్తే మాత్రం తదుపరి మద్దతు స్థాయిలు 59,500 దిగువన ఉంటాయి. ఇక్కడ మరింత బలహీనతకు ఆస్కారం ఉంది. తదుపరి మద్దతు స్థాయి 58,900.

పాటర్న్: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ 26,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ వద్ద నిలదొక్కుకోవాలి. 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్ లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. నిఫ్టీ గతవారం 26,000 స్థాయిల వద్ద 25 రోజుల స్వల్పకాలిక చలన సగటు వద్ద రికవరీ సాధించింది.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం, శుక్రవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	26,240, 26,300
మద్దతు	26,150, 26,000

బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లపై కన్నేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. ఆర్‌బీఐ రెపోరేటు తగ్గించటం, భారత ఆర్థిక వృద్ధి రేటు బాగున్నప్పటికీ ఎఫ్ఐఐలు క్రమంగా పెట్టుబడులు ఉపసంహరిస్తుండటం, రూపాయి పతనం కీలకంగా ఉండనున్నాయి. అమెరికా పరిస్థితి, జాబ్ మార్కెట్ నానాటికి క్షీణిస్తుండటం నెగటివ్ సెంటిమెంట్‌కు దారి తీస్తోంది. గత వారం ఐటీ, మెటల్, ఆటో రంగాల షేర్లు జోరు ప్రదర్శించాయి. ఈ వారం ఈ రంగాలతో పాటు బ్యాంకింగ్, ఫార్మా షేర్లు మెరుగ్గా ఉండే అవకాశం ఉంది.

స్టాక్ రికమండేషన్స్

ఎస్‌బీఐ కార్డ్స్: ప్రస్తుతం ఈ షేరు కీలక జోన్‌లో ఉంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించటంతో వీటిపై ఆసక్తి నెలకొంది. ఈ షేరు స్వల్పకాల నిరోధ స్థాయికి చేరే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.885 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.955/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.865.

ఇండస్ టవర్: సెప్టెంబరు నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు కొంతకాలంగా సైడ్‌వేస్‌లో చలిస్తూ కన్సాలిడేట్ అయ్యింది. స్వల్పకాల నిరోధాన్ని బ్రేక్ చేసేందుకు సిద్ధమైంది. పైగా నిఫ్టీతో పోలిస్తే జోరును ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.415 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.410 శ్రేణిలో ప్రవేశించి రూ.450/480 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.400 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

చోళ ఫైనాన్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. రెపో రేటు తగ్గింపు నేపథ్యంలో ఈ కౌంటర్‌పై ఆసక్తి నెలకొంది. 52 వారాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన తర్వాత కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.1,730 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,720 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.1,780-1,920 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,700.

ఆర్‌బీఎల్ బ్యాంక్: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. రూ.340 స్థాయిని తాకిన తర్వాత కొంత బలహీనత కనిపిస్తోంది. అయితే వాల్యూమ్ తక్కువగా నమోదవుతుండటం గమనార్హం. గత శుక్రవారం రూ.305 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.300 పై స్థాయిలో ప్రవేశించి రూ.375 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.285.

పీఎన్‌బీ హౌసింగ్: ఆగస్టులో డివిడెండ్ ఇచ్చిన తర్వాత ఒక్కసారిగా పతనమైన ఈ షేరు ప్రస్తుతం మీడియం టర్మ్ ఆఫ్ ట్రెండ్‌లో ఉంది. రూ.954 వద్ద సమీప నిరోధాన్ని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నది. గత శుక్రవారం రూ.903 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.890 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.955 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.875 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్

కుర్రాళ్ల ఆశలు ఆవిరి

- సెమీస్‌లో యువ భారత్ ఓటమి
- ఫైనల్లో జర్మనీ, స్పెయిన్ ఢీ
- అర్జెంటీనాకు నిరాశ

జూనియర్ హాకీ వరల్డ్‌కప్

చెన్నై: జూనియర్ వరల్డ్‌కప్‌లో భారత హాకీ కుర్రాళ్ల కథ ముగిసింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 1-5తో డిఫెండింగ్ చాంప్ జర్మనీ చేతిలో చిత్తుగా ఓడింది. భారత్ తరఫున అన్‌మోల్ ఎక్కా (51వ నిమిషం) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. జర్మనీ నుంచి లూకాస్ కోజెల్ (14వ, 30వ) డబుల్ ధమాకాతోపాటు టిట్టెస్ వెక్స్ (15వ), జొనాస్ జర్సమ్ (40వ), బెన్ హాస్‌బాచ్ (49వ) గోల్స్ సాధించారు. బుధవారం జరిగే కాంస్య పోరులో అర్జెంటీనాతో భారత్ తలపడనుంది. అదేరోజు జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో జర్మనీ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో స్పెయిన్ 2-1తో రెండుసార్లు విజేత అర్జెంటీనాకు షాకిచ్చి తొలిసారి టైటిల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. స్పెయిన్‌కు మారియో మెనా (7వ), అల్బర్ట్ సెరాహిమా (43వ).. అర్జెంటీనాకు జువాన్ ఫెర్నాండెజ్ జువాన్ (21వ) గోల్స్ అందించారు. 5,6 స్థానాల కోసం జరిగే పోరులో నెదర్లాండ్స్‌తో బెల్జియం తలపడనుంది.

సిమ్రన్‌ప్రీత్‌కు స్వర్ణం

- ప్రతాప్ సింగ్, అనీష్‌కు రజతాలు
- ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ ఫైనల్



దోహా: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ ఫైనల్లో భారత షూటర్ సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ స్వర్ణం సాధించగా.. అనీష్‌తోపాటు ఈ ఈవెంట్ బరిలోకి దిగిన తొలిసారే ఐశ్వరీ ప్రతాప్ సింగ్ రజతాలతో మెరిశారు. ఆదివారం జరిగిన మహిళల 25 మీ. పిస్టల్ తుదిపోరులో సిమ్రన్‌ప్రీత్ 41 పాయింట్లతో టాప్‌లో నిలిచి పసిడి పతకాన్ని సొంతం చేసుకొంది. మరో భారత షూటర్ ఇషా సింగ్ 15 పాయింట్లతో ఏడో స్థానానికి పరిమితమైంది. పురుషుల 50 మీ. రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్లో ప్రతాప్ సింగ్ 413.3 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో షూటింగ్ క్రీడలోని వరల్డ్, కాంటినెంటల్ చాంపియన్‌షిప్స్‌లో సింగ్ పతకాలు నెగ్గిన ఆటగాడిగా అరుదైన ఘనతను దక్కించుకొన్నాడు. అర్హత రౌండ్‌లో కూడా సింగ్ 595 పాయింట్లతో పతక రౌండ్‌కు క్వాలిఫై అయ్యాడు. పురుషుల 25 మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఫైనల్లో అనీష్ 16 పాయింట్లతో రెండో స్థానంతో రజతం అందుకొన్నాడు. కాగా, విజయ్‌వీర్ సిద్ధు త్రుటిలో కాంస్యం చేజార్చుకొని నాలుగో స్థానంలో నిలిచాడు.

రో-కో అనుభవం జట్టుకు అవసరం



కోచ్ గంభీర్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ అయిన భారత క్రికెట్ జట్టు వన్డే సిరీస్‌లో మాత్రం ఆధిపత్యం చూపింది. ఇందుకు విరాట్ కోహ్లీ సూపర్ ఫామ్ ప్రధాన కారణం. రెండు శతకాలు, ఓ అర్ధసెంచరీతో 302 రన్స్ సాధించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. అటు సహచర ఆటగాడు రోహిత్ శర్మ సైతం సత్తా చూపాడు. దీనికి ముందు ఆస్ట్రేలియా పర్యటనలో హిట్‌మ్యాన్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలవడం విశేషం. ఈ వెటరన్ల ప్రదర్శనపై ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ప్రశంసలు కురిపించాడు. 'రోహిత్, విరాట్ నైపుణ్యం కలిగిన ఆటగాళ్లే కాకుండా.. వన్డే ఫార్మాట్‌లో ప్రపంచ అగ్రశ్రేణి క్రికెటర్లు. వారి అనుభవం డ్రెస్సింగ్ రూమ్‌లో చాలా కీలక పాత్ర పోషిస్తుంది. తాము ఎలా ఆడితే జట్టుకు ప్రయోజనమో వారికి తెలుసు. కొన్నేళ్లుగా భారత క్రికెట్ తరఫున అలాంటి ప్రదర్శననే కొనసాగిస్తున్నారు. మున్ముందు కూడా ఇదే జోరును చూపాలని కోరుకుంటున్నా' అన్నాడు.. అయితే 2027 వన్డే వరల్డ్‌కప్‌లో రోహిత్-కోహ్లీలు ఆడతారా అన్న విషయాన్ని మాత్రం గంభీర్ దాటేశాడు. 'ఇంకా రెండేళ్లున్న వరల్డ్‌కప్ గురించి ఇప్పుడే మాట్లాడడం తొందరపాటే అవుతుంది. వర్తమానంలో ఉండడం ముఖ్యం. రుతురాజ్, జైస్వాల్ లాంటి యువ ఆటగాళ్లు తమకు దక్కిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు' అని గంభీర్ వివరించాడు. ఇదిలావుండగా ఇతరులకన్నా రోహిత్, విరాట్‌లను భిన్నంగా చూడాలని మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ సూచించాడు. యువ ప్లేయర్ల వలె ఈ జోడీకి ఎక్కువ మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరం లేదన్నాడు.

సురేఖ కంచు మోత



న్యూఢిల్లీ: చైనీస్ తైపీలో జరిగిన తైపీ ఆర్చరీ ఓపెన్‌లో వెన్నం జ్యోతి సురేఖ కంచు పతకం సాధించింది. ఇండోర్ కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగం కాంస్య పోరులో సురేఖ 149-143తో సో చెవాన్‌పై గెలిచింది. అంతకు ముందు సెమీస్‌లో జ్యోతి 144-145తో మ్లినారిచ్ (క్రొయేషియా) చేతిలో ఓడింది. ఇక, అండర్-21 కేటగిరిలో చికితరావు, జూనియర్ విభాగంలో గణేష్ పసిడి పతకాలు నెగ్గారు.

అప్పన్నను దర్శించుకున్న విరాట్ కోహ్లీ





సింహాచలం (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామిని భారత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, వాషింగ్టన్ సుందర్ దర్శించుకున్నారు. ఆదివారం సింహగిరికి చేరుకున్న వీరిద్దరికి దేవస్థానం ఏఈవో కె. తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం తరువాత బేడా మండప ప్రదక్షిణలు చేసి అంతరాలయంలోకి ప్రవేశించిన క్రికెటర్ల గోత్రనామాలతో ప్రధానార్చకులు స్వామికి అష్టోత్తర శతనామార్చన చేశారు. గోదాదేవి సన్నిధిలో కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఏఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారుల అభ్యర్థన మేరకు విజిటర్స్ బుక్‌లో కోహ్లీ సంతకం చేశారు. స్వామి అనుగ్రహంతో విజయం సాధించామని లిఖితపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అవును.. మా పెళ్లి రద్దయ్యింది



ప్రకటించిన మంధాన, పలాష్

ముంబై: ఊహించిందే జరిగింది. భారత మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌ల వివాహం రద్దయ్యింది. ఈమేరకు ఆదివారం వీరిద్దరూ వేర్వేరుగా తమ సోషల్ మీడియా ఖాతాల్లో వెల్లడించారు. ఈ ప్రకటనలు వెలువడ్డ కాసేపటికే ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం గమనార్హం. అయితే అసలు కారణాన్ని మాత్రం వివరించలేదు. కొన్నేళ్లుగా ఈ జంట మధ్య ప్రేమాయణం సాగుతుండగా.. గత నెల 23న వివాహ బంధంతో ఒక్కటి కావాలనుకున్నారు. అయితే పెళ్లి రోజు ఉదయమే మంధాన తండ్రి అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. దీంతో వివాహాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే అటు పలాష్ కూడా అనారోగ్యానికి గురైనట్టు కథనాలు వినిపించాయి. ఇంతలోనే మంధాన తన ఇన్‌స్టాగ్రామ్‌లో పలాష్‌తో దిగిన ఫొటోలన్నీ తొలగించడం చర్చనీయాంశమైంది. అలాగే పలాష్‌కు గతంలోనే ఓ కొరియోగ్రాఫర్‌తో సంబంధం ఉన్నట్టుగా వార్తలు వినిపించాయి.

స్మృతి ఏమందంటే..

'గత కొద్దివారాలుగా నా జీవితం చుట్టూ ఎన్నో ఊహాగానాలు సాగుతున్నాయి. దీనిపై ఓ స్పష్టత ఇవ్వాల్సిన సమయం వచ్చింది. అవును.. నా వివాహం రద్దయ్యింది. ఇక ఈ విషయాన్ని ఇక్కడితో ముగించాలనుకుంటున్నా. మీరు కూడా వదిలేస్తారని భావిస్తున్నా. దయచేసి మా రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి.. ముందుకు సాగేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా. వీలైనంత కాలం భారత్ తరఫున క్రికెట్ ఆడి ట్రోఫీలు గెలవాలని కోరుకుంటున్నా. ఈ సమయంలో నాకు మద్దతిచ్చిన అందరికీ ధన్యవాదాలు' అని మంధాన పేర్కొంది.

ముచ్చల్ ప్రకటన..

పలాష్ ముచ్చల్ సైతం పెళ్లి రద్దు నిర్ణయాన్ని ఇన్‌స్టా స్టోరీలో వెల్లడించాడు. తన వ్యక్తిగత సంబంధం నుంచి బయటికి వచ్చి జీవితంలో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టు చెప్పాడు. 'ఏ మాత్రం ఆధారాల్లేని వదంతులను నమ్మేస్తున్న వారిని చూస్తే బాధేస్తోంది. ఇది నా జీవితంలో ఎంతో కష్టకాలం. ఎప్పటికీ నిర్ధారించుకోలేని పుకార్లను నమ్మి అవతలి వ్యక్తులను అంచనావేసే ముందు, మన మాటలు వారిని ఎంత బాధపెడతాయో ఆలోచించుకోవాలి. నాకు పరువు నష్టం కలిగించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటా. ఈ కష్ట సమయంలో నాకు నా పక్షాన నిలిచినవారందరికీ ధన్యవాదాలు' అని ముచ్చల్ పేర్కొన్నాడు.

కిర్‌స్టెన్..నమీబియా సలహాదారు

న్యూఢిల్లీ: గ్యారీ కిర్‌స్టెన్ (దక్షిణాఫ్రికా) నమీబియా జట్టు సలహాదారుగా నియమితుడయ్యాడు. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక వేదికలుగా జరిగే టీ20 వరల్డ్ కప్‌నకు నమీబియాను సంసిద్ధం చేసేందుకు జట్టు ప్రధాన కోచ్ క్రైగ్ విలియమ్స్‌తో కలిసి అతడు పని చేస్తాడు.

వహ్వా..ఆస్ట్రేలియా

రెండో టెస్ట్‌లోనూ ఘన విజయం

ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్




బ్రిస్బేన్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జోరు అలా.. ఇలా లేదు. తొలి టెస్ట్‌లో కేవలం రెండు రోజుల్లో, ఎనిమిది వికెట్లతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన కంగారూలు..రెండో టెస్ట్‌లోనూ అంతే తేడాతో ఘన విజయం సాధించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (50), విల్ జాక్స్ (41) ఇంగ్లండ్ ఓటమిని తప్పించేందుకు తీవ్రంగా పోరాడారు. సగం రోజు, 37 ఓవర్లపాటు ఆసీస్ బౌలర్లకు ఎదురొడ్డి నిలిచిన ఆ జోడీ ఏడో వికెట్‌కు విలువైన 96 పరుగులు జోడించింది. కానీ నేసర్ (5/42) వీరిద్దరి వికెట్లను తీయడంతో ఆస్ట్రేలియా విజయం ఖాయమైంది. ఓవర్‌నైట్ 134/6 స్కోరుతో ఆదివారం, నాలుగో రోజు, రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 241 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్మిత్, కీపర్ కేరీ అద్భుతమైన క్యాచ్‌లు అందుకొని జాక్స్, స్టోక్స్ అవుట్‌లో తమవంతు పాత్ర పోషించారు. సూపర్ ఫీల్డింగ్ ఆసీస్ విజయంలో కీలక భూమిక పోషించగా, ఇంగ్లండ్ ఆటగాళ్లు ఏకంగా ఐదు క్యాచ్‌లను మిస్ చేయడం గమనార్హం. ఇక..65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 10 ఓవర్లలో 69/2 స్కోరుతో ఛేదించి ఆస్ట్రేలియా విజయం కేతనం ఎగురవేసింది. స్మిత్ (9 బంతుల్లో 23 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 334, ఆస్ట్రేలియా 511 పరుగులు చేశాయి. ఈ టెస్ట్‌లోనూ స్టార్క్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడం విశేషం.

బెంగళూరులోనే ఐపీఎల్ మ్యాచ్‌లు: డీకే శివకుమార్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియంలోనే ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతాయని, వేదిక మార్చే అవకాశం ఇవ్వబోమని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఉద్ఘాటించారు. ఆదివారం కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెంగళూరు నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను మరోచోటికి మార్చేందుకు అంగీకరించేది లేదన్నారు. కాగా, కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షునిగా టీమిండియా మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్, కార్యదర్శిగా సంతోష్ మీనన్ ఎన్నికయ్యారు.



2047 నాటికి 1,15,000 కిలోమీటర్ల రోడ్లు


- 27 అంశాలతో రోడ్ల పాలసీ
- రేపు గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో చర్చ

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారులను భారీ స్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు ప్రయాణికుల భద్రతకు సంబంధించిన 27 అంశాలు, 44 పేజీలతో కూడిన విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ రహ దారుల విభాగం రూపొందించింది. దీనిని మంగళవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు ఆవిష్కరించనున్నారు. అంతకుముందు ఆర్ అండ్ బీ రూపొందించిన 'రోడ్ సెక్టార్ పాలసీ ఫర్ తెలంగాణ రైజింగ్ విజన్-2047'పై గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలోని మూడో నంబరు హాల్‌లో ఇదే రోజు ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చర్చ జరగనుంది. తర్వాత రోడ్ సెక్టార్ పాలసీ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తారు. ఆ పాలసీలో ప్రధానంగా ఉన్న ఏడు మూలస్తంభాల్లో రోడ్డు భద్రతను మెరుగుపర్చడం, గ్రీన్ అండ్ స్మార్ట్ మొబిలిటీ, రహదారుల నిర్మాణాల ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం, అన్ని ప్రాంతాలను కలిపేలా రోడ్ల నిర్మాణం సహా పలు అంశాలున్నాయి. దీంతోపాటు రోడ్డు అసెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు. రహదారుల నిర్మాణంలోనూ సాంకేతికత వినియోగం, నిర్మాణ విధానాల్లోనూ పలు మార్పులు చేయనున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ అండ్ రూరల్ రీజియన్‌లలో రహదారుల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్ అండ్ బీ పరిధిలో ఉన్న 46వేల కిలోమీటర్ల రహదారి వ్యవస్థను 2034నాటికి 78,411 కి.మీలకు పెంచే లక్ష్యం విధించుకున్నట్లు డాక్యుమెంట్‌లోని యాక్షన్‌ప్లాన్ వివరాల్లో పేర్కొన్నారు. 2047 నాటికి 1,15,000 కిలోమీటర్లకు పెంచేలా ప్రణాళిక రూపొందించారు. రోడ్ల విస్తీర్ణాన్ని పెంచేందుకు రాష్ట్ర బడ్జెట్‌తో పాటు కేంద్రం నుంచి నిధులు, గ్రాంట్లు, పబ్లిక్-ప్రైవేటు-భాగస్వామ్య విధానంలో నిధులను సమీకరించనున్నారు. కాగా రహదారులను టీజీ రోడ్ సెక్టార్ ప్రాజెక్టు-1 (2026-29), రోడ్ సెక్టార్-2 (2030-34), రోడ్ సెక్టార్-3 (2034-38)గా విభజించారు.

పవర్‌ఫుల్ తెలంగాణ!

'స్వచ్ఛ ఇంధన' కేంద్రంగా తెలంగాణ.. 2047 నాటికి ఉద్గార రహితంగా మార్చడమే లక్ష్యం

- 9 రంగాలపై సర్కారు దృష్టి
- విజన్ డాక్యుమెంట్‌లో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక



హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం 2047 కల్లా 'నెట్ జీరో' (శిలాజ ఇంధన వాడకాన్ని తగ్గించేసి, పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించడం ద్వారా ఉద్గారాలను శూన్య స్థితికి తగ్గించడం)కి చేరడమే లక్ష్యంగా పెట్టుకుంది. పునరుత్పాదక శక్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపడంతో పాటు స్వచ్ఛ, హరిత ఇంధన కేంద్రంగా మార్చాలని కూడా ధ్యేయంగా నిర్దేశించుకుంది. విజన్ డాక్యుమెంట్ 2047 ద్వారా.. తెలంగాణను శక్తిమంతమైన రాష్ట్రంగా మలుచుకునే దిశగా అడుగులు వేస్తోంది. క్వాంటమ్ కంప్యూటర్స్, ఏఐ సిటీ రూపకల్పన, వివిధ రంగాల మైక్రో డేటా నిల్వ చేసుకునేలా సొంతంగా క్లౌడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటు, విదేశీ పెట్టుబడులే కాదు.. అక్కడి మేధో సంపత్తిని పరిశోధనల కోసం ఆహ్వానించడం, వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించడం, ఉద్యోగాలు ఇచ్చే పరిశ్రమలే కాదు.. ఉద్యోగాలు సృష్టించే మానవ వనరులకే పెద్దపీట అని చెప్పడం ద్వారా తెలంగాణకు ఏం కావాలనేది విజన్ డాక్యుమెంట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇందులో భాగంగా 9 రంగాలపై సర్కారు ప్రత్యేకంగా దృష్టి సారించింది. వాటిని ఆచరణలోకి తీసుకొచ్చేలా విస్తృత కార్యాచరణను రూపొందించుకుంది. స్వచ్ఛ ఇంధనం, స్మార్ట్ రవాణా, పారిశ్రామిక కర్బన ఉద్గారాలను తగ్గించడం, వ్యవసాయంలో మార్పులు, అడవుల పెంపు, పట్టణ మౌలిక వసతుల్లో మార్పు.. ఇలా తొమ్మిది అంశాల్లో తన విధానాలను ప్రపంచం ముందు పెడుతోంది.

పునరుత్పాదక శక్తిలో అగ్రగామిగా..

పునరుత్పాదక శక్తిలో అగ్రస్థానంలో నిలిపేలా రాష్ట్రాన్ని స్వచ్ఛ, హరిత ఇంధన కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ఆ దిశగా 2047కు లక్ష్యాలు నిర్దేశించుకుంది. శూన్య ఉద్గారాల సాధన; సౌర, పవన, బ్యాటరీ, గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత విద్యుత్తు వ్యవస్థకు పెద్దపీట వేయడం; థర్మల్ కేంద్రాలను హానికరమైన సల్ఫర్ ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌ల నియంత్రణ టెక్నాలజీలతో నవీకరించాలని లక్ష్యాలుగా పెట్టుకుంది. 2026నాటికి గంటకు 100 టెరావాట్స్ ఉన్న విద్యుత్తు డిమాండ్ 2047నాటికి 780 టెరావాట్స్‌కు చేరనుంది. దీంతో 2047నాటికి 90% పునరుత్పాదక శక్తి, మిగిలిన 10 శాతానికి క్లీన్ థర్మల్, కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజీ, స్మార్ట్ గ్రిడ్లు, గ్రీన్ హైడ్రోజన్, అధునాతన స్టోరేజ్ వ్యవస్థల ఏర్పాటు.. సౌర, పవన, ఫ్లోటింగ్ సోలార్ అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సమీకృత స్మార్ట్ రవాణా..

భవిష్యత్తులో తెలంగాణ రవాణా రంగం పూర్తిగా కాలుష్య రహితంగా మారనుందని ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొంది. 2030నాటికి దేశంలో అత్యధిక విద్యుత్తు బస్సులు తిరిగే నగరంగా హైదరాబాద్‌ను నిలపడం; 2047నాటికి అన్ని రోడ్డు రవాణా రంగాల్లో కాలుష్యరహిత వాహనాలుగా మార్చడం; 2039తర్వాత డీజిల్, పెట్రోల్ వాహనాల అమ్మకాలపై దశలవారీ నియంత్రణ ఉంటుందని వెల్లడించింది. ఇందులో భాగంగా 2030 నాటికి 6000 ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, 2047 నాటికి ప్రతి 20 కి.మీ.కు ఒక ఫాస్ట్ చార్జింగ్ కారిడార్, హైడ్రోజన్ రీఫిల్లింగ్ నెట్‌వర్క్ ఏర్పాటు; మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరణ, ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, టీవోడీ విధానంతో నడక, సైక్లింగ్‌కు ప్రాధాన్యం, అధిక రద్దీ ఉన్న మార్గాల్లో ఎలివేటెడ్ కారిడార్ల ఏర్పాటుపై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది.

నెట్ జీరో పరిశ్రమ

తెలంగాణను నెట్ జీరో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకోసం తెలంగాణ పారిశ్రామిక డీకార్బనైజేషన్ మిషన్ (టీఐడీఎం) ఏర్పాటు, రామగుండం, సింగరేణి, భూపాలపల్లి మొదలైన ప్రాంతాల్లో సీసీయూఎస్ (కార్బన్ క్యాప్చర్, యుటిలైజేషన్ స్టోరేజ్) పైలెట్లు; నల్లగొండ-సూర్యాపేటలో హైడ్రోజన్ హబ్‌లు, పరిశ్రమలకు గ్రూప్ క్యాప్టివ్ ఆర్ఈ ప్లస్ బీఈఎస్ఎస్ (ఒక్క కంపెనీకాకుండా పలు కంపెనీలు పవర్ ప్లాంట్‌లో పెట్టుబడులు పెట్టి, ఉత్పత్తయ్యే విద్యుత్తులో వాటాలు పొందడం); 2030 నాటికి 80 శాతం రెడ్/ఆరెంజ్ కేటగిరీలో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు మార్చడం; వ్యర్థాల శుద్ధి, ఎల్‌సీ3 సిమెంట్, వేస్ట్ హీట్ రికవరీ.. కార్బన్ కనెక్ట్ తెలంగాణ పేరుతో షేర్డ్ కార్బన్-హైడ్రోజన్ పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేయడం.

వాతావరణానికి తగ్గట్లుగా వ్యవసాయం

వ్యవసాయ రంగాన్ని సమూలంగా మార్చే దిశగా విజన్ డాక్యుమెంట్‌లో ప్రణాళికలను ప్రస్తావించింది. 2047నాటికి పూర్తిగా ఏడబ్ల్యూడీ/డీఎస్ఆర్ ఆధారిత వరి సాగు (నీటిని ఆదా చేసే రెండు అత్యాధునిక వ్యవసాయ పద్ధతులు), బయోచార్, సీబీజీ, 30-40 శాతం ఎంటెరిక్ మీథేన్ తగ్గింపు.. సౌర పంపులు, సౌర మైక్రోగ్రిడ్లు, ఎఫ్‌పీవో వద్ద సౌర డ్రైయర్లు, కోల్డ్ చైయిన్లు, నెట్‌జీరో టెక్‌ఆధారిత రైస్ మిల్లులు, తెలంగాణ గ్రీన్‌టెక్ రైస్ పేరుతో ఎగుమతి బ్రాండింగ్.

వ్యర్థాలను సంపదగా మార్చడం

2047 నాటికి రాష్ట్రం 'సర్క్యులర్, మీథేన్-నేచురల్ వేస్ట్ ఎకానమీ'గా మారనుంది. ఇందుకుగాను వ్యర్థాలను వందశాతం వేరుచేయడం, జీహెచ్‌ఎంసీలో 200 మెగావాట్ల 'వ్యర్థాల నుంచి ఇంధనం' ప్రాజెక్టుల ఏర్పాటు, ఏఐ ఆధారిత నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు.

అడవుల పునరుద్ధరణ.. హరిత ప్రాంత పరిధి పెంపు

2047 నాటికి రాష్ట్రంలో మూడో వంతు ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 250 కోట్ల మొక్కలు నాటడం, సహజ పునరుత్పత్తి ద్వారా అడవుల పునరుద్ధరణ, ఆగ్రో ఫారెస్ట్రీని పది లక్షల హెక్టార్లకు పెంచడం, ఎస్‌సీసీఎల్ మైనింగ్ ప్రాంతాల్లో మైన్ టు ఫారెస్ట్ కార్యక్రమ అమలు, ఏఐ డ్రోన్ల ద్వారా అటవీ సంరక్షణ చర్యలు, కార్బన్ క్రెడిట్ ఆధారిత పీఈఎస్ ప్రోత్సాహకాలు ఇవ్వడం.

నెట్ జీరో పట్టణాలు

తెలంగాణ పట్టణాలను సౌరశక్తి, హరిత మౌలిక వసతులతో ఆధునీకీకరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం టీజీ రెడ్కో సౌర విధానం 2.0కింద రూఫ్‌టాప్, బిల్డింగ్ ఇంటిగ్రేటెడ్ ఫొటోవోల్టాయిక్స్ విస్తరణ, జీహెచ్‌ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీని ఎనర్జీ న్యాచురల్/పాజిటివ్ యుటిలిటీలుగా తీర్చిదిద్దడం, ఐజీబీసీలో గ్రీన్‌సిటీ సర్టిఫికేషన్ అమలుచేస్తారు.

ప్రజా భాగస్వామ్యంతో పచ్చదనం

పచ్చదనం పెంపునకు ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో జిల్లా హరిత ఉపాధి కార్యక్రమం ఒకటి. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లాలో గ్రీన్ స్కిల్ అకాడమీలు, పాఠశాలల్లో పచ్చదనం ప్రాధాన్యంపై పాఠాలు; యువత, పొదుపు సంఘాలు, ఎకో క్లబ్ వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం.

నెట్‌జీరో విధివిధానాలు

రాష్ట్ర స్థాయిలో నెట్ జీరో అమలుకు ప్రత్యేక సంస్థలు, డిజిటల్ వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందుకోసం తెలంగాణ నెట్ జీరో సంస్థను ఏర్పాటు చేయడం, అన్ని శాఖల డేటాను కలిపే క్లైమేట్ డీపీఐ, తెలంగాణ క్లైమేట్ ఫండ్ ఏర్పాటు, కార్బన్ మార్కెట్ ఫ్రేమ్ వర్క్, తెలంగాణ కార్బన్ రిజిస్ట్రీ నెలకొల్పడంతోపాటు కార్బన్ ప్రాజెక్టు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు.

మూడంచెల భద్రతా వలయం

ఆరు వేల మంది పోలీసులతో భద్రత

- 18 సెక్టార్లుగా విభజన... డ్రోన్లతోనూ పహారా
- కంట్రోల్ రూమ్‌కు 1000 కెమెరాల అనుసంధానం

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్ సజావుగా సాగేందుకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు పటిష్ఠ భద్రతా వ్యూహాన్ని రచించారు. సమ్మిట్ రక్షణ విధుల్లో 6 వేల మంది సివిల్, సాయుధ పోలీసులను నియమించారు. సమ్మిట్ ప్రాంతాన్ని 18 సెక్టార్లుగా విభజించి ఒక్కో సెక్టార్‌కు ఒక్కో ఐపీఎస్ ఆఫీసర్‌ను బాధ్యుడిగా నియమించారు. సమ్మిట్ రక్షణ విధుల్లో ముగ్గురు అదనపు డీజీపీలు, ఐదుగురు ఐజీపీలతోపాటు 18 మంది ఐపీఎస్ అధికారులు పాల్గొంటున్నారు. అనుమతిలేని వ్యక్తులు రాకుండా, ఎలాంటి అలజడులు, ఆందోళనలు జరగకుండా అడుగడుగునా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సమ్మిట్ పరిసర ప్రాంతాల్లోని గుట్టలపై సాయుధ పోలీసులు బైనాక్యులర్ల ద్వారా పహారా కాయనున్నారు. 165 నైట్ విజన్ కెమెరాలు సహా మొత్తం 1000 కెమెరాలను కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. వీటికి తోడు నిరంతరం డ్రోన్లతో పహారా ఏర్పాటు చేశారు. పది డ్రోన్ బృందాలను కమాండ్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. దేశ విదేశాల నుంచి వచ్చే అతిథులను నిర్దేశించిన హోటళ్లకు తీసుకుని వెళ్లే వరకు ఎస్కార్టుగా ఏసీపీ ఆధ్వర్యంలో సాయుధ పోలీసులను నియమించారు. హెలికాప్టర్లలో వచ్చే అతిథులను హెలీప్యాడ్ నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలోని సమ్మిట్ ప్రాంతానికి ఎస్కార్టుగా సీనియర్ పోలీసు అధికారులు తీసుకుని వెళ్లనున్నారు. అగ్నిప్రమాదాల వంటి ఊహించని విపత్తులు సంభవిస్తే.. అతిథులను వాటి నుంచి కాపాడేందుకు కందుకూరు పోలీసు స్టేషన్‌ను సేఫ్ హౌస్‌గా మార్చారు. మాధవన్ ఆస్పత్రిని సేఫ్ హాస్పిటల్‌గా ఎంపిక చేసి అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లూ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించే ప్రధాన హాల్‌లో రెండు వేల మంది ఆహ్వానితులు ఆసీనులు కావడానికి ఏర్పాట్లు చేశారు. అందుకు తగిన విధంగా అక్కడ మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసినట్లు డీజీపీ శివధర్ రెడ్డి ఓ ప్రకటనలో వివరించారు. అలాగే.. సమ్మిట్‌కు దారితీసే 25 కిలోమీటర్ల మార్గంలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఒక డీసీపీ పర్యవేక్షణలో ఆరుగురు ఏసీపీలకు ఈ బాధ్యత అప్పగించారు. అపరిచితులు ప్రవేశించకుండా దక్షిణ, తూర్పు మార్గాల్లో 7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టారు. హెలీప్యాడ్, ప్రధాన సదస్సు జరిగే ప్రాంతం చుట్టూ అనుక్షణం సాయుధులైన ఫుట్ పెట్రోలింగ్ టీమ్స్ తిరుగుతుంటాయి. వీవీఐపీ పార్కింగ్‌ను వెయ్యి కార్లు నిలిపేలా సిద్ధం చేశారు. మరో మూడు చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ జోన్లలో 6వేల వాహనాలు నిలపడానికి ఏర్పాట్లు చేశారు. టీజీఐఐసీకి సంబంధించిన స్థలంలో మరో 2వేల అదనపు వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. డీసీపీ స్థాయి అధికారి ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. సమీప గ్రామాల నుంచి ఆందోళనలకు ఎవరు రాకుండా చూడటానికి నాలుగు ప్రత్యేక టీమ్స్‌ను రంగంలో దించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముగ్గురు ఏసీపీలు, 50 మంది ఇతర అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు 3ప్లాటూన్ల ఆక్టోపస్ బలగాలను మోహరించారు. 3 ప్లాటూన్ల గ్రేహౌండ్స్‌ను రంగంలో దించారు. కమ్యూనికేషన్ నిమిత్తం అత్యాధునిక పరికరాలను వాడుతున్నారు. 150మంది పోలీసులు కమ్యూనికేషన్ విభాగంలో బాధ్యతలు నిర్వహించనున్నారు. బందోబస్తు విధుల్లో 25మంది డీసీపీ స్థాయి అధికారులు, 17 మంది ఎడీసీపీలు, 51 మంది ఏసీపీలు, 98మంది ఇన్‌స్పెక్టర్లు, 266 మంది ఎస్సైలను నియమించారు.

గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోతున్నా: సీఎంకు ఖర్గే లేఖ

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు తాను హాజరు కాలేకపోతున్నానని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు, ముందస్తుగా షెడ్యూల్ చేసిన కార్యక్రమాల వల్ల రాలేకపోతున్నట్లు పేర్కొంటూ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సీఎం రేవంత్‌కు ఖర్గే శుభాకాంక్షలు తెలిపారు.



స్టేడియం వద్ద ఏర్పాట్లను డిప్యూటీ సీఎంకు వివరిస్తున్న సీపీ సుధీర్‌బాబు

'మెస్సీ ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్'

ఉప్పల్‌లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

హైదరాబాద్ /హైదరాబాద్ సిటీ/ ఉప్పల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 13న జరగనున్న ఫ్రెండ్లీ ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లను ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, అడిషినల్ డీజీ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ మ్యాచ్‌లో ప్రపంచ దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ సారథ్యంలోని జట్టు, సీఎం రేవంత్‌రెడ్డి జట్టుతో తలపడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మ్యాచ్‌కు అంతర్జాతీయస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజలందరూ మ్యాచ్ సమయానికి ముందుగానే స్టేడియంకు చేరుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడేందుకు మెస్సీ రాష్ట్రానికి రావడం ఎంతో కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెడుతుందన్నారు. మెస్సీ రాక తెలంగాణ రైజింగ్ ఉత్సవాలకు మరింత ఊపునిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్టేడియం వద్ద భద్రతా ఏర్పాట్లను రాచకొండ సీపీ సుధీర్‌బాబు మంత్రులకు వివరించారు. దేశం నలుమూలల నుంచి భారీగా అభిమానులు వచ్చే అవకాశం ఉన్నందునా.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు.

డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ!

- హైదరాబాద్‌లో ఓ రోడ్డుకు పేరు పెట్టాలని ప్రతిపాదన
- అమెరికా రాయబార కార్యాలయానికి సర్కారు లేఖ?

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కీలక రహదారులకు ప్రముఖ కంపెనీలు, వ్యక్తులు, కార్పొరేట్ల పేర్లను కేటాయించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఒక రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును పెట్టాలని భావిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఉన్న హై-ప్రొఫైల్ రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' పేరును ఖరారు చేసే అవకాశం ఉంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విదేశాంగ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి లేఖ రాయనుంది. ఇక నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద రావిర్యాల నుంచి ప్రతిపాదిత రేడియల్ రింగ్ రోడ్డును కలుపుతున్న గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు దివంగత రతన్ టాటా పేరును ఖరారు చేసింది. ఇప్పటికే రావిర్యాల ఇంటర్‌చేంజ్‌ను 'టాటా ఇంటర్‌చేంజ్'గా నామకరణం చేసింది. వీటితో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిర్మాణంలో ఉన్న గూగుల్ క్యాంపస్‌కు సమీపంలోని రహదారికి 'గూగుల్ స్ట్రీట్'గా నామకరణం చేయనున్నారు. వీటితో పాటు మైక్రోసాఫ్ట్, విప్రో జంక్షన్ పేర్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కాగా, రహదారులకు ప్రముఖ టెక్ కంపెనీలు, ఇతర ప్రముఖుల పేర్లు పెడతామన్న రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని ప్రతిపాదించడం విస్మయపరుస్తోంది. ట్రంప్ ఇటీవల భారత్‌పై భారీగా సుంకాలు వేయడంతో పాటు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్‌లోని రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించడం గమనార్హం.

వంచక పాలనపై యుద్ధం

కమీషన్ల కాంగ్రెస్‌ను గద్దె దించే వరకు విశ్రమించం.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

- హామీలపై ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాలి: కిషన్ రెడ్డి
- ధర్నాచౌక్‌లో బీజేపీ మహాధర్నా



ధర్నాచౌక్ వద్ద 'బీజేపీ మహాధర్నా'లో కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు, లక్ష్మణ్, డీకే అరుణ తదితరులు

హైదరాబాద్/కవాడిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ 'వంచక పాలన' సాగిస్తోందని, దానిపై మహా ధర్మయుద్ధం చేపడతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. కాంట్రాక్టులు, కమీషన్లకే పరిమితమైన కాంగ్రెస్‌ను గద్దె దించేవరకూ విశ్రమించబోమని చెప్పారు. 'బీఆర్ఎస్ హయాంలో సీఎం అండ్ సన్స్ పాలన ఉండగా, ఇప్పుడు సీఎం అండ్ బ్రదర్స్ పాలన వచ్చింది. వాళ్ల ఖజానా నిండుతోంది తప్ప సామాన్యుడికి మిగిలేది శూన్యమే'నని విమర్శించారు. 'గల్లంతైన గ్యారంటీలు.. నెరవేరని వాగ్దానాలు.. ప్రజా వంచనకు రెండేళ్లు' నినాదంతో ఆదివారం ధర్నాచౌక్‌లో బీజేపీ మహాధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా రాంచందర్‌రావు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి కాంగ్రెస్ పాలనపై చార్జిషీట్ విడుదల చేశారు. కాంగ్రెస్ మత రాజకీయాలు చేస్తోందని, హిందూ దేవుళ్లను అవమానిస్తోందని ఆయన మండిపడ్డారు. హిందువులకు మూడు కోట్ల మంది దేవుళ్లు ఉన్నారని, కాంగ్రెస్ నాయకులకు మాత్రం ముగ్గురే దేవుళ్లని (సోనియా, రాహుల్, ప్రియాంక) ఎద్దేవా చేశారు. 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచింది కాంగ్రెస్ కాదు.. మజ్లిస్ పార్టీ! అందుకే 'రేవంతుద్దీన్' (సీఎం రేవంత్), హిందూ దేవుళ్లను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశ ద్రోహులను, అర్బన్ నక్సలైట్లను పెంచిపోషిస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే అర్బన్ నక్సలైట్లను అంతం చేస్తుందని సంచలన ప్రకటన చేశారు. కేంద్రం తెలంగాణకు ఏమిచ్చిందంటూ కాంగ్రెస్ నాయకులు పదే పదే విమర్శించడంపై మండిపడ్డారు. 'గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే రాష్ట్ర ప్రజలు వారిని ఇంటికి పంపించారు. ఇప్పుడు మీకూ అదే గతి పడుతుంద'ని స్పష్టం చేశారు. 'మీ కుర్చీ కూడా తొందర్లోనే కదిలేట్టు ఉంది.. మీ మంత్రులే కుర్చీ కాళ్లను లాగుతున్నారు. ఏదో ఒక రోజు అది విరిగి మీరు కిందపడిపోతారు జాగ్రత్త' అని రాంచందర్‌రావు సీఎం రేవంత్‌కు పరోక్ష హెచ్చరిక చేశారు. రాష్ట్రంలో మద్యం అమ్మకపోతే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేని దుస్థితి నెలకొందని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగినట్లే మద్యం, భూములు అమ్మకపోతే పూట గడవని పరిస్థితి కాంగ్రెస్ పాలనలో కూడా కొనసాగుతోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే బెల్ట్ షాపులు లేకుండా చేస్తామని మ్యానిఫెస్టోలో చేసిన ప్రకటన ఏమైందని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' పేరుతో గ్లోబల్ సమ్మిట్ అనే కొత్త నాటకం మొదలుపెట్టిందని ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్ విమర్శించారు. నిజం ఏమిటంటే.. తెలంగాణ 'రైజింగ్ ఇన్ కరప్షన్, గన్ కల్చర్' అని వ్యాఖ్యానించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలకు రేవంత్ రెడ్డి పైసా అయినా ఇచ్చారా అని ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ నేతలకు విజయోత్సవాలు జరుపుకునే అర్హత లేదన్నారు. హిల్ట్ భూములపై అవినీతిని రుజువు చేయకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయసన్యాసం చేస్తానని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి వెనక చెడ్డీ గ్యాంగ్ ఉందని, ఎక్కడ భూమి ఉంటే అక్కడ ఆ గ్యాంగ్ వాలిపోతుందన్నారు. రేవంత్ రెడ్డి 'రాబందు రెడ్డి'గా మారిపోయారన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ కంపెనీ మూతపడుతుందని, తెలంగాణలో ఐకమత్యమే బీజేపీకి అధికారం తెస్తుందని బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు అన్నారు. తన ప్రోటోకాల్ ఏంటో తనకే తెలియదంటూ పార్టీ తీరుపై పార్టీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు కొంచెం ముందుగా మాట్లాడే అవకాశం ఇచ్చి ఉంటే బాగుండేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు విద్యార్థినులకు స్కూటీ, మహిళలకు ప్రతి నెలా రూ.2,500, కల్యాణ లక్ష్మిలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీలను అమలు చేయాలంటూ బీజేపీ నాయకులు ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో చెట్టుకు స్కూటీ, డమ్మీ నోట్లు, బంగారం నాణాల నమూనాలను చెట్టుకు వేలాడదీసి నిరసన వ్యక్తం చేశారు.

గ్లోబల్ సమ్మిట్‌ను స్వాగతిస్తున్నాం

వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌ను స్వాగతిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి హాజరవుతారన్నారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని, తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే: కిషన్ రెడ్డి

రామగిరి: పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో నాడు కేసీఆర్ పద్ధతినే నేడు కాంగ్రెస్ కూడా అవలంబిస్తోందని విమర్శించారు. సన్న బియ్యంలో కేంద్ర ప్రభుత్వం రూ.43 ఖర్చు భరిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.15మాత్రమే భరిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కూడా ఒక్కో ఇంటికి కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు ఇస్తోందని చెప్పారు. పథకాలను కాకుండా భూ దందాలు, లిక్కర్ మాఫియాను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతమైందన్నారు.

కిషన్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదు

- రాష్ట్రాభివృద్ధికి ఆయన చేసిందేం లేదు: మహేశ్‌గౌడ్

నిజామాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదని.. రాష్ట్రాభివృద్ధికి ఆయన చేసిందేంలేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. కేంద్రం నుంచి వచ్చే ప్రాజెక్టులను సైతం ఆయన అడ్డుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంవల్ల రాష్ట్రం రూ.8లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయి ఉంటే.. కాంగ్రెస్ సర్కారు వాటికి వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ఆదివారం నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని.. అందుకు నిదర్శనమే జూబ్లీహిల్స్ ఫలితమని వ్యాఖ్యానించారు. అక్కడ బీజేపీకి డిపాజిట్ రాలేదన్నారు. ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని.. బీజేపీ, బీఆర్ఎస్‌లకు చోటు లేదని జూబ్లీహిల్స్ ఫలితంతో తేటతెల్లమైందన్నారు. గత రెండేళ్లుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎలాంటి సహకారంలేదని చెప్పారు. మెట్రో, మూసీ పునరుద్ధరణకు నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. బీజేపీకి మహాధర్నా చేసే అర్హత లేదన్నారు. గ్లోబల్ సమ్మిట్‌తో ప్రపంచ దేశాలు, దేశంలోని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూసేలా చేస్తున్నామని చెప్పారు.

కిషన్‌రెడ్డీ.. దొంగ లెక్కలు వద్దు : చామల

హైదరాబాద్/పర్వతగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి తెలంగాణకు రూ.13 లక్షల కోట్ల నిధులు వచ్చాయంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఏ శాఖకు ఆ నిధులు తెచ్చారో చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. దొంగ లెక్కలు చెప్పడం కాదని.. తెలంగాణకు రూ.13 లక్షల కోట్లు వస్తే రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకైందని ప్రశ్నించారు. తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుంటుంటే.. రాష్ట్రం అప్పుల పాలవుతుంటే.. కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలను ఉపయోగించి రాష్ట్రాన్ని రక్షించే ప్రయత్నం కిషన్‌రెడ్డి ఎందుకు చేయలేదని ఆదివారం ఓ ప్రకటనలో నిలదీశారు. బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలుచేస్తున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి మంచి జరుగుతుంటే బీజేపీ నేతలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. గ్లోబల్ సమ్మిట్‌కు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు హాజరై ప్రతినిధులకు భరోసా కల్పించాలని సూచించారు. దేశవ్యాప్తంగా విమాన ప్రయాణికుల ఇబ్బందులకు ఇండిగో యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని.. ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'హరీశ్ రావు.. సీఎం రేవంత్‌రెడ్డిని రంగనాయకసాగర్‌లో వేస్తానంటున్నావు. తెలంగాణ ప్రజలు రెండేళ్ల కిందటే నిన్ను, నీ మామను, నీ బావమరిదిని కాళేశ్వరంలో వేశారు. మీరెప్పుడో కూలిన కాళేశ్వరంలో మునిగిపోయారు. మీ పార్టీ కూడా అందులో సమాధి అయిపోయింది' అంటూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధ్వజమెత్తారు. మేడిగడ్డకు పగుళ్లు రాలేదని హరీశ్ ఆయన పిల్లలపై ఒట్టేసి చెప్పగలరా అని నిలదీశారు. రంగనాయకసాగర్ నీళ్లు కాళేశ్వరం నుంచి ఎత్తిపోసినవేనని నిరూపించగలరా అని సవాల్ విసిరారు. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పత్తా లేకుండా పోయిందని, అనేక గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే పోటీ నడుస్తోందన్నారు. కాగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

రసాభాసగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రచారం..

వర్ధన్నపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పర్వతగిరి మండలంలో చేపట్టిన ఎన్నికల ప్రచారం రసాభాసగా సాగింది. దౌలత్‌నగర్ గ్రామంలో ప్రచార వాహనంపైకి ఎమ్మెల్యే రాగానే.. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ఐలపాక స్వప్న, రెబల్ అభ్యర్థి ఐలపాక మల్లికాంబ ఇద్దరూ వాహనం ఎక్కడంతో వాగ్వాదం మొదలైంది. తాను పార్టీ అభ్యర్థిని అంటే.. తానేనంటూ ఎమ్మెల్యే ముందు వారు వాగ్వాదానికి దిగారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసి మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

డ్రోన్.. పహరా



సమ్మిట్ వద్ద నిఘా కోసం తీసుకొచ్చిన వందలాది డ్రోన్లు

అడుగడుగునా.. తెలంగాణ స్టాళ్లు



సమ్మిట్‌లో వివిధ శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాళ్లు

ప్రగతి చిత్రాలతో డిజిటల్ టన్నెల్



సమ్మిట్‌కు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్ర్కీన్లు

దావోస్ తరహాలో..

దద్దరిల్లేలా!

TELANGANA RISING 2047



పచ్చదనంతో కళకళలాడుతున్న గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సదస్సుకు 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవ్యాప్తంగా పేరున్న కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్నాయి. ఒక్క అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు తరలివస్తున్నారు.

ప్రారంభించనున్న గవర్నర్

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు లాంఛనంగా సమ్మిట్‌ను ప్రారంభిస్తారు. సుమారు 2వేల మంది దేశ విదేశీ అతిథులు ప్రారంభ వేడుకకు హాజరవుతున్నారు. ఇందులో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా-టెక్నాలజీ గ్రూప్ సీఈవో ఎరిక్ స్నైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ సహకారం, విజన్2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహూతులకు వివరిస్తారు. రెండు రోజుల్లో మొత్తం 27అంశాలపై సెషన్లు జరుగుతాయి.

సుందరంగా ముస్తాబు

గ్లోబల్ సమ్మిట్ వేదికను అత్యంత ఆకర్షణీయంగా, ఇతర ప్రాంగణాలను అన్ని వసతులతో ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు. ప్రాంగణం బయట ప్రాంతమంతా పచ్చదనంతో కళకళలాడుతోంది. ప్రాంగణం మధ్య భాగంలో రకరకాల పూలమొక్కలు, అలంకరణ మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. ఈ సమ్మిట్ ప్రాంగణం ఎక్కడి నుంచి చూసినా విద్యుత్ కాంతుల మధ్య దేదీప్యమానంగా వెలిగిపోతోంది. సమ్మిట్‌కు వచ్చే అన్ని ప్రధాన రహదారుల వెంట స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఇందులో చాలా వరకు డిజిటల్ తెరలే ఉన్నాయి. దాదాపు సమ్మిట్ జరిగే ప్రాంతాన్నంతా డిజిటల్ మయంగా మార్చేశారు. సమ్మిట్ జరిగే ప్రాంగణంతోపాటు బయట భారీ డిజిటల్ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. మూడు వైపులా డిజిటల్ తెరల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రగతి చిత్రాలు ప్రదర్శిస్తూ.. డిజిటల్ టన్నెల్‌ను ఏర్పాటు చేశారు.



సదస్సు ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు..

సమ్మిట్ ప్రధాన ప్రాంగణంలో తెల్లంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రాంగణం మధ్యలో త్రీడీలో తెలంగాణ తల్లి చిత్రం కనిపించేలా డిజిటల్ తెర ఏర్పాటు చేశారు. సమ్మిట్‌లో ఆహూతులను ఆకర్షించేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు చేస్తున్నారు, వీటికి సంబంధించిన రిహార్సల్స్ ఆదివారం రాత్రి జరిగాయి. అతిథులకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన రోబోలతో కూడా రిహార్సల్ నిర్వహించారు. అతిథులను ఆకర్షించేందుకు రికార్డు స్థాయిలో 3వేల డ్రోన్లతో డ్రోన్‌షో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లు ఆకట్టుకుంటున్నాయి. గ్రీనరీతో ఏర్పాటు చేసిన నెట్ జీరో కేంద్రం అందరినీ ఆకర్షిస్తోంది. ఇందిరా మహిళాశక్తి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ పర్యాటక శాఖ తదితర శాఖలకు చెందిన స్టాళ్లు అలరిస్తున్నాయి. ఇక సమ్మిట్‌కు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. దాదాపు 10 వేల మందితో మూడంచెల భద్రత కల్పిస్తోంది. ఆదివారం సాయంత్రం పోలీసు బలగాలు సమ్మిట్ ప్రాంగణాన్ని అధీనంలోకి తీసుకున్నాయి. బ్లాక్ క్యాట్ కమాండోలు, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ బలగాలు సమ్మిట్ లోపల, బయట పహారా కాస్తున్నాయి. డాగ్ స్క్వాడ్ బృందాలు అణువణువునా తనిఖీలు చేస్తున్నాయి. పోలీసులు ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు.

విమానాశ్రయం నుంచే ప్రచారం..

సమ్మిట్‌కు హాజరయ్యే దేశ విదేశీ పారిశ్రామికవేత్తలకు హైదరాబాద్ తోపాటు తెలంగాణ ప్రత్యేకతలు తెలిసేలా, పెట్టుబడుల అవకాశాలు వివరించేలా ప్రచార సామగ్రిని సిద్ధం చేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్ లో ఎల్ఈడీ స్ర్కీన్లతో ఈ విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సోమవారం మధ్యాహ్నం చర్చల తర్వాత ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డోలు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది.



డిజిటల్ టీవీలు, ఆధునిక హంగులతో గ్లోబల్ సమ్మిట్ ప్రధాన వేదిక

అతిథులందరికీ బహుమతులు..

నాగార్జునసాగర్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇక అతిథులకు తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లతో కూడిన బహుమతిని ప్రభుత్వం తరఫున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగోతోపాటు పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్‌లో పొందుపరుస్తారు.

తరలిరానున్న సినీ క్రీడా ప్రముఖులు..

గ్లోబల్ సమ్మిట్‌లో రెండు రోజులపాటు మొత్తం 27 ప్రత్యేక ప్యానల్ చర్చలు జరుగుతాయి. విద్యుత్తు, కాలుష్య రహిత రవాణా (గ్రీన్ మొబిలిటీ), ఐటీ, సెమీ కండక్టర్లు, విద్య, ఆరోగ్యం, పర్యాటకం, పట్టణ మౌలిక వసతుల కల్పన, వ్యవసాయం, పరిశ్రమలు, మహిళా వ్యాపారవేత్తల ప్రోత్సాహం, గిగ్ ఎకానమీ, సామాజిక సంక్షేమం, స్టార్టప్‌లు వంటి విభిన్న రంగాలపై చర్చలు ఉంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యూనిసెఫ్ ప్రతినిధులతో అనేక అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ పారిశ్రామికవేత్తలు పాల్గొంటున్నారు. పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా వంటి క్రీడా ప్రముఖులు 'ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్' సెషన్‌లో పాల్గొంటారు. ఆస్కార్ విజేత గుణీత్ మోంగా, ప్రముఖ సినీ దర్శకులు రాజమౌళి, సుకుమార్, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్ ముఖ్, సినీ విమర్శకురాలు అనుపమా చోప్రా వంటి వారు చర్చల్లో పాల్గొంటారు. దావోస్‌లో ప్రతి ఏటా జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు తరహాలో ఈ సదస్సు జరగాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను నిరంతరం స్వయంగా సమీక్షిస్తున్నారు.



కోయ డోలా ఆకృతిలో నిలబడి ఫొటో తీసుకుంటున్న యువతి

3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా..

పెట్టుబడుల ప్రణాళిక రూపకల్పన

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ పెట్టుబడుల ప్రణాళికను రూపొందించింది. మొత్తం అవసరమైన మూలధనంలో 80 శాతం ప్రైవేట్ రంగం, 20 శాతం ప్రభుత్వం సమకూర్చేలా ప్రణాళికను రూపొందించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), సావరిన్ వెల్త్ ఫండ్ల ద్వారా 40 శాతం పెట్టుబడులను తెచ్చుకోవాలని, మున్సిపల్ బాండ్ల ద్వారా పట్టణ సంస్థలు మరో 15 శాతం సమీకరించాలని ప్రణాళికలో పేర్కొంది. దేశీయ ఆర్థిక విధానం ద్వారా బ్యాంకుల నుంచి 30 శాతం, ఈక్విటీ-ఇన్నోవేషన్ ఫైనాన్స్, పీపీపీ మోడళ్ల ద్వారా మిగిలిన 15 శాతం మూలధనాన్ని పొందేలా వ్యూహం రూపొందించారు. అలాగే.. సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థను పూర్తిగా ఆటోమేట్ చేసి, ఏఐ ఆధారిత అనుమతులు, గ్రీన్ చానల్ పెట్టుబడులు, కంప్లయన్స్ ఆడిట్‌లను ప్రవేశపెడతామని ప్రభుత్వం చెబుతోంది. 2047 నాటికి ప్రతి ఇంటికీ కనీసం 1 జీబీ వేగంతో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ కల్పించి, డిజిటల్ యాక్సెస్‌ను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ప్రభుత్వం సంకల్పించింది. టెలిమెడిసిన్, స్మార్ట్ వ్యవసాయం, ఆన్‌లైన్ విద్య, ఐవోటీ సేవలు గ్రామీణ ప్రాంతాలకూ అందేలా "లాస్ట్ మైల్ రివల్యూషన్"కు పునాది వేస్తామని విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొంది.



సమ్మిట్ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

అతిథులకు ఇబ్బంది కలగొద్దు

మంత్రులు పొంగులేటి, పొన్నం

హైదరాబాద్/రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్‌కు దిశానిర్దేశం చేయనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2047 కోసం అత్యంత ఆకర్షణీయమైన వేదికను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట - బేగరికంచలోని భారత్ ఫ్యూచర్ సిటీలో సోమ, మంగళవారాల్లో నిర్వహించే సమ్మిట్ ఏర్పాట్లను వారు ఆదివారం పరిశీలించారు. ప్రాంగణమంతా కలియతిరిగి అతిథుల కోసం ఏర్పాటుచేసిన సౌకర్యాలను దాదాపు రెండు గంటలపాటు పరిశీలించారు. సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. ఆ సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ ఖ్యాతి ఖండాంతరాలు దాటడం ఖాయమని అన్నారు. సమ్మిట్ ఏర్పాట్లను మధ్యాహ్నం వరకు పరిశీలించిన మంత్రి పొంగులేటి... రాత్రి 8గంటలకు తిరిగి సమ్మిట్ ప్రాంగణానికి చేరుకున్నారు. రాత్రి అక్కడే బసచేశారు.

నిన్నటిదాకా ఒక లెక్క.. నేటి నుంచి మరో లెక్క

భారత్ ఫ్యూచర్ సిటీ.. రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క

ప్రజా పాలన విజయోత్సవ శుభాకాంక్షలు: సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీ.. రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిన్నటి వరకు ఒక లెక్క.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క అన్నట్లుగా రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టబోతోందని తెలిపారు. తన గొంతులో ఊపిరి, రాష్ట్ర ప్రజల తోడు ఉన్నంతవరకు తెలంగాణ రైజింగ్‌కు తిరుగుండదని పేర్కొన్నారు. నిన్న, నేడు, రేపు.. తెలంగాణ ప్రజల ఆశీర్వాదమే తన ఆయుధమని, వారి ప్రేమాభిమానాలే తనకు సర్వం, సహకారమే సమస్తమని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా పాలనకు రెండేళ్లు నిండిన సందర్భంగా ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రజలకు ముఖ్యమంత్రి విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. "సరిగ్గా రెండేళ్ల కిందట నాకు ఆ ధైర్యాన్నిచ్చి.. ఓటుతో గెలుపు సంకల్పాన్నిచ్చి.. నిండు మనసుతో ఆశీర్వదించిన తెలంగాణ నాలుగు కోట్ల మంది ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను. ఈ రెండేళ్ల ప్రస్థానంలో అనునిత్యం అహర్నిశలూ అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు తపనతో శ్రమించాను. గత పాలన శిథిలాల కింద కొన ఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశాం. రుణభారంతో వెన్ను విరిగిన రైతుకు దన్నుగా నిలిచి దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపాం. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్దతునిచ్చి అదానీ, అంబానీల లెక్క వ్యాపార రంగంలో నిలిపాం. బలహీన వర్గాల వందేళ్ల ఆకాంక్షలను కుల లెక్కలతో కొత్త మలుపులు తిప్పాం. వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి నిజమైన సార్థకత చేకూర్చాం" అని సీఎం రేవంత్ వివరించారు.





భవిష్యత్తులో ఫ్యూచర్ సిటీ ఇలా ఉంటుందంటూ ప్రదర్శిస్తున్న ప్రతీకాత్మక చిత్రం

దేశానికి గ్రోత్ ఇంజన్‌గా తెలంగాణ..

చదువొక్కటే బతుకుదెరువుకు బ్రహ్మాస్త్రమని నమ్మి.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ యజ్ఞానికి పునాదులు వేశామని సీఎం తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టామని, "స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం మూల సిద్ధాంతంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. "జయ జయహే తెలంగాణ అన్న ప్రజాకవి అందెశ్రీ గేయానికి.. జన ఆకాంక్షల మేరకు అధికారిక గుర్తింపు ఇచ్చాం. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, రూ.500కే గ్యాస్, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే గొప్ప పథకాలన్నీ ఈ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలు. ప్రస్తుత అవసరాలను తీర్చి, పేదలకు సంక్షేమాన్ని కూర్చి.. ఇదే అద్భుతమని మేం సరిపెట్టలేదు. స్వతంత్ర భారత ప్రయాణం వందేళ్ల మైలురాయికి చేరే సందర్భంలో 2047 నాటికి మన తెలంగాణ ఎట్లుండాలి, ఎక్కడ ఉండాలనే దానిపై లోతైన మథనంతో మార్గదర్శక పత్రం సిద్ధం చేశాం. గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు మేం ప్రాణం పోశాం. ప్రపంచ వేదికపై తెలంగాణ రైజింగ్ రీసౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. భారతదేశ గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణను మార్చడానికి సర్వం సిద్ధం చేశాం"అని వివరించారు.

అతిథులకు తెలంగాణ చిరుతిళ్లు

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆదివారం): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి వస్తున్న అతిథుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వారికి స్వాగతం పలికేందుకు 100 మంది డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులతో ఒక బృందాన్ని నియమించింది. ఆదివారం వచ్చిన అతిథులకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పర్యాటక శాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఉదయం నేపాల్, బ్యాంకాక్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులకు తెలంగాణ సంప్రదాయంలో నుదుటన బొట్టు పెట్టి పూలమాల వేసి ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మేళతాళాలు, కూచిపూడి, కథక్ నృత్య కళాకారుల ప్రదర్శన, మంగళవాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలుకుతూ ప్రత్యేక వాహనాల వద్దకు తోడ్కొని వచ్చారు. అక్కడి నుంచి బస ఏర్పాటు చేసిన హోటళ్లకు తీసుకెళ్లారు. కాగా, అతిథులకు తెలంగాణ చిరుతిళ్లతో కూడిన ప్రత్యేక డైట్ కిట్‌ను అందజేస్తున్నారు. ఇందులో సకినాలు, చెక్కగారెలు, నువ్వుల లడ్డూ, ఇప్పపువ్వు లడ్డూ, మక్క పేలాలు, బాదమ్‌కీ జాలి ఉన్నాయి. ఆదివారం వచ్చిన వారికి ఈ డైట్ కిట్‌ను అందజేశారు. సమ్మిట్ జరిగే సమయంలో హైదరాబాద్ ధమ్ బిర్యానీ, పాయా, మటన్ కర్రీతో పాటు వెజ్, నాన్‌వెజ్‌కు సంబంధించిన పలు వంటలను అందుబాటులో ఉంచనున్నారు. విదేశీ ప్రతినిధుల కోసం ఆయా దేశాలకు చెందిన వంటలనూ సిద్ధం చేయిస్తున్నారు.



అతిథుల కోసం ఏర్పాటు చేసిన భోజన స్టాళ్లు

సెల్‌ఫోన్ సిగ్నళ్లు.. వైఫై సౌకర్యం..

గ్లోబల్ సమ్మిట్‌లో సెల్‌ఫోన్ సిగ్నళ్లకు, అక్కడ ఏర్పాటు చేసిన హాళ్లలో వైఫైకి సమస్యలు రాకుండా ఉండేందుకు తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ సహా పలు ప్రముఖ సంస్థలతో సంప్రదింపులు జరిపి 2జీ సిగ్నళ్లు కూడా అందుబాటులో లేని ఫ్యూచర్ సిటీలో 5జీ సిగ్నళ్లను అందుబాటులోకి తెచ్చింది. ఒకేసారి 25వేల మంది వైఫై సేవలు వినియోగించుకునేందుకు వీలుగా సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. సైబర్ సెక్యూరిటీ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే పరిష్కరించేలా టీ-ఫైబర్ ఆధ్వర్యంలో 45మందితో టీమ్‌ను, పర్యవేక్షణకు కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సదస్సు ప్రాంగణంలో 10 జీబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్‌ను అందించనున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించండి

» జిల్లా కలెక్టర్లకు సర్కారు ఆదేశం

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా డిసెంబరు 9న ఉదయం 10 గంటలకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఆదివారం అన్ని జిల్లాల కలెక్టర్లకు (ములుగు, నారాయణపేట, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలు మినహా) ఉత్తర్వులు జారీ చేశారు.

రెండేళ్లైనా డిప్యూటీ స్పీకర్‌ను నియమించరా?

» స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌ను నియమించలేదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇది నిబంధనల ఉల్లంఘన, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయడమేనని ఆరోపించారు. స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గడ్డం ప్రసాద్‌కుమార్‌కు హరీశ్ రావు బహిరంగ లేఖలో శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ్యుల హక్కులను పరిరక్షించే ప్రివిలేజ్ కమిటీకి డిప్యూటీ స్పీకరే ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు కాబట్టి, ఆ పదవి ఖాళీగా ఉండటం వల్ల కమిటీ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. అసెంబ్లీ నిర్వహణలో తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని స్పీకర్‌ను హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు అవకాశం ఉన్న క్వశ్చన్ అవర్, జీరో అవర్‌లో నిబంధనలను పాటించడం లేదని, దీంతో సభలో జవాబుదారీతనం లోపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకపోవడం అత్యంత ఆందోళనకరమన్నారు. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించాలని, ప్రివిలేజ్ కమిటీని పునరుద్ధరించి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆ లేఖలో కోరారు. ఏడాదికి కనీసం 30 రోజులపాటు అసెంబ్లీని నిర్వహించాలని, ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ నిర్వహణను సరిదిద్దాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

9న 'విజయ్ దివస్'గా నిర్వహించాలి: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహారదీక్ష తర్వాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన డిసెంబర్ 9వ తేదీని 'విజయ్ దివస్'గా నిర్వహించాలని ఆదివారం పార్టీ ముఖ్య నేతలతో జరిగిన టెలి కాన్ఫరెన్స్‌లో శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం కేసీఆర్ త్యాగాన్ని గుర్తుచేస్తూ, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన చారిత్రక సందర్భాన్ని సంబరంగా జరుపుకోవాలన్నారు.

అర్థమైన వాళ్లకు అర్థమైనంత!

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు తన ఎక్స్ ఖాతాలో తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. పోస్ట్‌లో భాగంగా ఆయన తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సంప్రదాయ తెలంగాణ పంచెకట్టుతో, మెడలో గులాబీ కండువాతో ఓ పెద్ద కుర్చీలో కూర్చున్నట్లుగా ఏఐ ద్వారా సృష్టించిన ఫొటో పెట్టారు. ఈ ఫొటోకు కేటీఆర్ ఐవైకేవైకే(ఇఫ్ యూ నో.. యూ నో) అనే క్యాప్షన్ రాశారు. అర్థమైన వాళ్లకు అర్థమైనంత అని భావం వచ్చేలా రాశారు.

రేవంత్ పాలనలో 793 మంది రైతుల ఆత్మహత్య

» బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపణ

న్యూఢిల్లీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్ రెండేళ్ల పాలనలో 793 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. రాష్ట్రంలో సగటున ఒక్కో రైతుపై సుమారు రూ.లక్ష అప్పు ఉందన్నారు. ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో 'కాంగ్రెస్ రెండేళ్ల ప్రజా వంచన పాలన-వైఫల్యాల చిట్టా' పేరుతో 11 అంశాలతో కూడిన చార్జిషీట్‌ను అర్వింద్ విడుదల చేసి మాట్లాడారు. రెండేళ్లలో సీఎం, మంత్రివర్గం, వారి బంధువులు అందిన ప్రతిదాన్నీ దోచుకున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్ దందా జరుగుతోందన్నారు. 'కేసీఆర్, కేటీఆర్ అక్రమాల చిట్టా ఉందని చెబుతున్న సీఎం రేవంత్ వారిని జైలుకెందుకు పంపరు' అంటూ నిలదీశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తనకు అన్నలాంటి వారని, ఆయన సూచన మేరకే ఢిల్లీలో చార్జిషీట్ విడుదల చేస్తున్నానని అర్వింద్ తెలిపారు. తెలంగాణ బీజేపీ అంతా కలిసికట్టుగా ఉందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కేటీఆర్ పచ్చి అవకాశవాది: బీవీ రాఘవులు

మెదక్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌ది పచ్చి అవకాశవాదమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మండిపడ్డారు. పదేళ్ల కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ పట్టించుకోని ఆయన.. ఇటీవల ఓ సదస్సులో ఆ చట్టాలకు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో లేబర్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్‌ను డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా లేబర్ కోడ్ యాక్ట్‌ను విమర్శిస్తున్నందున సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపాలని సూచించారు. మెదక్‌లో ఆదివారం ప్రారంభమైన సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభల్లో బీవీ రాఘవులు ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ.. కేటీఆర్ ఇప్పటికైనా చెంపలేసుకుని, ప్రజలను మోసం చేయబోనని క్షమాపణలు చెప్పి కార్మిక ఉద్యమంలోకి రావాలన్నారు.

ఆస్తులు పెంచుకున్నారే తప్ప అభివృద్ధి సున్నా

» మల్లారెడ్డిపై కవిత తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్/బిట్స్‌పిలానీ/కీసర రూరల్, డిసెంబర్ 7, (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్న మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి.. అక్రమ ఆస్తులు పెంచుకున్నారే తప్ప, చేసిన అభివృద్ధి శూన్యమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని డంపింగ్ యార్డును సందర్శించిన తర్వాత స్థానిక డ్వాక్రా మహిళలతో బస్తీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డంపింగ్ సమస్యపై కొంత మేర కృషి చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కాగా, పంచాయతీ ఎన్నికల పోలింగ్ రోజే అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) రాతపరీక్ష నిర్వహించడం తగదన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఈనెల 14న తలపెట్టిన ఏపీపీ రాత పరీక్ష వాయిదా వేసేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

ఒహోహ్హో మాకె విందు..

(మొదటిపేజీ తరువాయి)



కర్రీలు, మన దక్షిణాది వంటకాలు!! అమెరికన్లు సాధారణంగా మసాలాలు తక్కువ ఉండే వంటకాలను ఇష్టపడతారు. విదేశీ వంటకాల్లో.. థాయ్ ఆహారానికి అమెరికన్లలో ఆదరణ ఎక్కువ. వియత్నాం, జపాన్ తదితర దేశాలు ఆ తర్వాత స్థానాలను ఆక్రమిస్తుంటాయి. మొన్నటిదాకా భారతీయ రెస్టారెంట్లకొచ్చినా.. చికెన్ టిక్కా మసాలా, బటర్ చికెన్, నాన్లు వంటివే ఎక్కువగా తినేవారు. రానురానూ ట్రెండ్ మార్చి.. ఇప్పుడు స్పైసీగా ఉండే దక్షిణాది ఆహారాన్నీ ఇష్టంగా తింటున్నారు. ఎప్పుడూ వారు వెళ్లే టాకోబెల్, సబ్‌వే, మెక్‌డొనాల్డ్స్ వంటివాటితో పోల్చితే ఇండియన్ రెస్టారెంట్లలో ధరలు ఎక్కువైనా. వాటికే వెళ్తున్నారు.

పెరుగుతున్న మన రెస్టారెంట్ల సంఖ్య..

అమెరికాలో చైనీస్, ఫిలిప్పీన్స్‌వాసుల తర్వాత ఎక్కువ సంఖ్యలో ఉన్న ఆసియన్లు భారతీయులే. కానీ, జనాభా పరంగా చూస్తే భారతీయ రెస్టారెంట్ల సంఖ్య ఇప్పటి వరకూ చాలా తక్కువే. ఇప్పుడు అమెరికన్లు కూడా మన వంటకాలను ఇష్టంగా అడిగి తింటుండడంతో.. తెలుగు ప్రవాసులు యూఎస్ నగరాల్లో రెస్టారెంట్లను విరివిగా ప్రారంభిస్తున్నారు. 2025 అక్టోబర్ గణాంకాల ప్రకారం అమెరికాలో దాదాపుగా పదివేల (9438) భారతీయ రెస్టారెంట్లు ఉంటే, వాటిలో 2000 రెస్టారెంట్లు ఒక్క కాలిఫోర్నియాలోనే ఉన్నాయి! దాదాపు 1500 రెస్టారెంట్లతో టెక్సాస్.. 1000 రెస్టారెంట్లతో న్యూయార్క్ రాష్ట్రాలు తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా అమెరికాలోని ప్రధాన మెట్రో నగరాలైన న్యూయార్క్, లాస్‌ఏంజెలెస్, షికాగో, డాలస్, హ్యూస్టన్‌లలో భారతీయ రెస్టారెంట్‌ల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది. డాలస్ మెట్రో ఏరియా.. భారతీయ రుచులకు.. ప్రధానంగా దక్షిణ భారత రుచులందించే రెస్టారెంట్లకు హబ్‌గా మారింది. ఈ ప్రాంతంలో దాదాపు 400 ఇండియన్ రెస్టారెంట్లున్నాయి. అదనంగా నేపాలీ, పాకిస్థాన్, బంగ్లాదేశ్ రెస్టారెంట్లు ఉన్నా.. వాటికి ఇండియన్ రెస్టారెంట్ల పేర్లే ఉంటాయి.

'లెక్క' చేయట్లేదు!

అమెరికాలోని మనోళ్లు.. గతంలో వారాంతాల్లో అయినా సరే.. బయట తినాలంటే మీనమేషాలు లెక్కించేవారు. రెస్టారెంట్లలో ఆహారపదార్థాల ధరలను భారత్‌లోని ధరలతో పోల్చి చూసుకుని.. జిహ్వా చాపల్యాన్ని అదుపులో ఉంచుకునేవారు. దాదాపు ఓ దశాబ్దం క్రితం వరకూ పరిస్థితి ఇలాగే ఉండేది. ఆ తర్వాత నుంచి పరిస్థితి మారుతూ వచ్చింది. ఇప్పుడు.. బయట తినాలని అనిపించిందే తడవుగా కుటుంబసభ్యుల్ని, మిత్రుల్ని వెంటబెట్టుకుని రెస్టారెంట్లకు వెళ్తున్నారు. ఎన్నారైలలో యువతరం దామాషా పెరుగుతున్న కొద్దీ ఈ తేడా స్పష్టంగా తెలుస్తోంది. వారు ధరలను అస్సలు పట్టించుకోవట్లేదు. డాలస్‌లో 12 డాలర్లుండే చికెన్ బిర్యానీ, కాలిఫోర్నియాలో పాతిక డాలర్లు. సియాటెల్‌లో ఇంకా ఎక్కువ. యూఎస్‌లో ప్రతి ఊరిలోనూ బావార్చీ బిర్యానీ, బిర్యానీ బిస్ట్రో, బిర్యానీ పాట్, హైదరాబాద్ హౌస్, ప్యారడైజ్, స్వదేశీ తదితర పేర్లతో రెస్టారెంట్లు పుష్కలంగా కనిపిస్తాయి. వీటితోపాటు ఇండియాలో ఎంతో ప్రసిద్ధి పొందిన శరవణ భవన్, అడయార్ ఆనంద భవన్, బార్బిక్యూ నేషన్, పిస్తా హౌస్ మొదలైన గ్రూపులు అమెరికాలో కూడా ఫ్రాంచైజీ మోడల్‌లో రెస్టారెంట్లు నిర్వహిస్తున్నాయి.

దశాబ్దాల క్రితమే..

అమెరికాలో భారతీయ రెస్టారెంట్ల విప్లవం శ్రీకారం దిద్దుకోవడానికి కాలిఫోర్నియా బర్కిలీకి చెందిన లక్కిరెడ్డి బాల్ రెడ్డి ఆద్యుడని చెప్పాలి. దాదాపు 40-50 ఏళ్లక్రితమే ఆయన భారతీయ రెస్టారెంట్లను స్థాపించారు. కృష్ణా జిల్లా మైలవరం దగ్గర వెల్వడం గ్రామ వాసి లక్కిరెడ్డి, 1970ల్లో ప్రారంభించిన పసంద్ అనే ఇండియన్ రెస్టారెంటు 3 దశాబ్దాలు దక్షిణ భారత వంటకాలతో అలరించింది. అదే గ్రామవాసి, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం ప్రారంభించిన స్వాగత్ గ్రూపు రెస్టారెంట్లు 35 ఏళ్లుగా కాలిఫోర్నియాలోని సిలికాన్ వాలీ భోజన ప్రియులను తృప్తి పరుస్తున్నాయి. అమెరికాలోని రెస్టారెంట్ షెఫ్‌లు, ఓనర్లలో మైలవరం ప్రాంతం వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఖమ్మం జిల్లా మధిర చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలువురు షెఫ్‌లుగా పనిచేస్తున్నారు. ఎన్నారై శివ యార్లగడ్డ.. అమెరికా, కెనడా, యూరప్‌లలో నవాబీ హైదరాబాద్ హౌస్ పేరుతో దాదాపు 50 రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారు. 2024లో న్యూయార్క్ టైమ్స్ ఎంపిక చేసిన 'అమెరికాలోని 50 అత్యుత్తమ రెస్టారెంట్ల' జాబితాలో.. ఆయన సింప్లీ సౌత్ వెజిటేరియన్ రెస్టారెంట్ కూడా ఉంది. మాంక్స్ పేరుతో ఇండో చైనీస్ రెస్టారెంటు కూడా నిర్వహిస్తున్నారు. మరో ఎన్నారై కిషోర్ కంచర్ల ఆధ్వర్యంలో అమెరికాలో దాదాపు 50కి పైగా ప్రాంతాల్లో బావార్చి బిర్యానీ రెస్టారెంట్లు విజయవంతంగా నడుస్తున్నాయి. తొలుత వీరంతా అమెరికాలోని భారతీయుల కోసమే ప్రారంభించినా ఇండియన్ క్విజీన్‌లో ఉండే ఇంద్రజాలం.. అమెరికన్లనూ సమ్మోహితుల్ని చేయడం ఇటీవలే మొదలైంది. తెలుగు కన్సల్టెన్సీల వారు, గ్రాసరీ స్టోర్స్ యజమానులు, సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో ఉన్న నవతరం కూడా కాస్త నిలదొక్కుకోగానే.. నలుగురు కలిసి ఒక రెస్టారెంటు ప్రారంభిస్తున్నారు.

సాఫ్ట్‌వేర్‌ను తలదన్నే వేతనాలు!

ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే.. కొన్ని భారతీయ రెస్టారెంట్లలో షెఫ్‌లే ఎక్కువ సంపాదిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఉదాహరణకు.. పదేళ్ల క్రితం ఇక్కడ రెస్టారెంట్లలో క్లీనర్లుగా పనిచేయడానికి ఇండియా నుంచి వచ్చిన ఒక జంట.. చిన్న జీతాలకు కుదురుకుని క్రమంగా వంటలు వండడమూ ప్రారంభించారు. సీన్ కట్ చేస్తే.. ఇప్పుడు ఇద్దరికీ కలిపి నెలకు 12 వేల డాలర్ల వేతనం, ఉచిత నివాసం, ఇతర ఖర్చులు ఇచ్చి వంటలు వండించుకుంటున్నారు. అందరికీ అంత కాకున్నా.. సగటున షెఫ్‌ల జీతాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. ప్రత్యేకించి తెలుగురాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల నుంచి వచ్చినవారు షెఫ్‌లుగా పనిచేస్తూ భారీగా సంపాదిస్తున్నారు. కానీ, ఈ క్రమంలో కొన్ని విపరిణామాలు కూడా సంభవిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి చాలామంది లక్షలాది రూపాయలు దళారులకు కట్టి అమెరికాకు వచ్చి షెఫ్‌లుగా మారే ప్రయత్నం చేస్తున్నారు. ఆ ప్రయత్నంలో మోసపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. అదే సమయంలో.. అమెరికాకు చదువుకోవడానికి వచ్చిన తెలుగు విద్యార్థుల్లో కొందరు మనవాళ్లు పెట్టే రెస్టారెంట్లలో పనిచేస్తూ తమ తల్లిదండ్రుల మీద ఎక్కువగా ఆధారపడకుండా గడుపుతున్నారు.

షెఫ్‌ల జీతాలు పెంచేస్తూ నష్టాల్లోకి..

అమెరికాలో మనోళ్ల రెస్టారెంట్ల సంఖ్య పెరుగుతున్నా.. సక్సెస్ రేటు అనుకున్నంత లేదు. షెఫ్‌ల జీతాలు భరించలేని స్థాయిలో పెరిగిపోవడం దీనికి ప్రధాన కారణం. రెస్టారెంట్ల యజమానులు తమలో తాము పోటీ పడుతూ.. బాగా నడుస్తున్న రెస్టారెంట్‌లోని షెఫ్‌లకు భారీగా జీతాలు ఆఫర్ చేసి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఒక సాధారణ షెఫ్‌కు ఇల్లు, ఆహారం అన్నీ సమకూర్చి, జీతంగా చెల్లిస్తున్న కనీస మొత్తం 5 వేల డాలర్లు కాగా, కొంచెం సీనియర్ కర్రీ షెఫ్‌లకు ఆరు వేల నుంచి 10 వేల డాలర్ల దాకా ఇస్తున్నారు. చాలా రెస్టారెంట్ల యజమానుల కంటె షెఫ్‌ల పని బాగుందని చెప్పొచ్చు. ఇలా అమెరికాలో టాప్ గేర్‌లో వర్ధిల్లుతున్న ఇండియన్ రెస్టారెంట్ల వ్యాపారం గాలి బుడగలాగా పేలిపోకూడదంటే.. యజమానులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. పోటీలు పడి షెఫ్‌లకు స్థాయికి మించి వేతనాలు చెల్లించి, అంతిమంగా రెస్టారెంట్లు మూతపడే పరిస్థితి రాకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

ప్రభుత్వాలు వ్యాపార సంస్థలుగా మారాయి

» ఇండిగో మీద చర్యలు తీసుకోవడం లేదేం?

» విశ్రాంత న్యాయమూర్తి బి. సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపార సంస్థలుగా మారాయని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈస్ట్ ఇండియా కంపెనీని పారదోలడానికి పోరాటం సాగించిన ఈ నేల మీద సకల సౌకర్యాలు, వసతులు ఉచితంగా కల్పిస్తూ ఎర్ర తివాచీ పరిచి మరీ విదేశీ వ్యాపారులను ఆహ్వానిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొని ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడేందుకు కారణమైన ఇండిగో సంస్థ బాధ్యులపై మోదీ ప్రభుత్వం ఎందుకు తగిన చర్యలు తీసుకోలేకపోతోందని ప్రశ్నించారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్ రచనలు 'ఎక్కడికీ గమనం? ఎంత దూరమీ గమ్యం?', 'ఎవరిదీ ప్రజాస్వామ్యం? ఏ విలువలకీ ప్రస్థానం?' వ్యాస సంపుటాలు, 'గోడల వెనుక- జైలు జ్ఞాపకాలు' పుస్తకాలను ఆదివారం శివం రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు రాజ్యాంగ విలువల మీద కాకుండా దేవాలయ ధర్మధ్వజం మీద ఆధారపడడం శోచనీయమన్నారు. సామాజిక శాస్త్రవేత్త కల్పనా కన్నబిరాన్ మాట్లాడుతూ.. న్యాయవాదులు, న్యాయమూర్తులు రాజ్యాంగాన్ని మరిచిపోతున్నప్పుడు వారికి ఆ బాధ్యత గుర్తుచేయాల్సింది జన బాహుళ్యమేనన్నారు. సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. ఆలోచనల్లో స్పష్టత కలిగిన అరుదైన సాహిత్య సృజనకారుడు నిఖిలేశ్వర్ అని కొనియాడారు. ఎమెస్కో సంపాదకుడు చంద్రశేఖర్ రెడ్డి పుస్తకాలను పరిచయం చేశారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి, విశ్రాంత ఆచార్యుడు ముత్యంరెడ్డి ప్రస్తుత సామాజిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులపై మాట్లాడారు. నిఖిలేశ్వర్ సాహిత్య కృషిని కొనియాడారు.

బౌద్ధ వారసత్వ కేంద్రాల పునరుద్ధరణ పనులు భేష్

» సర్కారుపై బౌద్ధ దేశాల ప్రతినిధుల ప్రశంసలు

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బౌద్ధవారసత్వ కేంద్రాల పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వ కృషిని ఆసియాలోని బౌద్ధ దేశాల రాయబారులు ప్రశంసించారు. భవిష్యత్తులో సాంస్కృతిక, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి సహకరిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆసియాలోని బౌద్ధ దేశాలు, ఇతర దేశాల రాయబారులు, హైకమిషనర్లతో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేలకొండపల్లి, కోటిలింగాల వంటి బౌద్ధ కేంద్రాల ప్రాముఖ్యాన్ని రాయబారులకు వివరించారు. నాగార్జునసాగర్ వద్ద నిర్మాణంలో ఉన్న బుద్ధవనంలోని బౌద్ధ హెరిటేజ్ థీమ్ పార్కును ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'తెలంగాణ రైజింగ్-2047' గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. సమావేశంలో మలేషియా, నేపాల్, భూటాన్, థాయిలాండ్, శ్రీలంక, అంగోలా, కెనడా, సింగపూర్, రష్యా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్యాకేజీ ఫుడ్డుకే జై...

ఆన్‌లైన్‌లో ఇన్‌స్టంట్ ఆహారంపై యువత మోజు

» క్విక్ కామర్స్ ద్వారా నిత్యం కొనుగోళ్లు

» 277 జిల్లాల్లో లోకల్ సర్కిల్స్ సర్వే

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మనదేశంలో ప్రజల ఆహారపు అలవాట్లు వేగంగా మారిపోతున్నాయి. ఆధునిక టెక్నాలజీ, ఈ-కామర్స్ సంస్థల ప్రాబల్యం పెరుగుతుండటంతో ముఖ్యంగా జనరేషన్-జెడ్ (జెన్-జెడ్)గా పిలుస్తున్న యువత సొంత ఇంటి ఆహారం తినటమే దాదాపు మానేశారని సర్వేలు చెబుతున్నాయి. వీరు నిత్యం ఆన్‌లైన్‌లోనే ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. అది కూడా ప్యాకేజ్, అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్, అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు (హెచ్ఎఫ్ఎస్ఎస్) దట్టించిన ఆహార పదార్థాల వైపే వీరు మొగ్గు చూపుతున్నట్లు లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన తాజా సర్వేలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా 277 జిల్లాల్లో 24 వేల మంది ఈ సర్వేలో పాల్గొన్నారు. వీరిలో 63 శాతం మంది పురుషులు, 37 శాతం మంది మహిళలు ఉన్నారు. టైర్ -1 పట్టణాల నుంచి 48 శాతం, టైర్-2 పట్టణాల వారు 31 శాతం, మిగిలినవారు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు ఉన్నట్లు సర్వే సంస్థ పేర్కొంది. అమెజాన్ ఫ్రెష్, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్, బిగ్ బాస్కెట్, జియోమార్ట్, జెప్టో, బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్, మిల్క్ బాస్కెట్ వాటిలో యాప్‌ల ద్వారా హెచ్ఎఫ్ఎస్ఎస్ ఆహార పదార్థాలు ఎంత శాతం అమ్ముడవుతున్నాయనే విషయాన్ని లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వే చేసింది. ఈ కామర్స్ సంస్థలు తమ వెబ్‌సైట్లలో ఎక్కువగా హెచ్ఎఫ్ఎస్ఎస్, అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార పదార్థాలనే డిస్‌ప్లేలో పెడుతున్నాయి. ఒక సంస్థ 1,000 రకాల ఆహార ఉత్పత్తులను అమ్మకానికి ఉంచితే, అందులో 670 వరకు హెచ్ఎఫ్ఎస్ఎస్, అల్ట్రా ప్రాసెస్డ్ రకానివే ఉంటున్నట్లు సర్వేలో తేలింది. చాలా సంస్థల ఆహార పదార్థాల ఆన్‌లైన్ విక్రయాల్లో 50 శాతానికి పైగా ఈ రకానివే ఉంటున్నట్లు సర్వేల్లో వెల్లడైంది. తాము విక్రయించే ప్రతి రెండు ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో ఒకటి జంక్- హెచ్ఎఫ్ఎస్ఎస్- అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ ఉంటోందని ఒక సంస్థ తెలిపింది. ముఖ్యంగా బ్లింకిట్ తన ఆన్‌లైన్ ఆహార పదార్థాల డిస్‌ప్లేలో 62 శాతం, జెప్టో 58 శాతం, స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్‌లో 54 శాతం, జియోమార్ట్‌లో 50 శాతం, బిగ్ బాస్కెట్‌లో 49 శాతం, మిల్క్ బాస్కెట్‌లో 48 శాతం, అమెజాన్ ఫ్రెష్‌లో 44 శాతం, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో 42 శాతం అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు ఉంటున్నట్లు పేర్కొంది.

యువత చేతిలోనే ఫుడ్ ఆర్డర్స్ కీ!

చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ అందుబాటులో ఉండటంతో నాలుక తృప్తిపడే రుచులను క్షణాల్లో యువత ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసే కుటుంబాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. తమ ఇంట్లో యువతే ఈ కామర్స్ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ప్యాకేజ్డ్ ఫుడ్స్‌ను క్రమం తప్పకుండా ఆర్డర్ పెడుతున్నారని ఆన్‌లైన్‌లో ఆహారం కొనుగోలు చేసే కుటుంబాల్లో 39 శాతం మంది చెప్పినట్లు ఆ సర్వే వెల్లడించింది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ ఆన్‌లైన్ షాపింగ్ చేసే కుటుంబాల ఆహారపు కొనుగోలు అలవాట్లపై ఈ సర్వే సంస్థ దృష్టి సారించింది. కేవలం 10-20 నిమిషాల్లోనే ఇంటికి డెలివరీ చేసే క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ కారణంగా యువతకు చిరుతిండి, ప్రాసెస్డ్ ఫుడ్స్ కొనుగోలు చేయడంపై మరింత ఆసక్తి పెరిగినట్లు గుర్తించారు.



అనారోగ్య సమస్యలు తప్పవు

జెన్-జెడ్ ఇలాంటి ఆహారానికి అలవాటు పడటం భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత జబ్బుల వంటి జీవనశైలి వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఈ-కామర్స్ సంస్థల ఆఫర్లు, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్ యువతను మరింత ప్రభావితం చేస్తున్నాయని నిపుణులు అంటున్నారు. ఈ ట్రెండ్‌ను నియంత్రించాలంటే ప్రభుత్వం, ఫుడ్ రెగ్యులేటరీ సంస్థలు (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. అలాగే ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో కొవ్వు, చక్కెర, ఉప్పు ఎంతమేర ఉన్నాయో సూచించే వివరాలు స్పష్టంగా, పెద్ద అక్షరాలలో గుర్తుపట్టేలా ముద్రించాలని సూచిస్తున్నారు. దీనివల్ల వినియోగదారులు వాటిని కొనుగోలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఆన్‌లైన్ సంస్థల్లో ఇలాంటి ఆహారం విక్రయాలపై కూడా కఠిన నిబంధనలు పెట్టాలని కోరుతున్నారు. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో ఈ ఆహారాన్ని ప్రోత్సహించే ప్రకటనలు, డీల్స్‌పై ఆంక్షలు విధించడం, ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు ప్రచారం కల్పించటం వంటి చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

అంతా అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్డే...

యువత ఆర్డర్ చేస్తున్న వాటిలో ఎక్కువగా అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారమే ఉంటున్నట్లు గుర్తించారు. పారిశ్రామికంగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌గా పిలుస్తారు. ముఖ్యంగా వీటిలో ప్రిజర్వేటివ్స్, ఆర్టిఫిషియల్ ఫ్లేవర్స్ కలర్స్‌తోపాటు అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర, కొవ్వులు ఉంటాయి. రెడీమేడ్ స్నాక్స్, చిప్స్, ప్యాకేజ్డ్ బిస్కెట్లు, శీతల పానీయాలు, కొన్ని రకాల ఇన్‌స్టంట్ నూడుల్స్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. కాగా, ప్రతీ 10 కుటుంబాల్లో 9 ఆన్‌లైన్‌లో విక్రయించే ఆహార పదార్థాల్లో హెచ్ఎఫ్ఎస్ఎస్ ఆహారంపై రెడ్ సింబల్ పెడితే బాగుంటుందని, వాటిని కొనకుండా నిరోధించవచ్చని అభిప్రాయపడ్డాయి.

తూచారా.. దోచారా?

తూకంలో మోసం చేస్తున్న మాంసం, చేపల వ్యాపారులు

» కిలోకు 200 గ్రాముల వరకు తేడాలు

» మటన్ కిలో కొంటే రూ.200 దాకా నష్టం

» సెట్టింగ్స్ మార్చి ఏమార్చుతున్న తీరు

» తూనికలు-కొలతలశాఖ తనిఖీలు

» పలువురు వ్యాపారులపై కేసులు

హైదరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కిలో అంటే 800 గ్రాములు.. అర కిలో అంటే 400 గ్రాములు.. ఇదేం పిచ్చి లెక్క అని పిస్తోందా..? ఎక్కడైనా ఏమోగానీ.. అక్కడ మాత్రం అంతే!! మాంసమో, చేపలో కొంటే వచ్చేది అంతే!! అది మామూలు త్రాసైనా.. ఎలక్ట్రానిక్ కాంటైనా చేతికందేది అంతంతే! ఆదివారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోని మాంసం, చేపల విక్రయ కేంద్రాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్రవీణ్ కుమార్, శ్రీవల్లి, రహీమ్‌ఖాన్, సాయికుమార్ చేసిన తనిఖీల్లో ఈ సంగతి బయట పడింది. కిలో మటన్/చేపలు తీసుకుంటే.. తూకంలో మోసం చేస్తూ, సగటున 800 గ్రాముల మాంసం మాత్రమే ఇస్తున్నారని తేల్చారు. మోసానికి పాల్పడుతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేశారు.

సెట్టింగ్ మార్చి.. బరువులు పెట్టి..

ఆదివారం వచ్చిందంటే చాలు.. ఎక్కడ చూసినా మటన్, చికెన్, చేపల దుకాణాలు కిటకిటలాడుతుంటాయి. గల్లీల్లోని దుకాణాల నుంచి ఖాళీ ప్రదేశాలు, ఫుట్‌పాత్‌లపై గల వ్యాపారులంతా బిజీయే. కొందరు సాధారణ త్రాసుల్లో కనిపించకుండా బరువులు పెడుతూ, ఎలక్ట్రానిక్ కాంటాల్లో సెట్టింగ్స్ మారుస్తూ మోసం చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. సగటున కిలోకు 200 గ్రాముల వరకు తక్కువ ఇస్తున్నట్టు తేల్చారు. అసలే ఆదివారం ధరలు పెంచుతారు. ఆపై తక్కువ తూకంతో వినియోగదారుల జేబులు గుల్ల అవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో మటన్ ఖరీదు కిలోకు సగటున రూ.1,000 వరకు ఉంది. అంటే 200 గ్రాములు తక్కువ ఇస్తే.. వినియోగదారులు రూ.200 నష్టపోయినట్టే. ఇదే తరహాలో చికెన్, సాధారణ చేపల కొనుగోలులో రూ.50 వరకు నష్టపోతున్నారు.



లిబర్టీ వద్ద మత్స్య సహకార సమాఖ్య ఔట్‌లెట్‌లో తనిఖీలు చేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

మత్స్య సహకారశాఖ ఔట్‌లెట్లలో కూడా..

హైదరాబాద్‌లో 5 చోట్ల రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ (టీజీఎఫ్‌సీఓఎఫ్) ఔట్‌లెట్లలో.. 2 మొబైల్ వాహనాల్లో చేపలు విక్రయిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులపై నమ్మకం లేని వినియోగదారులు ఈ ఔట్‌లెట్లలో కొన్నా తూకంలో మోసం తప్పడం లేదు. లిబర్టీ సెంటర్‌లోని ఔట్‌లెట్‌లో కాంటాలను పరిశీలించగా 200 గ్రాములు తేడా వచ్చింది. దీంతో ఔట్‌లెట్ నిర్వాహకులపై అధికారులు కేసు నమోదుచేశారు. సెట్టింగ్స్ మార్చిన కాంటాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.10 వేలు జరిమానా విధించారు. చాలా చోట్ల ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.